అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 15-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 177 Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar 12 పేజీలు వెల : 6.50



ముస్తాబైన ఎర్రకోట

పంద్రాగస్టుకు కట్టుదిట్టమైన భద్రత

ఆరు వేల మంది ప్రత్యేక అతిథులకు ఆహ్వానం

ఆయా రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 2 వేల మంది సంప్రదాయ వేషధారణ


నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

78వ స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు ఢిల్లీలోని ఎర్రకోట ముస్తాబైంది. ఈ వేడుకలకు దాదాపు ఆరు వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మువ్వన్నెల జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ చెక్‌పాయింట్లు పెట్టారు. ఇంటెలిజెన్సీ ఆదేశాల మేరకు వాహనదారులను విస్తతంగా తనిఖీ చేస్తున్నారు. రోడ్లపై భారీ స్థాయిల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఢిల్లీలో భారీగా భద్రతా బలగాలు మోహరించాయి.వివిధ రంగాల్లో రాణించిన, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది పొందిన వారిలో కొందరిని కేంద్రం ప్రత్యేక అతిథులుగా ఈ కార్యక్రమానికి ఆహ్వానించింది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న దేశ క్రీడాకారులకూ ఆహ్వానం పంపింది. దాదాపు 400 మంది పంచాయతీరాజ్ సంస్థల మహిళా ప్రతినిధులను ...10లో

గొంతులేని వారి గొంతుక

నవతెలంగాణ తొమ్మిదో వార్షికోత్సవ శుభ సందర్భంగా పత్రికా నిర్వహణ బందానికి శుభాకాంక్షలు, అభినందనలు. గొంతులేని ప్రజల గొంతుకగా తన అక్షర ప్రస్థానాన్ని అపూర్వంగా కొనసాగిస్తున్న ఈ పత్రిక నవతెలంగాణ. నేను, నా కలం అట్టడుగు, శ్రామిక వర్గాల అభ్యున్నతికే కషి చేశాయి. ముని మనవడు నాటకమైనా, ఊరబావి కథైనా, రంధినవలైనా, సాహిత్య విమర్శ అయినా, కవిత్వమైనా... సామాన్యుని జీవితాన్ని ప్రతిబింబించేవే. నేను అభ్యుదయ నవ సాహిత్యానికి కట్టుబడి ఉండటానికి నాటి ప్రజాశక్తి, నేటి నవ తెలంగాణ పత్రికలు నాకు నిత్యం ప్రేరణగా నిలిచాయి.

\- ఇనాక్ కొలకలూరి



రాష్ట్రాలకే రాయల్టీ హక్కు



2005 నుంచి గనులు, ఖనిజ భూములపై బకాయిలు అడగొచ్చు : సుప్రీం స్పష్టీకరణ

- జులై 25 నుంచి అమలు చేయాలన్న కేంద్రం..తిరస్కరించిన సుప్రీం
- ఫెడరలిజం పరిరక్షణకు కేంద్రం జోక్యం ఉండకూడదు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గనులు, ఖనిజ భూములపై రాయల్టీ వాపస్ విషయంలో అత్యున్నత న్యాయస్థానంలో రాష్ట్రాలకు భారీ విజయం దక్కింది. 2005 ఏప్రిల్ 1 నుంచి రాయల్టీ బకాయిలను కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్రాలు కోరవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. రాయల్టీపై ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఈ ఏడాది జులై 25 నుంచే అమలు చేయాలన్న కేంద్రం అభ్యర్థనను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. కేంద్రం, గనుల కంపెనీలు ఇవ్వాల్సిన బకాయిలను రానున్న 12 ఏండ్లలో దశలవారీగా చెల్లించాలని స్పష్టం చేసింది. అలాగే.. వీటిపై ఎలాంటి పెనాల్టీలు విధించొద్దని రాష్ట్రాలను ఆదేశించింది. ధర్మాసనం 1957 నాటి మైన్స్ అండ్ మినరల్స్ (అభివృద్ధి, నియంత్రణ) చట్టం నుంచి స్వతంత్రంగా మైనింగ్ ...11లో

ఎమ్మెల్సీల నియామకాన్ని నియంత్రించలేం

గవర్నర్ నిర్ణయాన్ని ఆపలేం : దాసోజు శ్రవణ్ కుమార్, సత్యనారాయణ పిటిషన్‌పై సుప్రీం

వివరాలు 11లో

ప్రపంచంతోనే పోటీ

పదేండ్లలో రూ.లక్షకోట్ల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఫ్యూచర్ సిటీదే భవిష్యత్ : కాగ్నిజెంట్ క్యాంపస్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పారిశ్రామికాభివృద్ధిలో ప్రపంచంతోనే తాము పోటీ పడుతున్నామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే పదేండ్లలో తెలంగాణ రూ.లక్షకోట్ల ఆర్థికాభివృద్ధి సాధించాలనేదే తమ లక్ష్యమని చెప్పారు. విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఆయన బుధవారంనాడిక్కడి కోకాపేటలో కాగ్నిజెంట్ సంస్థ నూతన క్యాంపస్‌ను ప్రారంభించారు. ప్రపంచ అవసరాలు తీర్చేలా అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో భవిష్యత్ నగరాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు 430 సంవత్సరాల చరిత్ర ఉందనీ, ఈ నగర వ్యవస్థాపకుడు కులీకుతుబ్ షా నుంచి తన వరకు ఎవరు పాలించినా, వ్యవస్థలు మారినా, విధానాలతో సంబంధం లేకుండా అందరూ దీని అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారగానే ఇక్కడి నుంచి పెట్టుబడులు అక్కడి తరలిపోతాయనే చర్చను కొందరు ప్రారంభించారనీ, కానీ తన పోటీ పొరుగురాష్ట్రాలతో కాదనీ, ప్రపంచంతోనే అని స్పష్టం చేశారు. 1992లో ఐటీ పరిశ్రమలకు నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తే, ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రాజశేఖర్‌రెడ్డి దాని అభివృద్ధిని కొనసాగిస్తూ, సైబరాబాద్ నిర్మించారని తెలిపారు. తాము నూతనంగా నిర్మించబోయే భవిష్యత్ సిటీలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ జరుగుతుందని స్పష్టం చేశారు. పదిరోజుల తన విదేశీ పర్యటనలో రూ.31,500 కోట్ల పెట్టుబడులు పెట్టి, 30,750 మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించేలా ఒప్పందాలు జరిగాయన్నారు. త్వరలోనే మరిన్ని ఒప్పందాలు జరుగుతాయనీ, పెట్టుబడులకు సంబంధించి సమావేశాల నిర్వహణ కోసం ఇన్వెస్టర్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కాగ్నిజెంట్ సంస్థ విస్తరణకు ప్రభుత్వం తరఫున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రెండో సంస్థగా కాగ్నిజెంట్ గుర్తింపు పొందిందనీ, 2002లో హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ సంస్థ లక్ష మందికిపైగా ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. తాము నిర్మించే భవిష్యత్ (ఫ్యూచర్) సిటీలో కూడా కాగ్నిజెంట్ ప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రం, దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే పారిశ్రామిక విధానం పారదర్శకంగా ఉండాలని, పెట్టుబడిదారులను ప్రోత్సహించే విధానం ఉండాలని తమ ప్రభుత్వం విశ్వసిస్తుందని తెలిపారు. అందుకే ప్రభుత్వం మారినా విధానాల్లో మార్పు చేయలేదనీ, ఇంకా వేగంగా, పారదర్శకంగా, పట్టుదలతో తాము పనిచేస్తున్నామని అన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్ నగరం ఒక్క రోజులో అభివృద్ధి చెందలేదనీ, అంచలంచలుగా ఎదుగుతూ వచ్చిందని చెప్పారు. దావోస్ పర్యటనలో తాము కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, కాగ్నిజెంట్ అమెరికస్ ప్రెసిడెంట్, ఈవీపీ సూర్య గుమ్మడితో క్యాంపస్ విస్తరణపై చర్చించామన్నారు. కేవలం ఆరునెలల్లోనే వారు స్పందించి ఇక్కడ క్యాంపస్ విస్తరణ పూర్తి చేసి, మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ వంటి విభిన్న రకాల ప్రతిభను అన్వేషిస్తున్నదనీ, దానికి అవసరమైన నైపుణ్యాల అభివృద్ధికి వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాగ్నిజెంట్ ఈవీపీ, కాగ్నిజెంట్ అమెరికస్ ప్రెసిడెంట్ సూర్య గుమ్మడి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కాగ్నిజెంట్‌కు 3.46 లక్షల మంది ఉద్యోగులు ఉంటే, దానిలో భారతదేశంలో 2.40 లక్షల మంది, ...11లో

వినేశ్ ఫోగట్‌కు నిరాశే..



అనర్హత పిటిషన్ తిరస్కరణ



పారిస్ : ఒలింపిక్స్ పోటీల్లో భాగంగా రెజ్లింగ్‌లో తనపై విధించిన అనర్హతను సవాలు చేస్తూ వినేశ్ ఫోగట్ చేసిన అభ్యర్థనను కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) తిరస్కరించింది. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం కొట్టివేసింది. పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫ్రీస్టైల్ 50 కేజీల విభాగంలో 100 గ్రాములు అదనంగా బరువు ఉందని వినేశ్‌పై అనర్హత వేటు పడింది. ఆ నిర్ణయాన్ని సవాల్ చేయడంతోపాటు ఫైనల్లో ఓడిన లోపెజ్ (క్యూబా)తో కలిసి తనకు రజత పతకం ఇవ్వాలని వినేశ్ అప్పీలు చేసింది. కాస్ తీర్పు వచ్చేదాకా పారిస్‌లోనే ఉండాలని ఫోగట్ నిర్ణయించింది. అయితే తీర్పు వ్యతిరేకంగా రావటంతో..ఆమె ఏ విధంగా ముందుకెళ్తారన్న దానిపైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సీఎం బృందానికి ఘన స్వాగతం

పన్నెండు రోజుల విదేశీ పర్యటనను ముగించుకుని బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ బృందానికి శంషాబాద్ విమానాశ్రయంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సీఎం బృందంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి ...11లో

25 కంపెనీలతో ఒప్పందాలు

రూ.36 వేల కోట్ల పెట్టుబడులు...

సీఎం రేవంత్ విదేశీ పర్యటన జయప్రదం

ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించామన్న ప్రభుత్వం 2లో..

తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ

ప్రకటించిన కాంగ్రెస్... ఎన్నిక లాంఛనమే

హిమాచల్‌లో భంగపడి, తెలంగాణకు.. 11లో..



అనుదినం జనస్వరం
ఉమ్మడి నల్లగొండ జిల్లా
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ADVT Feature
పేజీలు : 8
గురువారం 15, ఆగష్టు 2024
ప్రత్యేక అనుబంధం



జెండాను ఎగరేద్దాం గుండెల్లో

వందల సంవత్సరాల బానిస సంకెళ్లనుండి విడిపడి 77సంవత్సరాల కిందట స్వాతంత్ర్య పతాకను ఎగరేసిన మన పూర్వీకుల ఘనతను స్మరించుకోవడం నేడు మనందరి కర్తవ్యం. మూడురంగుల జెండా మన అస్తిత్వానికి ప్రతీక. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అంటే ప్రస్తుత ఏలికలవలె కేవలం మూడురంగుల జెండాను ఎగురేయడం, సంబరాలు చేసుకోవడం ఎంతమాత్రం కాదు. ఆ జెండా రెపరెపల వెనుక దాగున్న లక్షలాది గుండెల తపనను, వేలాది జీవితాల త్యాగాలను గుర్తుచేసుకోవడం. మన స్వాతంత్ర్యం ఎంతవిలువైనదో, రక్తతర్పణాలు చేసిన నాటి త్యాగధనుల దేశభక్తి ఎంతగొప్పదో స్మరించడం, ఆలోచించడం, వారి స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడం. ఇదే త్రివర్ణపతాకానికి మనమిచ్చే నిజమైన గౌరవం.

మనం గొప్పగా చెప్పుకుంటున్న ఈ కాలంలో కూడా ఒంటరిగా పోలీసుస్టేషన్‌కు వెళ్లడానికి జంకుతున్నాం, వ్యవస్థకు వ్యతిరేకంగా గళమెత్తడానికి భయపడుతున్నాం, సామాజిక మాధ్యమంలో కూడా స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తం చేసే సాహసం చేయలేకపోతున్నాం. అటువంటిది వందల సంవత్సరాల బానిసపాలనలో, దేశం బ్రిటిష్ కబంధహస్తాలలో విలవిలలాడుతున్న కాలంలో దేశ స్వాతంత్ర్యం కోసం ఎలుగెత్తడమే కాదు, తమ ధన, మాన ప్రాణాలను తృణప్రాయంగా భారతమాత పాదాలముందు నిండు భక్తితో సమర్పించిన నాటి స్వాతంత్ర్య యోధుల ఘనతను, వారి నిష్కళంక దేశభక్తిని అందిపుచ్చుకోవడమే నేడు మనముందున్న కర్తవ్యం. ప్రపంచ చరిత్రలో అత్యంత పాశవిక ఘటనగా నిలిచిపోయిన 'జలియన్ వాలాబాగ్' సంఘటన ప్రపంచానికి తెలియడానికి నెలరోజులకుపైగా పట్టిందంటే నాటి నిర్బంధాన్ని ఏమని వర్ణించాలి!

నేడు సువిశాల భారతదేశం మన కండ్లముందు సుస్పష్టంగా కనిపిస్తున్నది. కానీ, నాడు 500 సంస్థానాల రూపంలో చిన్నాభిన్నంగా ఉన్న ప్రాంతాన్ని ఒక దేశంగా ఊహించుకుని, మాతృదేశ విముక్తికోసం ఎలుగెత్తిన నాటి తరాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సింది పోయి మనలో కొందరు వారి చిత్తశుద్ధిని ప్రశ్నించడం, వికృత ఉద్దేశాలను నాటి మహనీయులకు ఆపాదించడం విడ్డూరం, దురదృష్టకరం. సర్వసత్తాక ఘనతంత్ర దేశంలో జీవిస్తూ కూడా విదేశీ పెట్టుబడులకు, సామ్రాజ్యవాదులకు దాసోహమంటున్న

మిగతా 4,5లో

నవతెలంగాణ అక్షరం.. ప్రజలకు ఆయుధం

● మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

నవతెలంగాణలో వచ్చే ప్రతి అక్షరం ప్రజలకు ఆయుధంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆయన నవతెలంగాణ ప్రతినిధులతో మాట్లాడారు. నవతెలంగాణ పత్రిక స్థాపించి 9 సంవత్సరాలు పూర్తయిందని పదవ సంవత్సరం అడుగుపెడుతుందని తెలిపారు 9 ఏళ్ల కాలంలో ప్రజల పక్షాన వారి గొంతుకగా మారి నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ వాటి పరిష్కారం కోసం తమ వంతు పాత్ర పోషిస్తుందన్నారు కార్మికులు, కర్షకులు, రైతులు, నిరుద్యోగులు, మహిళలు, వ్యవసాయ కార్మికులు, కూలీలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం రాజులేని వార్త కథనాలు అందించినట్లు తెలిపారు. ప్రజల సహకారంతో ప్రజల పక్షాన అక్షరాలు అందిస్తూ వారిలో చైతన్యం తీసుకొస్తుందని చెప్పారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవాని దీక్షతో ప్రజలకు మంచి చేయాలని సంకల్పంతో నవతెలంగాణ పత్రిక ముందుకు వెళుతుందని భవిష్యత్తులో మరిన్ని ప్రజలకు ఉపయోగపడే కథనాలు అందించి అభివృద్ధి బాటలో ప్రయాణించాలని కోరారు వార్షికోత్సవం సందర్భంగా పత్రిక యాజమాన్యానికి విలేకరులకు సిబ్బందికి పాఠకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజల గొంతుకగా ప్రతిధ్వనిస్తుంది

● రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి



నవతెలంగాణ-రామన్నపేట

ప్రజాశక్తి నుండి నవతెలంగాణగా అవతరించి అనుదినం జనస్వరంగా నిలుస్తూ నిజాన్ని నిర్భయంగా చాటిచెప్పే ప్రజల గొంతుక నవతెలంగాణ పత్రిక అని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి కొనయాడారు. నవతెలంగాణ ప్రజల పక్షం నిలుస్తూ ప్రతిధ్వనిస్తూ ముందుకుపోతూ తొమ్మిది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నవతెలంగాణ దినపత్రిక పాఠకులకు, ప్రకటనకర్తలకు, పత్రిక ఉద్యోగులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో వెలికి తీసి ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ముందుకుసాగుతుంది. రైతు, కూలీ, కార్మిక, విద్యార్థి, యువత, మహిళలు అన్ని వర్గాల సమస్యలను వెలికితీసి పరిష్కారానికి మార్గం చూపుతుంది. ప్రభుత్వ పాలకులు ఇచ్చిన హామీలను, పాలన లోపాలను ఎత్తి చుపి ప్రజల పక్షాన గొంతుకవుతుంది. శాస్త్రీయ ఆలోచనను పెంపొందించేలా మూఢత్వాలు జాడ్యాలను రూపుమాపుతూ చైతన్య దీపికవుతుంది.

నవతెలంగాణ పత్రిక అంటేనే పేద ప్రజల పత్రిక

● చిలుకూరు ఎస్ఐ సురభి రాంబాబు



నవతెలంగాణ-చిలుకూరు

నవతెలంగాణ పత్రిక అంటేనే పేద ప్రజల పత్రిక అని చిలుకూరు ఎస్ఐ సురభి రాంబాబు అన్నారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరంతరం పేదల సాధకబాధకాలపై నవతెలంగాణ పత్రిక నడవడం హర్షించదగ్గ విషయంన్నారు. ప్రస్తుత సమాజంలో అన్ని పార్టీలపై ఆ పార్టీల రాజకీయ నాయకులపై వాస్తవాలు రాసే పత్రిక నవ తెలంగాణ పత్రిక అన్నారు. వాస్తవాలను వెలికి తీసే పత్రిక అన్ని ఆటుపోటులను ఎదుర్కొనే శక్తి ఉన్న పత్రిక సమాజానికి ఆయు:వుపట్టు అని, సమాజంపై మక్కువతో నిరంతరం నూతన ఉత్సాహంతో నడిచే పత్రిక ఎక్కువగా రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారులు నిరంతరం నవతెలంగాణ పత్రికను చదువుతున్నారన్నారు. రానున్న రోజులలో నవతెలంగాణ పత్రిక అగ్రస్థానంలో నిలవాలని కోరుకుంటున్నా.. నవతెలంగాణ పత్రిక విలేకరులకు యజమాన్యానికి హృదయపూర్వక 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

ప్రజాపక్షం వహించే పత్రికలకే మనుగడ

● హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు



నవతెలంగాణ-హుజూర్‌నగర్

ప్రజాపక్షం వహించి, నీతి నిజాయితీ నిబద్ధత మరియు వాస్తవాలను రాసే పత్రికలకే రాబోయే రోజుల్లో మనుగడ ఉంటుందని హుజూర్నగర్ సీఐ చరమందరాజు అన్నారు. పత్రికల్లో ముద్రించే వార్తలు వాస్తవానికి దగ్గరగా ఉండాలన్నారు. తమ సర్కులేషన్ పెంచుకోవటానికో లేదా ఎవరికో ఒకరికి వత్తాసు పలికే విధంగా వార్తలు ఉండరాదని, అబూత కల్పనలు చేయరాదన్నారు. నవతెలంగాణ తొమ్మిది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పత్రిక యాజమాన్యానికి సిబ్బందికి విలేకరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పత్రికలు ప్రజలలో చైతన్యం కలిగించే వార్తలు అవగాహన పెంపొందించే వార్తలు ప్రజలకు విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీసు ఉన్నతాధికారులు సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు గంజాయి మత్తుమందు పదార్థాల అమ్మకం వాడకం సరఫరాపై ఉక్కు పాదం మోపామన్నారు. కళాశాలలోనూ పాఠశాలలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు మత్తుమందు వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలు వాడకం మరియు నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.



ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పత్రిక

● సీఐ శ్రీను నాయక్

నవతెలంగాణ-తుంగతుర్తి

ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు వెలికితీస్తూ.. వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతున్న పత్రిక నవతెలంగాణ అని తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్ అన్నారు. ప్రజాసమస్యలు వెలికితీయడంలో నవతెలంగాణ ముందు వరుసలో ఉంటుందని, విజయవంతంగా 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న నవతెలంగాణ పత్రిక యాజమాన్యానికి, విలేకరులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడుతూ అనుక్షణం ప్రజల పక్షాన ఉంటూనే, ప్రజలు ఎదుర్కొంటున్న ఏ సమస్య అయినా వెలికితీసి వాస్తవాలను ఉన్నది ఉన్నట్లుగా పత్రికల్లో ప్రచురించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రజా సమస్యలను ఆర్టికల్‌లో వెలికి తీయడం నవతెలంగాణకే సాధ్యమన్నారు. రాబోయే రోజుల్లో పత్రిక మరింత అభివృద్ధి చెంది ఎల్లవేళలా ప్రజలపక్షాన ఉంటూనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా తుంగతుర్తి సర్కిల్ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యలు వెలికి తీయడంలో.. 'నవతెలంగాణ' ప్రత్యేకం



● ఆర్డీవో సూర్యనారాయణ

నవతెలంగాణ-కోదాడరూరల్

ప్రజా సమస్యలు వెలికి తీయడంలో నవతెలంగాణ పత్రికకు ప్రత్యేక గుర్తింపు సంతరించుకుంది. ఇంకా అనేక సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. వాటిని కూడా వెలుగులోకి తీసుకునిరావాలి. నవతెలంగాణ పత్రిక 9వ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

నైతిక విలువలకు ప్రతీక నవతెలంగాణ

● మహాత్మా గాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

సమాజంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రజల శ్రేయస్సుకై, అనునిత్యం పాటుపడే ప్రజాస్వామ్య ఫలాలను ప్రజలకు అందించడంలో పత్రికలు చాలా అమోఘమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. సామాన్యుని అవసరాలకు, ప్రభుత్వ విధి విధానాలను, సమాజంలో అనునిత్యం జరుగుతున్న మార్పులను ఎలుగెత్తి చాటుతో సమాజ అభివృద్ధిలో కీలకపాత్రను పోషించడంలో నవతెలంగాణ దినపత్రిక నైతిక విలువలతో కట్టుబడి ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికలు ప్రజలకు పత్రికలు కళ్లద్దాలు లాగా ఉపయోగపడి సామాజిక రుగ్మతలను రూపుమాపే దివ్య ఔషధముగా పేర్కొనబడతాయి. కావున మనమంతా పత్రిక స్వేచ్ఛను గౌరవిస్తూ వారికి సహకరిస్తూలో సమాజ అభివృద్ధిలో సమస్యలను కూకటి వేళ్ళతో నిర్మూలించేందుకు నడుం బిగించాల్సిందిగా కోరడమైనది. నవతెలంగాణ పత్రిక ఇట్టి విషయాల్లో రాజీలేని పోరాటాలు చేస్తూ నైతిక విలువలకు కట్టుబడి తనదైన శైలిలో సమాజాభివృద్ధికి తోడుపాటు చేస్తున్నందుకు అభినందనలు. నవతెలంగాణ దినపత్రిక తొమ్మిదో వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాం. మునుముందు మరెన్నో అభివృద్ధి పథంలో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను.

ప్రభుత్వానికి ప్రజల మధ్య వారధిగా నవతెలంగాణ

మిర్యాలగూడ ఆర్డీవో జి శ్రీనివాసరావు



నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రభుత్వానికి ప్రజల మధ్య వారధిగా నవతెలంగాణ పత్రిక నిలిచిందని మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాసరావు తెలిపారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ఆ పత్రిక ప్రతినిధితో మాట్లాడారు. 9 ఏళ్ల కాలం పాటు నవతెలంగాణ పత్రిక అనేక ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చింది అన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణ పై అనేక కథనాలు అందించి ఆ భూములు కాపాడడంలో నవతెలంగాణ తమ వతు పాత్ర పోషించింది అన్నారు సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందించడంలో నవ తెలంగాణ కృషి చేసిన అన్నారు 9 ఏళ్ళు కాలంలో అనేక ప్రజా సమస్యలు వెలుగులోకి తీసుకొచ్చి వాటి పరిష్కారం కోసం పత్రిక కృషి చేసిన అన్నారు 10వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా పత్రిక యాజమాన్యానికి సిబ్బందికి విలేకరులకు పాఠకులకు శు భాకాంక్షలు తెలిపారు.









క్లిష్ట పరిస్థితులను ఎదిరించి నిలదొక్కుకుంటున్న నవ తెలంగాణ



- **వేముల వీరేశం, నకిరేకల్ ఎమ్మెల్యే**

నవతెలంగాణ- నకిరేకల్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజాశక్తి దినపత్రిక నవ తెలంగాణ దినపత్రికగా మారి అనేక సమస్యలను వెలికితీస్తుంది. స్పష్టమైన, శాస్త్రీయమైన అవగాహనను ప్రజలకు, విద్యార్థులకు, యువతకు, రాజకీయ నాయకులకు నిత్యం అందిస్తూ ప్రజలను చైతన్యం చేస్తూ 9 వసంతాలు పూర్తిచేసుకుని పదవ వసంతంలోకి అడుగుతున్న శుభ సందర్భంగా పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, విలేకరులకు శుభాకాంక్షలు. నిజం వైపు సమాజాన్ని నడుపుతున్నందుకు వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. దశాబ్ద కాలంగా ప్రజల పక్షాన నిలబడి ప్రజా గొంతుక గా ఉందన్నారు. రోజురోజుకు సమాజంలో జర్నలిజంలో వస్తున్న అనేక రకాల పరిణామాలను చూస్తే ఏ పరిణామాలనైనా తట్టుకొని, ఎలాంటి క్లిష్ట పరిస్థితుల నైనా ఎదిరించి నిలబడి నిలదొక్కుకుంటున్న పత్రిక నవ తెలంగాణ. ప్రజల పక్షాన ఈ పత్రిక కొనసాగించాలని, కొనసాగిస్తుందని మనస్ఫూర్తిగా ఆశిస్తున్న.

ప్రజల పక్షాన నిలబడిన పత్రిక నవ తెలంగాణ



- **చిరుమర్తి లింగయ్య, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే**

నవతెలంగాణ- నకిరేకల్

ప్రజలు, రైతులు, అన్ని వర్గాల పక్షాన నిలబడే పత్రికలలో నవతెలంగాణ ముందు వరుసలో ఉంటుంది. పత్రికలో వచ్చే కథనాలు, అనేక అంశాలు ప్రజాభిప్రాయాలను వ్యక్తపరిచే విధంగా ఉంటాయి. భవిష్యత్తులో పత్రిక మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను. బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం కొట్లాడుతున్న పత్రిక నవ తెలంగాణ. ప్రజా సమస్యలను ఎలుగెత్తి పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పోరాటం చేస్తూ లక్షలాది కార్మిక, కర్షక, రైతుల పక్షాన నిలిచింది. ప్రజా చైతన్యం ప్రజా పోరాటమే అన్ని సమస్యలకు పరిష్కారం అని ప్రజలను నిత్యం జాగృతం చేస్తుంది .తొమ్మిదవ సంవత్సరం నుండి పదవ సంవత్సరంలోకి అడుగుతున్న శుభ సందర్భంలో పత్రిక యాజమాన్యానికి, విలేకరులకు, సిబ్బందికి శుభాకాంక్షలు. పత్రిక ముున్ముందు మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను.

ప్రజల పక్షాన నిలిచిన పత్రిక



- **మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్**

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రజలపక్షాన నిరంతరం నిలిచిన పత్రిక నవతెలంగాణ అని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు కార్మికులు రైతులు యువకులు, నిరుద్యోగులు వ్యవసాయ కూలీల పక్షాన అనేక కథనాలు అందించి వారి సమస్యల పరిష్కారం కోసం శ్రమించిందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంది సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందించడంలో తమ వంతు పాత్ర పోషించిందన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపైనే అక్షర ఆయుధంగా కథనాలు అందించి వారిలో చైతన్యం తీసుకొచ్చారని చెప్పారు భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల పక్షాన నిలవాలని కోరారు. 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని పదవ సంవత్సరంలోకి అడిగేదుతున్న సందర్భంగా నవతెలంగాణ పత్రికకు యాజమాన్యానికి విలేకరులకు సిబ్బందికి పాఠకులకు శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలి

- **సీఐ వెంకట్**

నవతెలంగాణ-చండూరు



నవతెలంగాణ దినపత్రిక ధైర్యంగా, నిర్భయంగా, నిజానిజాలు, వాస్తవాలు, ప్రజా సమస్యల మీద, రాయడంలో ముందుండి నడుస్తున్న పుత్రిక... తొమ్మిదవ వార్షికోత్సవ సందర్భంగా పోలీస్ శాఖ తరఫున శుభాకాంక్షలు భవిష్యత్తులో మరి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుతున్నాను.డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల కు వ్యతిరేకంగా పత్రిక తన వంతు పాత్ర పోషించాలని సూచిస్తున్నాను.

ప్రజా సమస్యలను వెలికితీయడంతో ముందు



- **కేతపల్లి ఎస్సై శివతేజ**

నవతెలంగాణ -కేతెపల్లి

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి చేరవేయడంలో నవ తెలంగాణ దినపత్రిక ముందు వరుసలో ఉంటుందని కేతపల్లి ఎస్సై శివతేజ అన్నారు. నవ తెలంగాణ దినపత్రిక 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆ పత్రిక విలేకరితో మాట్లాడారు. నవతెలంగాణ పత్రిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తూ ఉంటుందని అన్నారు. గంజాయి మాదక ద్రవ్యాల నిర్మూలనకు పత్రికలు ప్రజలను చైతన్య పరుస్తూ కృషి చేయాలన్నారు..

పేద వర్గాల ఉన్నతికి తోడ్పాటునందిస్తున్న నవతెలంగాణ



- **దైద రవీందర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, నకిరేకల్**

నవతెలంగాణ- నకిరేకల్

పేద వర్గాల ప్రజలకు వారి ఉన్నతికి నవ తెలంగాణ పత్రిక తోడ్పాటు అందించడం అభినందనీయం. నవ తెలంగాణ పత్రిక తొమ్మిది సంవత్సరాల ప్రస్థానంలో అనేక రకాల ఒడిదుడుకులను ఎదుర్కొంటూ మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి వివరిస్తూ వాటి పరిష్కారం కోసం నవతెలంగాణ చేస్తున్న ప్రయత్నం హర్షనీయం. ప్రజలకు ప్రభుత్వానికి నవతెలంగాణ వారధిగా ఉంది. 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని పదవ సంవత్సరంలోకి అడిగిడుతున్న నవతెలంగాణ యాజమాన్యానికి విలేకరులకు సిబ్బందికి శుభాకాంక్షలు. ముున్ముందు పత్రికను మరింత ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నాను.

ప్రజల ఆకాంక్షలకు అక్షర రూపం నవ తెలంగాణ



- **డాక్టర్ ఎస్ కిరణ్ కుమార్,మండల ప్రత్యేక అధికారి, నకిరేకల్**

నవతెలంగాణ- నకిరేకల్

ప్రజల ఆకాంక్షలకు అక్షర రూపం నవతెలంగాణ దినపత్రిక దినదిన ప్రవర్తమానమై వెలుగొందుతుంది. అంకితభావంతో పనిచేస్తున్న విలేకరులు, సిబ్బంది ఈ పత్రికకు ఆయువుపట్టు. సమాజం పట్ల గౌరవంతో, ప్రజల పట్ల నిబద్దలతో పనిచేస్తున్న పత్రిక నవతెలంగాణ. 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని పదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పత్రిక ఉన్నతికి కారణమైన ప్రతి ఒక్కరికి అభినందనలు భవిష్యత్తులో ఇది మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్న.

నవతరానికి ప్రేరణ

- **చండూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యం**

నవతెలంగాణ-చండూరు



నవతెలంగాణ దినపత్రిక నవతరానికి ప్రేరణగా అనేక రకాల విషయాలపై చక్కటి సమాచారాన్ని ఇస్తూ చైతన్య పరుస్తున్నది. ఈ పత్రిక తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు. ఈ పత్రిక ఇలాగే సమాజ మార్పునకు అనేక రకాల విషయాలపై ప్రజలను చైనత్యపరచాలి. రాజకీయంగా, సామాజిక, సాంస్కృతికంగా, అవగాహనను పెంచుతూ ముందుకెళ్లాలి. సమకాలీన రాజకీయ పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న సమయంలో ప్రపంచీకరణ కాలంలో ఇలాంటి ఆలోచన ధార కలిగిన పత్రికలు చారిత్రక అవసరం. ఇది పది కాలాలపాటు ప్రజలకు అండగా ఉండాలి.

ప్రజల అక్షర గొంతుగా నవతెలంగాణ

- **మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్**



నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రజల అక్షర గొంతుగా నవతెలంగాణ నిలిచిందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నవతెలంగాణ ప్రతినిధితో మాట్లాడారు. నవతెలంగాణ పత్రిక స్థాపించి 9 సంవత్సరాలు పూర్తిఅయి పదో వసంతంలో అడుగు పెడుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిదేళ్ల కాలంలో ప్రజా సమస్యలపై రాజీలేని వార్తలు అందించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని చెప్పారు. కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎడగడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అక్షర గొంతుకగా నవతెలంగాణ మారింది. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై ప్రజల గొంతుకగా నిలిచి సమస్యల పరిష్కారం తోపాటు సంస్థ అభివృద్ధి చెందాలని కోరారు వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి సిబ్బందికి విలేకరులకు పాఠకులకు శుభాకాంక్షలు తెలిపారు.

జెండాను ఎగరేద్దాం గుండెల్లో...

మొదటి పేజీ తరువాయి..

కొందరు నేటితరం సూడో దేశభక్తులనేమనాలి? నిర్బంధంలో కూడా రాజీపడకుండా గుండె ధైర్యాన్ని ప్రదర్శించిన, జీవితాలను తృణప్రాయంగా త్యాగంచేసిన నాటి స్వాతంత్ర యోధుల నిజాయితీని, నిష్కళంక దేశభక్తిని, ఔన్నత్యాన్ని దురుద్దేశంతో తూలనాడటం ఆకాశం మీద ఉమ్మేయడమే.

మువ్వన్నెల జెండావెనుక దాగున్న మన పూర్వుల ఉద్దేశాలను, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, కులమతాలకతీతమైన శాంతి, సహనం, సామరస్యాల ఔన్నత్యాన్ని నిలబెట్టడం, కొనసాగించడంలోనే మన దేశభక్తి దాగున్నదనేది అక్షరసత్యం. ఏడున్నర దశాబ్దాల కిందట ఆ స్ఫూర్తిదాతలు మనకందించిన ఆ జయకేతాన్ని నిజంగా ఎగురేయాల్సింది మనింటి గోడలమీదనో, సందు చివర జెండా గద్దెల మీదనో కాదు, మన గుండెల మీద.

నవతెలంగాణ సిబ్బందికి యాజమాన్యానికి అభినందనలు

- **చండూరు తహసీల్దార్... దశరథ**

నవతెలంగాణ-చండూరు



తనదైన ముద్ర వేసుకున్న నవతెలంగాణ దినపత్రిక 9వ వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి, క్షేత్రస్థాయి ప్రతినిధులకు శుభాభినందనలు. సమాజానికి ఒక దిశా నిర్దేశం ఇస్తూ... పాఠకుల్లో ప్రత్యేక స్థానం పొందిన నవ తెలంగాణ దినపత్రిక దినదినాభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను. న్యాయం, ధర్మం వైపు ఉంటూ.. ప్రజల పక్షాన నిలిచి సమాజాభివృద్ధిలో పత్రిక కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తున్నాను.









ప్రజల సమస్యలపై స్పందించి రాసే .. నవ తెలంగాణపత్రికకు 9 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

- **మండల వైద్యాధికారి -కొమ్మగోని నగేష్ -పెదవూర**

నవతెలంగాణ-పెద్దవూర




సమాజంలో పత్రికల పాత్ర చాలా క్రియా శీలకమైంది. మారు మూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల స్థితిగతులు సమాజంలో అరాచకాలు అసమాన తలపైన,ప్రజా సమస్యల పైన నిర్భయంగా నవతెలంగాణ వార్తలు రాస్తుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు మేమున్నామంటూ ప్రజలకు భరోసా ఇచ్చే విధంగా పత్రికలో వార్తలు వస్తు న్నాయి .ఇలాగే ప్రజా సమస్యలపై గళం విప్పి మరెన్నో కథనాలు రాస్తూ అందరి అదరాభి మానాలు పొందాని కోరు కుంటూ.. నవ తెలంగాణ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

















ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న నవతెలంగాణ

- చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్



నవతెలంగాణ పత్రిక నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 9 ఏండ్లుగా నాణ్యమైన వార్తలు రాస్తూ ప్రజల్లో మంచి స్పందన ఉంది. మున్ముందు నవ తెలంగాణ మరింత అభివద్ధి చెందాలి. నవ తెలంగాణ యాజమాన్యం, విలేకర్లకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

ప్రజల కోసం పనిచేసే పత్రిక నవతెలంగాణ

- చౌటుప్పల్ మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు

నవతెలంగాణ-చౌటుప్పల్



తెలంగాణ మున్సిపల్ ఛాంబర్స్ హైద్రాబాద్ ప్రజల పక్షాన నిలబడి ప్రజల కోసం ప్రజానంక్షేమం కోసం ప్రజల గొంతుకై వెలుగెత్తి చాటి నవతరం యువతరం భవిష్యత్ కోసం వారధిగా నిలబడిన నవ తెలంగాణ పత్రిక.ప్రజల్లో చైతన్యం, ప్రభుత్వవైఫల్యాలను ఎండగడుతూ ప్రజాబివృద్ధే లక్ష్యంగా తెలంగాణ పతాకాన్ని దేశంలో అగ్రగామిగా నిలిపేలా నిత్యకత్యమై పనిచేస్తూ అందర్ని స్ఫూర్తిదాయకమైన నవతెలంగాణ పత్రికకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.



నవతెలంగాణ వార్షికోత్సవ శుభాకాంక్షలు

- చిట్యాల మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-చిట్యాల

అనుదినం జనస్వరం అనే నినాదముతో ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నవతెలంగాణ పత్రిక యాజమాన్యానికి, విలేకరులకు, సిబ్బందికి, శ్రేయోభిలాషులకు తొమ్మిదవ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి. చిట్యాల మండల మున్సిపాలిటీ సమస్యలను ఎప్పటికప్పుడు వెలికితీస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల మధ్యన ఉంటూ పత్రికా రంగంలో నవశకానికి నాంది పలికిన నవ తెలంగాణ పత్రిక రాబోయే రోజుల్లో పేద ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజల మన్ననలు చురగొంటూ నవతెలంగాణ అంటే ప్రజల పక్షమని అనే స్థాయిలో ముందుకు వెళ్లతున్న పత్రికకు హృదయ పూర్వక శుభాకాంక్షలు.













కొత్త రచయితలకు ప్రోత్సాహం



బాల సాహితీవేత్త పుప్పాల కృష్ణమూర్తి

నవతెలంగాణ-కోదాడరూరల్

కొత్త కవులను, రచయితలను ప్రోత్స హించడంలో నవతెలంగాణ పత్రిక ముందుంటుంది. నేటి పత్రికా ప్రపంచంలో సాహిత్యానికి చాలా తక్కువ చోటు ఉంది. ఈ నేపథ్యంలో ఉన్న కాస్త చోటును పేరెన్నికగన్న కవులు, రచయితలు ఆక్రమిస్తే కొత్త వారికి స్థానం లేకుండా పోతుంది. ఆలాంటి పరిస్థితుల్లో ఎంతో మంది యువ కవులు, రచయితకు నవ తెలంగాణ చేయూ తనిస్తోంది. కొత్త కవులు, రచయితను ప్రోత్స హించేందుకుగాను 'అంకురం' అనే శీర్షికను ప్రత్యేకంగా నిర్వహించిన ఘనత నవతెలంగాణకు మాత్రమే దక్కుతుంది. సాహిత్య కళా రంగా ల్లోనూ సామాజిక బాధ్యత గల రచనలను, కవులను, కళాకారులను ఎంతో మందిని వెలుగు లోకి తీసుకొచ్చింది నవతెలంగాణ. పత్రిక 9వ వార్షికోత్సవం సందర్భంగా మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను.

ప్రజాపత్రికకు శుభాకాంక్షలు

చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం



ప్రజాపత్రిక నవ తెలంగాణకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. అంకిత భావంతో పని చేస్తున్న విలే కరులు, సిబ్బంది ఈ పత్రికకు ఆయువు పట్టు. నవతెలంగాణ దిన పత్రిక ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి. అనుదినం ప్రజల కోసం పనిచేస్తున్న పత్రిక నవ తెలంగాణ. సమాజం పట్ల గౌరవంతో, ప్రజల పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న పత్రిక నవతెలంగాణ ఇట్లాంటి వార్షికోత్సవాలు మరెన్నో జరుపు కోవాలని కోరు కుంటున్నాను. ప్రజా కోణంలో వార్తలు, విశ్లేషణలు అందిస్తూ ఎప్పటికప్పుడు నూతన ఉత్తేజంతో నవతెలంగాణ పాఠకులకు చేరువవు తోంది. భవిష్యత్‌లో ఇది మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను.



ప్రజలకు అండగా నవతెలంగాణ దినపత్రిక




మాజీ ఎంపీటీసీ.. జాటావత్ జ్యోతికృష్ణ -చింతపల్లితండా

నవతెలంగాణ-పెద్దవూర

రాజకీయాలు,పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందే విధంగా వార్తలు రాసేది నవతెలంగాణ దినపత్రిక మాత్రమే.ఈ రోజుల్లో కొన్ని పత్రికలు పార్టీకి కొమ్ముగాసే విధంగా పని చేస్తున్నాయి.ఈ పరిస్థితుల్లో ఉన్నత వర్గాలకు కొమ్ముకాసే విధంగా కాకుండా ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా వారిని చైతన్యం చేసే విధంగా నవతెలంగాణ దినపత్రిక విలేకరులు పనిచేస్తున్నారు.వారందరికీ తొమ్మిదవ వార్షికోత్సవ శుభాకాంక్షలు.





ప్రజల గొంతుక.. నవతెలంగాణ




చెర్వుగట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి-సిరికొండ నవీన్

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

ప్రతిరోజు ప్రజల యొక్క బాణిని, ప్రజాసమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వానికి, సమాజానికి వారధిగా ప్రజలగొంతుకగా నవ తెలంగాణ దినపత్రిక నిలుస్తుంది.అనుదినం జనస్వరం అనే నినాదంతో ముందుకు సాగుతున్న నవతెలంగాణ దినపత్రిక తొమ్మిదవ వార్షికోత్సవ ప్రత్యేక శుభాభివందనాలు.నవతెలంగాణ దినపత్రిక ప్రజల ఆకాంక్షల మేరకు, ప్రజాస్వామ్యం విలువలను కాపాడుకుంటూ.. మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నా.





ప్రజాపత్రికకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

పెద్దవూర ఎస్సై వీరబాబు

నవతెలంగాణ-పెద్దవూర

ప్రజాపత్రిక నవ తెలంగాణకు నా హృదయ పూర్వక వార్షికోత్సవ శుభాకాంక్షలు. అంకితభావంతో పని చేస్తున్న విలేకరులు, సిబ్బంది ఈ పత్రికకు ఆయువు పట్టు.సమాజం పట్ల గౌరవంతో, ప్రజల పట్ల నిబద్ధతతో పని చేస్తున్న పత్రిక నవతెలంగాణ. ప్రజాకోణంలో వార్తలు, విశ్లేషణలు అందిస్తూ ఎప్పటి కప్పుడు నూతన ఉత్తేజంతో నవతెలంగాణ పాఠకులకు చేరువవుతోంది. 9సంవత్సరాలు పూర్తి చేసుకుని 10వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా పత్రిక ఉన్నతికి కారణమైన ప్రతి ఒక్కరికి అభినందనలు. భవిష్యత్‌లో ఇది మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను.









నవతెలంగాణ







రాష్ట్ర ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్



నవతెలంగాణ-తుంగతుర్తి

మన స్వేచ్ఛ,స్వాతంత్ర్యం కోసం,అశువులు బాసిన సమరయోధుల దీక్ష దక్షతలను స్మరిస్తూ- స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ఎందరో మహానుభావుల, సమరయోధుల త్యాగాల ఫలితంగా సిద్ధించిన "స్వాతంత్ర్యం" ఇది. బానిసత్వపు సంకెళ్లను తెంచుకొని స్వేచ్ఛను పొందిన రోజు ఇది.ఏ దేశంలో లేని విధంగా ప్రాథమిక హక్కులను, ఆదేశ సూత్రాలను, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థలను మనకు అందించారు. అలాంటి వాటిని నిలబెట్టుకోవాల్సిన గురుతర బాధ్యత మనది. మనకు స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏండ్లవుతున్నా రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని, కేసీఆర్ పదేళ్ల పాలనలో 100 సంవత్సరాల అభివృద్ధి సాధించి దేశానికే తెలంగాణ రాష్ట్రం దిక్సూచిలా మారిందన్నారు. అన్నారు. దేశ రక్షణ కోసం సర్వస్వం త్యాగం చేసిన వీర జవాన్లకు నివాళులర్పిస్తూ దేశ ప్రజలందరికీ 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.



ప్రజల పక్షాన నవతెలంగాణ

చండూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళవెంకన్న

నవతెలంగాణ-చండూరు

ప్రజల పక్షాన నిలిచి సమాజాభివృద్ధిలో పత్రిక కీలకపాత్ర పోషిం చాలని ఆకాంక్షిస్తున్నాను. సమా జంలో తనదైన శైలిలో ముద్ర వేసు కున్న నవ తెలంగాణ దిన పత్రిక 9వ వార్షికోత్సవం సంద ర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి, క్షేత్రస్థాయి ప్రతినిధులకు శుభాభినందనలు. సమాజానికి ఒక దిశా నిర్దేశం ఇస్తూ... పాఠకుల్లో ప్రత్యేక స్థానం పొందిన నవతెలంగాణ దినపత్రిక దినదినా భివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను.

ప్రింట్ మీడియాలో తనదైన ముద్రవేసుకున్న నవతెలంగాణ

కె.నాగరాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (చిట్యాల. నార్కట్‌పల్లి)



నవతెలంగాణ-చిట్యాల

ప్రింట్ మీడియాలో తనదైన ముద్ర వేసుకున్న నవ తెలంగాణ దిన పత్రిక 9వ వార్షికోత్సవం సంద ర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి, క్షేత్రస్థాయి ప్రతినిధులకు శుభాభినందనలు. సమాజానికి ఒక దిశా నిర్దేశం ఇస్తూ... పాఠకుల్లో ప్రత్యేక స్థానం పొందిన నవ తెలంగాణ దినపత్రిక దినదినాభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను. న్యాయం, ధర్మం వైపు ఉంటూ.. ప్రజల పక్షాన నిలిచి సమాజాభివృద్ధిలో పత్రిక కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తున్నాను.











నవతెలంగాణ గురువారం 15 ఆగస్టు 2024

సీపీఐ(ఎం) నుంచి ఆర్.రఘు బహిష్కరణ

పార్టీ రాజకీయ విధానం, పార్టీ కార్యక్రమంపై విభేదాలు ఉన్నాయనే నెపంతో పార్టీ విచ్ఛిన్నకర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆర్.రఘును పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి కృష్ణా జిల్లా కమిటీ బహిష్కరించింది. గతంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగాను ఉన్న పరిచయాలను ఉపయోగించుకుని పార్టీని నష్టపరిచే చర్యలకు అయన పాల్పడుతున్నారు.అయన లేవనెత్తిన విషయాలను పార్టీ ఆయనతో చర్చించి సరిదిద్దేందుకు పలు ప్రయత్నాలు చేసింది. వాటిని సరిదిద్దుకోకపోగా పార్టీ విచ్ఛిన్న కార్యకలాపాలు తీవ్రతరం చేసినందున పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించాలని ఈ రోజు (14 ఆగష్టు) ఉయ్యూరులో జరిగిన కృష్ణా జిల్లా కమిటీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.ఈ సమావేశానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు యం.ఎ. గఫూర్, ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు హాజరయ్యారు.

25 కంపెనీలతో ఒప్పందాలు.. రూ.36 వేల కోట్ల పెట్టుబడులు...

- సీఎం రేవంత్ విదేశీ పర్యటన జయప్రదం
- ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించామన్న ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా సాగిన ముఖ్యమంత్రి రేవంత్ విదేశీ పర్యటన జయప్రదమైంది. గతంలో ఎన్నడూ లేనంతగా తెలంగాణకు పెట్టుబడులు భారీగా వెల్లువెత్తాయని ప్రభుత్వం ఈ సందర్భంగా వెల్లడించింది. రేవంత్ బృందం మొత్తం 25 కంపెనీలతో ఒప్పందాలు చేసుకోగా, రూ.36 వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) తెలిపింది. రేవంత్ అమెరికా పర్యటనలో రూ.31,502 కోట్ల పెట్టుబడులు రాగా.. చివరి రెండు రోజుల దక్షిణ కొరియా పర్యటనలోనూ అదే రకమైన స్పందన వచ్చింది. దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచస్థాయి కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. రూ.4,500 కోట్ల పెట్టుబడులకు అక్కడి కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. దీంతో అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల్లో కలిపి మొత్తం రూ.36 వేల కోట్ల పెట్టుబడులను తెలంగాణ సాధించింది. ఫలితంగా ఆయా రంగాల్లో కొత్త సంస్థలు, కొత్త పరిశ్రమలతో వేలాది కొత్త ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

కాగా సీఎం రేవంత్ గత జనవరిలో దావోస్‌లో నిర్వహించిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో సైతం పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రంలో రూ.40,232 కోట్ల పెట్టుబడులకు పలు కంపెనీలు తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి. తాజాగా అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో మరో రూ.36 వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే రూ.76,232 కోట్ల పెట్టుబడుల లక్ష్యాన్ని చేరుకున్న ప్రభుత్వం సరికొత్త రికార్డును నమోదు చేసింది. తద్వారా దేశంలోనే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిన తెలంగాణ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

కంపెనీలకు సీఎం భరోసా...

దక్షిణ కొరియాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి బృందం ప్రధానంగా ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఇంధన స్టోరేజీ, టెక్స్‌టైల్ రంగాలపై దృష్టి సారించింది. ఆయా రంగాల్లో దక్షిణ కొరియాకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ సందర్భంగా పలు కంపెనీలతో సీఎంతోపాటు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చర్చలు, సంప్రదింపులు జరిపారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించి, రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలని ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చే కంపెనీలకు తమ ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. దీంతో అమెరికన్ కంపెనీల తరహాలోనే కొరియన్ కంపెనీల నుంచి భారీ స్పందన లభించింది.

గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

సీఎం చర్చలతో హ్యుందాయ్ మోటార్స్ తెలంగాణలో మెగా ఆటోమోటివ్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. తమ కంపెనీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయటం ద్వారా గ్లోబల్ హబ్‌గా ఎంచుకుంటామని ప్రకటించింది. కొత్త టెస్టింగ్ వాహనాలను తయారు చేసే సదుపాయం తెలంగాణలో అందుబాటులో ఉంటుందంటూ ఆ సంస్థ సంతృప్తిని వ్యక్తం చేసింది.

ఫ్యాషన్ సిటీకి పదెకరాల కేటాయింపు

వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కులో వస్త్ర తయారీ పరిశ్రమలను నెలకొల్పుతున్న యంగ్‌వన్ కంపెనీ హైదరాబాద్‌లో ఫ్యాషన్ సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అందుకు అవసరమయ్యే పదెకరాల స్థలాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీనిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం తరఫున సమ్మతిని తెలుపుతూ ఆయన ఒక లేఖను యంగ్‌వన్ కంపెనీ చైర్మెన్‌కు అందజేశారు.

'కాస్మొటిక్స్'కు పరస్పర సహకారం

కాస్మొటిక్స్ ఇండస్ట్రీలో దక్షిణ కొరియాకు ప్రత్యేక స్థానముంది. ఆ రంగంలో పేరొందిన కంపెనీల పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి అక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాస్మొటిక్స్ తయారీ పరిశ్రమలు నెలకొల్పేందుకు వీలుగా పరస్పర సహకారాన్ని ఆయన కోరారు. తెలంగాణలో వీటి తయారీకి ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలను అన్వేషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కొరియన్ బ్యూటీ ఇండస్ట్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

ఇతర కంపెనీల ప్రణాళికలు...

ఇదే సందర్భంగా మరో మూడు కొరియన్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు తమ ప్రణాళికలను ప్రకటించాయి. డాంగ్‌బాంగ్ ఫార్మా కంపెనీ రూ. 200 కోట్ల పెట్టుబడితో ఏపీఐ తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో నెలకొల్పుతామని ప్రకటించింది. జేఐ టెక్ కంపెనీ ఎల్ఈడీ మెటీరియల్ తయారీ ప్లాంట్‌తోపాటు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చింది. రూ.100 కోట్ల పెట్టుబడులు పెడతామంటూ ఆ సంస్థ ప్రకటించింది. చావి కంపెనీ హైదరాబాద్‌లో ఈవీ ఛార్జింగ్ ఇన్‌ఫ్రాని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది.

చర్చలు.. భవిష్యత్ ప్రణాళికలు...

ఎల్ఎస్ గ్రూప్, పోస్కో, ఎల్జీ, శ్యామ్‌సంగ్, సీ అండ్ టీ, శ్యామ్‌సంగ్ హెల్త్‌కేర్, క్రాఫ్టన్, యూయూ ఫార్మా, జీఎస్ కాల్టెక్స్ కంపెనీల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. భవిష్యత్ విస్తరణ ప్రణాళికలో భాగంగా తెలంగాణను పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా ఎంచుకోవాలని సీఎం ఆయా కంపెనీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

తమ పర్యటనలో భాగంగా కొరియాలోని చెంగియీచియోన్ స్ట్రీమ్ రీడెవలప్‌మెంట్, హన్ రివర్‌ఫ్రంట్ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి బృందం సందర్శించింది. అక్కడ అనుసరించిన కొన్ని అద్భుతమైన నమూనాలను సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం వాటిని పరిగణనలోకి తీసుకోవాలని సీఎం నిర్ణయించారు. ఆయా ప్రాజెక్టుల అభివృద్ధికి అనుసరించిన విధానాలు, వాటిని నిర్వహిస్తున్న తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఇటీవల నిర్వహించిన ఒలింపిక్స్‌లో విజేతలైన వారిలో ఎంతోమందిని ఆ వర్సిటీ తీర్చిదిద్దింది. మన రాష్ట్రంలోనూ అదే తరహాలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు సీఎం యోచిస్తున్నారు.

విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విషజ్వరాల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులు వర్షాలు కురుస్తున్నాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల్లో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో రోగులు కిక్కిరిసిపోతున్నాయని పేర్కొన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అక్కడక్కడా మరణాలు కూడా సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక ఏజెన్సీ, మారుమూల ప్రాంతాలు, మురికివాడల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తగు ప్రాధాన్యతనిచ్చి అవసరమైన సిబ్బంది, మందులను అందించాలనీ, మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

ఫార్మాతో హైదరాబాద్‌కు పెను ప్రమాదం

అభివృద్ధి పేరుతో కమ్మేస్తున్న కాలుష్యం

- నివారణ చర్యలు చేపట్టాలి : 'ఒక విధ్వంసం' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఫార్మా కంపెనీలతో హైదరాబాద్ నగరానికి పెను ప్రమాదం పొంచి ఉందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ చంద్రశేఖర శర్మ రాసిన "ఒక విధ్వంసం 1056/90" పుస్తకావిష్కరణ సభను బుధవారం హైదరాబాద్‌లోని ఓ హెూటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో మనిషి సృష్టిస్తున్న విధ్వంసం పర్యావరణానికి పెను సవాలుగా మారిందని పేర్కొన్నారు. పటాన్‌చెరు కాలుష్య వ్యతిరేక పోరాట ఘటనలు, సుప్రీంకోర్టు కేసు పరిణామాలను గ్రంథస్థం చేస్తూ తీసుకొచ్చిన ఈ పుస్తకం హైదరాబాద్ భవిష్యత్‌ను ప్రశ్నిస్తున్నదని పేర్కొన్నారు. కాలుష్య సమస్య పటాన్‌చెరు, ఖాజీపల్లిది మాత్రమే కాదనీ, మొత్తం నగరాన్ని ఈ భూతం చుట్టి ముట్టిందన్నారు. ఇదే చివరి తరమనే విధంగా మనిషి అన్ని వనరులను తవ్వేస్తూ ప్రకృతిని బొందల గడ్డగా మారుస్తున్నాడని విశ్లేషించారు. జీడీపీ, అభివృద్ధి అంటూ ప్రభుత్వాలు వినాశకర విధానాలను ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. గత సర్కార్ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ లాగే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెట్టుబడుల పేరిట దావోస్, ఇతర యూరప్ దేశాలకు వెళ్లి అదే ఫార్మా కంపెనీలను తీసుకొస్తున్నారని విమర్శించారు. అమెరికా లాంటి దేశాలు ఇలాంటి కంపెనీలకు అనుమతులు ఇవ్వక పోవడంతో అవి హైదరాబాద్ నగరాన్ని ఎంచుకున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ దేశంలో కాలుష్యం వెదజల్లే ఔషధాలను ఉత్పత్తి చేయకుండా భారత్ లాంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ రోగాలను మనకంటగడుతున్నాయని వ్యాఖ్యానించారు. మందుల కంపెనీలు మనుషులను చంపే కంపెనీలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.

గత మూడు దశాబ్దాలుగా పటాన్‌చెరు ప్రాంత ప్రజలు కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నా, నగర ప్రజలు తమకేమి పట్టనట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా పౌర సమాజం ఈ మహమ్మారికి వ్యతిరేకంగా నినదించాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర జ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలకు వచ్చినంత స్పందన పర్యావరణ ఉద్యమాలకు రావడం లేదని అన్నారు. ప్రజలు ప్రత్యక్షంగా తమదాకా వస్తేగాని నోరుమెదపని అచేతనావస్థలోకి జారి పోయారని వ్యాఖ్యానించారు. ఎవరైనా నిలదీస్తే వారిపై అభివృద్ధి నిరోధకులంటూ ముద్ర వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ విజయ్ మాట్లాడుతూ ఫార్మా కెమికల్ కంపెనీలు వెదజలుతున్న కాలుష్యం మూసీ ద్వారా మొత్తం నగరాన్ని చుట్టిముట్టిందని అన్నారు. మూసీ కాలుష్యంపై స్వీడిష్ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లో భయంకరమైన నిజాలు బయటపడ్డాయని పేర్కొన్నారు. మనుషుల రోగాలకు కారకమయ్యే బ్యాక్టీరియా మూసీ రసాయనాలతో సహవాసం చేసి రోగనిరోధక శక్తిని పెంచుకుందని వెల్లడైందని వివరించారు. దీంతో భవిష్యత్‌లో రోగాలు ఎలాంటి మందులకు కూడా లొంగని పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. పర్యావరణ శాస్త్రవేత్త బాబురావు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం వెదజల్లే కంపెనీలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. బాధితులు ఫిర్యాదులు చేసిన సందర్భంలో నామ మాత్రంగా కేసులు నమోదు చేసి చిన్న పాటి పెనాల్టీలతో సరి పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి కవుల, సుధా తదితరులు పాల్గొన్నారు.

గిరిజన శాఖకు మంత్రిని కేటాయించాలి

- సీఎం వద్ద ఉంటే సామాన్యులు కలిసేదెలా...
- చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను ప్రకటించాలి... లేదంటే ప్రత్యక్ష పోరాటాలు చేపడతాం : తెలంగాణ గిరిజన సంఘం రౌండ్‌టేబుల్‌లో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద గిరిజన శాఖ ఉంటే సామాన్యులు ఆయన్ను ఎలా కలవాలని పలువురు నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన శాఖకు మంత్రి కేటాయించకపోవడం సామాజిక వివక్ష చూపడమేనని విమర్శించారు. తక్షణమే ఆ శాఖకు మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అందుకోసం ప్రభుత్వం తగిన కార్యాచరణను ప్రకటించాలని సూచించారు. లేదంటే ప్రత్యక్ష పోరాటాలకు పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు అనేక హామీలివ్వడం ద్వారా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. తొమ్మిది నెలలైనా గిరిజన శాఖకు మంత్రిని కేటాయించలేదని చెప్పారు. గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి ఎస్టీ కమిషన్‌ను వేరు చేసి చైర్మెన్‌ను నియమించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద గిరిజన శాఖ ఉండడంతో సమస్యలను చెప్పేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అంబేద్కర్ అభయహస్తం కింద గిరిజనులకు రూ.12 లక్షల ఆర్థిక సాయం చేయాలని కోరారు. మంత్రిని కేటాయించకుండా, సమస్యలను పరిష్కరించకుండా ఉంటే ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ రాంబాల్ నాయక్, బీఆర్ఎస్ గిరిజన విభాగం సీనియర్ నాయకులు రూప్ సింగ్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు అంగోత్ రాంబాబు, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రాజేష్ నాయక్, గుగులోత్ భీమా నాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు కురాకుల శ్రీనివాస్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఉపాధ్యక్షులు పాతపల్లి నరసింహ, ప్రొఫెసర్ బాలా నాయక్, తెలంగాణ గిరిజన జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ నాయక్, డాక్టర్ జి శంకర్, సోమలాల్ జాదవ్, సేవాలాల్ సేన నాయకులు రఘురాం రాథోడ్, మధు నాయక్ సేవాలాల్ సేన టీవీ మోహన్, గిరిజన సంస్కృతి ఎడిటర్ ఆర్ ధర్మానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తు చేశారు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, మ్యానిఫెస్టోలో 16 రకాల వాగ్దానాలను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారని చెప్పారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారోనని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ నేతలు మాత్రం ప్రజా ప్రభుత్వంలో గిరిజనులకు భాగస్వామ్యం లేకుండా వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లా వైరాకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారనీ, గిరిజన శాఖ మంత్రిని నియమిస్తామంటూ ఈ సందర్భంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ఇచ్చిన హామీల అమలుకు నిర్దిష్ట కార్యాచరణ ప్రకటించాలని కోరారు. లేదంటే రాష్ట్రంలోని అన్ని గిరిజన, ఆదివాసీ సంఘాలతో ఐక్య కార్యాచరణ ఏర్పాటు చేసి ప్రత్యక్ష పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మనాయక్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎం బాలు, రఘు, గోపి, రామ్ కుమార్, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు మరో అడుగు ముందుకెయ్యాలి



- మహిళా రక్షణలో సర్కారుకు చేయూతనివ్వాలి
- ఆర్థిక అభ్యున్నతిలో వాటి పాత్ర అమోఘం
- ఎగతాళి చేసేవారికి మహిళా సంఘాలే బుద్ధి చెప్పాలి
- స్త్రీనిధి భవన నిర్మాణానికి హైదరాబాద్‌లో స్థలం : స్త్రీనిధి సర్వసభ్య సమావేశంలో మంత్రి డాక్టర్ సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్/రాజేంద్రనగర్

ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పించేలా మహిళా సంఘాలు మరో అడుగు ముందుకెయ్యాలనీ, మహిళా భద్రత కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో అవి కీలక పాత్ర పోషించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. బ్యాంకు మెట్లెక్కాలంటే భయపడే స్థాయి నుంచి బ్యాంకులకు, ప్రభుత్వ సంస్థలకు రుణాలిచ్చే స్థాయికి మహిళా సంఘాలు ఎదిగాయని కితాబిచ్చారు. స్త్రీనిధి భవన నిర్మాణం కోసం హైదరాబాద్‌లో స్థలం కేటాయించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి తగు నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ 11వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..గతంలో ప్రయివేటు వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద అవసరాల కోసం అప్పులు చేసి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తుచేశారు. వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కొప్పుల రాజు వంటి ఉన్నతాధికారులు స్త్రీనిధి ఫెడరేషన్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మైక్రోఫైనాన్స్ అప్పులు వద్దనీ, స్త్రీనిధి రుణాలు ముద్దని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం బాగుపడుతుందని ఆకాంక్షించారు. మహిళల ఆర్థిక ప్రగతే ఆ సమాజ ప్రగతి అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పారని, ఆ మహనీయుడి ఆలోచనల్ని తమ ప్రభుత్వం ఆచరిస్తున్నదని తెలిపారు. తమ ప్రభుత్వం మహిళలకోసం రూ.500 కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంవంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నదని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని అవహేళన చేస్తూ కొందరు వీడియోలు రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతను తట్టుకోలేకే ఆ స్కీంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు చేయూతగా నిలిస్తే ఎందుకంత అక్కసు వెళ్లగక్కుతున్నారని ఫైర్ అయ్యారు. మహిళా సంక్షేమ పథకాలను ఎగతాళి చేస్తున్న వారికి మహిళలే బుద్ధి చెప్పాలన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని హామీనిచ్చారు.

అమ్మ ఆదర్శ కమిటీలకు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పిన తర్వాత పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను మహిళా సంఘాలకు అప్పజెప్పామనీ, జత కుట్టు కూలీని రూ. 50 నుంచి రూ. 70 పెంచామని వివరించారు. మహిళా శక్తి క్యాంటీన్‌లను జిల్లాలకు విస్తరిస్తామని హామీనిచ్చారు. 17 రకాల వ్యాపారాల్లో మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చి వారిని మరింత ఆర్థికంగా బలోపేతం చేస్తామని భరోసానిచ్చారు. మహిళా సంఘాలకు రూ. 2 లక్షల రుణబీమా, రూ.10 లక్షల ప్రమాద బీమాను సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని గుర్తు చేశారు. 63 లక్షల మంది మహిళా సభ్యులు అనుకుంటే కానిది లేదనీ, ఒక్కమాట మీద నిలిస్తే పెనుమార్పులు సాధ్యమని చెప్పారు. వరంగల్, దిశ ఎన్‌కౌంటర్లతో సమాజం మారలేదన్నారు. పాఠశాల గదుల నుంచే మార్పు మొదలయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తామన్నారు. మహిళల మీద నేరాలు జరుగకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు. అందులో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ అధ్యక్షులు జి.ఇందిర, మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, స్త్రీనిధి మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలనుపరిష్కరించాలి



- ఉద్యోగులను తెలంగాణకు తెచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు : టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్, ముజీబ్
- హైదరాబాద్‌లో ముగిసిన ఏఐఎస్‌జీఈఎఫ్ సమావేశాలు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ డిమాండ్ చేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించడం ద్వారా అవన్నీ పరిష్కారమయ్యేలా చూస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 122 మంది తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకొచ్చిన రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశాలు గురువారం ముగిశాయి. ఆ సంఘం అధ్యక్షులు సుభాష్ లాంబ, ప్రధాన కార్యదర్శి ఎ శ్రీకుమార్‌తోపాటు 24 రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ముజీబ్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. ఐదేండ్లకు ఒకసారి వేతన సవరణ జరగాలని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయాన్ని కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని కోరారు.

గ్రంథాలయం, మార్కెటింగ్ కమిటీ, ఎయిడెడ్ సంస్థల ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలను చెల్లించాలని చెప్పారు. నూతన జిల్లాలకు అదనపు క్యాడర్ స్ట్రెంత్‌ను మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, హైదరాబాద్ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, పి హరి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి విక్రమ్, నాయకులు కురాడి శ్రీను, శంకర్, ఆదిలాబాద్ అధ్యక్షులు అశోక్, సంగారెడ్డి అధ్యక్షులు జావిద్‌అలీ, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, మంచిర్యాల, మహబూబ్‌నగర్ అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, శేఖర్, వెంకటేశ్, లక్ష్మణ్, శ్రీహరి, రామ్మోహన్, రాజీవ్‌రెడ్డి, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త దరఖాస్తుదారులకీ గృహజ్యోతి ఇవ్వండి

- విద్యుదుత్పత్తిలో జాగ్రత్తలు తీసుకోండి
- జెన్‌కోలో టెక్నికల్ కమిటీ ఏర్పాటు : సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి కూడా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు సంబంధించిన గృహజ్యోతి పథకాన్ని వర్తింప చేయాలని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారుల్ని ఆదేశించారు. బుధవారంనాడిక్కడి మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. జెన్‌కో నిర్వహించే విద్యుదుత్పత్తి సంస్థల్లో, ముఖ్యంగా జెన్‌కోలో సాంకేతిక సమస్యల పరిష్కారానికి ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు ఇవ్వాలని సూచించారు. దాని ఆధారంగానే జెన్‌కో సీఎండీ నిర్ణయం తీసుకుని, విద్యుదుత్పత్తికి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్-1లో జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయాలా...లేక కొత్తది కొనుగోలు చేయాలా... అనే అంశాన్ని టెక్నికల్ కమిటీ పరిశీలిస్తుందని తెలిపారు. 2023 డిసెంబర్‌కు ముందు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అమలుకు సంబంధించి తప్పనిసరిగా ఈ ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. నిర్ణయాలను అమలు చేసే సమయంలో సీఎండీలు తప్పనిసరిగా ఎనర్జీ సెక్రెటరీని సంప్రదించాలని సూచించారు. జల విద్యుత్ కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, ఇందులో ఎలాంటి ఆలసత్వం వహించొద్దన్నారు. ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో 227 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రక్రియ మొదలైందనీ, దానిలో 113 సబ్ స్టేషన్లకు స్థల సమస్య లేదనీ, మిగతా వాటికి కలెక్టర్లు స్థలాలు కేటాయించాల్సి ఉందన్నారు. కాళేశ్వరం, ఇతర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు వినియోగిస్తున్న విద్యుత్, అవుతున్న ఖర్చుకు సంబంధించి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎనర్జీ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ట్రాన్స్ కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నుంచి ఆర్.రఘు బహిష్కరణ

పార్టీ రాజకీయ విధానం, పార్టీ కార్యక్రమంపై విభేదాలు ఉన్నాయనే నెపంతో పార్టీ విచ్ఛిన్నకర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆర్.రఘును పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి కృష్ణా జిల్లా కమిటీ బహిష్కరించింది. గతంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగాను ఉన్న పరిచయాలను ఉపయోగించుకుని పార్టీని నష్టపరిచే చర్యలకు ఆయన పాల్పడుతున్నారు.ఆయన లేవనెత్తిన విషయాలను పార్టీ ఆయనతో చర్చించి సరిదిద్దేందుకు పలు ప్రయత్నాలు చేసింది. వాటిని సరిదిద్దుకోకపోగా పార్టీ విచ్ఛిన్న కార్యకలాపాలు తీవ్రతరం చేసినందున పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించాలని ఈ రోజు (14 ఆగష్టు) ఉయ్యూరులో జరిగిన కృష్ణా జిల్లా కమిటీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.ఈ సమావేశానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు యం.ఏ. గఫూర్, ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు హాజరయ్యారు.

25 కంపెనీలతో ఒప్పందాలు..
రూ.36 వేల కోట్ల పెట్టుబడులు...

- సీఎం రేవంత్ విదేశీ పర్యటన జయప్రదం
- ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించామన్న ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా సాగిన ముఖ్యమంత్రి రేవంత్ విదేశీ పర్యటన జయప్రదమైంది. గతంలో ఎన్నడూ లేనంతగా తెలంగాణకు పెట్టుబడులు భారీగా వెల్లువెత్తాయని ప్రభుత్వం ఈ సందర్భంగా వెల్లడించింది. రేవంత్ బృందం మొత్తం 25 కంపెనీలతో ఒప్పందాలు చేసుకోగా, రూ.36 వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) తెలిపింది. రేవంత్ అమెరికా పర్యటనలో రూ.31,502 కోట్ల పెట్టుబడులు రాగా.. చివరి రెండు రోజుల దక్షిణ కొరియా పర్యటనలోనూ అదే రకమైన స్పందన వచ్చింది. దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచస్థాయి కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. రూ.4,500 కోట్ల పెట్టుబడులకు అక్కడి కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. దీంతో అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల్లో కలిపి మొత్తం రూ.36 వేల కోట్ల పెట్టుబడులను తెలంగాణ సాధించింది. ఫలితంగా ఆయా రంగాల్లో కొత్త సంస్థలు, కొత్త పరిశ్రమలతో వేలాది కొత్త ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

కాగా సీఎం రేవంత్ గత జనవరిలో దావోస్‌లో నిర్వహించిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో సైతం పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రంలో రూ.40,232 కోట్ల పెట్టుబడులకు పలు కంపెనీలు తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి. తాజాగా అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో మరో రూ.36 వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే రూ.76,232 కోట్ల పెట్టుబడుల లక్ష్యాన్ని చేరుకున్న ప్రభుత్వం సరికొత్త రికార్డును నమోదు చేసింది. తద్వారా దేశంలోనే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిన తెలంగాణ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

కంపెనీలకు సీఎం భరోసా...

దక్షిణ కొరియాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి బృందం ప్రధానంగా ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఇంధన స్టోరేజీ, టెక్స్‌టైల్ రంగాలపై దృష్టి సారించింది. ఆయా రంగాల్లో దక్షిణ కొరియాకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ సందర్భంగా పలు కంపెనీలతో సీఎంతోపాటు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చర్చలు, సంప్రదింపులు జరిపారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించి, రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలని ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చే కంపెనీలకు తమ ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. దీంతో అమెరికన్ కంపెనీల తరహాలోనే కొరియన్ కంపెనీల నుంచి భారీ స్పందన లభించింది.

గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

సీఎం చర్చలతో హ్యుందాయ్ మోటార్స్ తెలంగాణలో మెగా ఆటోమోటివ్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. తమ కంపెనీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయటం ద్వారా గ్లోబల్ హబ్‌గా ఎంచుకుంటామని ప్రకటించింది. కొత్త టెస్టింగ్ వాహనాలను తయారు చేసే సదుపాయం తెలంగాణలో అందుబాటులో ఉంటుందంటూ ఆ సంస్థ సంతృప్తిని వ్యక్తం చేసింది.

ఫ్యాషన్ సిటీకి పదెకరాల కేటాయింపు

వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కులో వస్త్ర తయారీ పరిశ్రమలను నెలకొల్పుతున్న యంగ్‌వన్ కంపెనీ హైదరాబాద్‌లో ఫ్యాషన్ సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అందుకు అవసరమయ్యే పదెకరాల స్థలాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీనిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం తరఫున సమ్మతిని తెలుపుతూ ఆయన ఒక లేఖను యంగ్‌వన్ కంపెనీ చైర్మెన్‌కు అందజేశారు.

'కాస్మొటిక్స్'కు పరస్పర సహకారం

కాస్మొటిక్స్ ఇండస్ట్రీలో దక్షిణ కొరియాకు ప్రత్యేక స్థానముంది. ఆ రంగంలో పేరొందిన కంపెనీల పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి అక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాస్మొటిక్స్ తయారీ పరిశ్రమలు నెలకొల్పేందుకు వీలుగా పరస్పర సహకారాన్ని ఆయన కోరారు. తెలంగాణలో వీటి తయారీకి ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలను అన్వేషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కొరియన్ బ్యూటీ ఇండస్ట్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

ఇతర కంపెనీల ప్రణాళికలు...

ఇదే సందర్భంగా మరో మూడు కొరియన్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు తమ ప్రణాళికలను ప్రకటించాయి. డాంగ్‌బాంగ్ ఫార్మా కంపెనీ రూ. 200 కోట్ల పెట్టుబడితో ఏపీఐ తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో నెలకొల్పుతామని ప్రకటించింది. జేఐ టెక్ కంపెనీ ఎల్ఈడీ మెటీరియల్ తయారీ ప్లాంట్‌తోపాటు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చింది. రూ.100 కోట్ల పెట్టుబడులు పెడతామంటూ ఆ సంస్థ ప్రకటించింది. చావి కంపెనీ హైదరాబాద్‌లో ఈవీ ఛార్జింగ్ ఇన్‌ఫ్రాని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది.

చర్చలు.. భవిష్యత్ ప్రణాళికలు...

ఎల్ఎస్ గ్రూప్, పోస్కో, ఎల్జీ, శ్యామ్‌సంగ్, సీ అండ్ టీ, శ్యామ్‌సంగ్ హెల్త్‌కేర్, క్రాఫ్టన్, యూయూ ఫార్మా, జీఎస్ కాల్టెక్స్ కంపెనీల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. భవిష్యత్ విస్తరణ ప్రణాళికలో భాగంగా తెలంగాణను పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా ఎంచుకోవాలని సీఎం ఆయా కంపెనీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

తమ పర్యటనలో భాగంగా కొరియాలోని చెంగియోచియోన్ స్ట్రీమ్ రీడెవలప్‌మెంట్, హాన్ రివర్‌ఫ్రంట్ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి బృందం సందర్శించింది. అక్కడ అనుసరించిన కొన్ని అద్భుతమైన నమూనాలను సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం వాటిని పరిగణనలోకి తీసుకోవాలని సీఎం నిర్ణయించారు. ఆయా ప్రాజెక్టుల అభివృద్ధికి అనుసరించిన విధానాలు, వాటిని నిర్వహిస్తున్న తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఇటీవల నిర్వహించిన ఒలింపిక్స్‌లో విజేతలైన వారిలో ఎంతోమందిని ఆ వర్సిటీ తీర్చిదిద్దింది. మన రాష్ట్రంలోనూ అదే తరహాలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు సీఎం యోచిస్తున్నారు.

విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విషజ్వరాల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులు వర్షాలు కురుస్తున్నాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల్లో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో రోగులు కిక్కిరిసిపోతున్నాయని పేర్కొన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అక్కడక్కడా మరణాలు కూడా సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక ఏజెన్సీ, మారుమూల ప్రాంతాలు, మురికివాడల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తగు ప్రాధాన్యతనిచ్చి అవసరమైన సిబ్బంది, మందులను అందించాలనీ, మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

ఫార్మాతో హైదరాబాద్‌కు పెను ప్రమాదం

అభివృద్ధి పేరుతో కమ్మేస్తున్న కాలుష్యం

- నివారణ చర్యలు చేపట్టాలి : 'ఒక విధ్వంసం' పుస్తకావిష్కరణ సభలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫార్మా కంపెనీలతో హైదరాబాద్ నగరానికి పెను ప్రమాదం పొంచి ఉందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ చంద్రశేఖర శర్మ రాసిన "ఒక విధ్వంసం 1056/90" పుస్తకావిష్కరణ సభను బుధవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో మనిషి సృష్టిస్తున్న విధ్వంసం పర్యావరణానికి పెను సవాలుగా మారిందని పేర్కొన్నారు. పటాన్‌చెరు కాలుష్య వ్యతిరేక పోరాట ఘటనలు, సుప్రీంకోర్టు కేసు పరిణామాలను గ్రంథస్థం చేస్తూ తీసుకొచ్చిన ఈ పుస్తకం హైదరాబాద్ భవిష్యత్‌ను ప్రశ్నిస్తున్నదని పేర్కొన్నారు. కాలుష్య సమస్య పటాన్‌చెరు, ఖాజిపల్లిది మాత్రమే కాదనీ, మొత్తం నగరాన్ని ఈ భూతం చుట్టి ముట్టిందన్నారు. ఇదే చివరి తరమనే విధంగా మనిషి అన్ని వనరులను తవ్వేస్తూ ప్రకృతిని బొందల గడ్డగా మారుస్తున్నాడని విశ్లేషించారు. జీడీపీ, అభివృద్ధి అంటూ ప్రభుత్వాలు వినాశకర విధానాలను ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. గత సర్కార్ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ లాగే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెట్టుబడుల పేరిట దావోస్, ఇతర యూరప్ దేశాలకు వెళ్లి అదే ఫార్మా కంపెనీలను తీసుకొస్తున్నారని విమర్శించారు. అమెరికా లాంటి దేశాలు ఇలాంటి కంపెనీలకు అనుమతులు ఇవ్వక పోవడంతో అవి హైదరాబాద్ నగరాన్ని ఎంచుకున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ దేశంలో కాలుష్యం వెదజల్లే ఔషధాలను ఉత్పత్తి చేయకుండా భారత్ లాంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ రోగాలను మనకంటగడుతున్నాయని వ్యాఖ్యానించారు. మందుల కంపెనీలు మనుషులను చంపే కంపెనీలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.

గత మూడు దశాబ్దాలుగా పటాన్‌చెరు ప్రాంత ప్రజలు కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నా, నగర ప్రజలు తమకేమి పట్టనట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా పౌర సమాజం ఈ మహమ్మారికి వ్యతిరేకంగా నినదించాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర జ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలకు వచ్చినంత స్పందన పర్యావరణ ఉద్యమాలకు రావడం లేదని అన్నారు. ప్రజలు ప్రత్యక్షంగా తమదాకా వస్తేగాని నోరుమెదపని అచేతనావస్థలోకి జారి పోయారని వ్యాఖ్యానించారు. ఎవరైనా నిలదీస్తే వారిపై అభివృద్ధి నిరోధకులంటూ ముద్ర వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ విజయ్ మాట్లాడుతూ ఫార్మా కెమికల్ కంపెనీలు వెదజలుతున్న కాలుష్యం మూసీ ద్వారా మొత్తం నగరాన్ని చుట్టిముట్టిందని అన్నారు. మూసీ కాలుష్యంపై స్వీడిష్ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లో భయంకరమైన నిజాలు బయటపడ్డాయని పేర్కొన్నారు. మనుషుల రోగాలకు కారకమయ్యే బ్యాక్టీరియా మూసీ రసాయనాలతో సహవాసం చేసి రోగనిరోధక శక్తిని పెంచుకుందని వెల్లడైందని వివరించారు. దీంతో భవిష్యత్‌లో రోగాలు ఎలాంటి మందులకు కూడా లొంగని పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. పర్యావరణ శాస్త్రవేత్త బాబురావు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం వెదజల్లే కంపెనీలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. బాధితులు ఫిర్యాదులు చేసిన సందర్భంలో నామ మాత్రంగా కేసులు నమోదు చేసి చిన్న పాటి పెనాల్టీలతో సరి పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి కవుల, సుధా తదితరులు పాల్గొన్నారు.

గిరిజన శాఖకు మంత్రిని కేటాయించాలి

- సీఎం వద్ద ఉంటే సామాన్యులు కలిసేదెలా...
- చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను ప్రకటించాలి... లేదంటే ప్రత్యక్ష పోరాటాలు చేపడతాం : తెలంగాణ గిరిజన సంఘం రౌండ్‌టేబుల్‌లో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద గిరిజన శాఖ ఉంటే సామాన్యులు ఆయన్ను ఎలా కలవాలని పలువురు నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన శాఖకు మంత్రి కేటాయించకపోవడం సామాజిక వివక్ష చూపడమేనని విమర్శించారు. తక్షణమే ఆ శాఖకు మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అందుకోసం ప్రభుత్వం తగిన కార్యాచరణను ప్రకటించాలని సూచించారు. లేదంటే ప్రత్యక్ష పోరాటాలకు పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు అనేక హామీలివ్వడం ద్వారా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. తొమ్మిది నెలలైనా గిరిజన శాఖకు మంత్రిని కేటాయించలేదని చెప్పారు. గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి ఎస్టీ కమిషన్‌ను వేరు చేసి చైర్మెన్‌ను నియమించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద గిరిజన శాఖ ఉండడంతో సమస్యలను చెప్పేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అంబేద్కర్ అభయహస్తం కింద గిరిజనులకు రూ.12 లక్షల ఆర్థిక సాయం చేయాలని కోరారు. మంత్రిని కేటాయించకుండా, సమస్యలను పరిష్కరించకుండా ఉంటే ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ రాంబాల్ నాయక్, బీఆర్ఎస్ గిరిజన విభాగం సీనియర్ నాయకులు రూప్ సింగ్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు అంగోత్ రాంబాబు, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రాజేష్ నాయక్, గుగులోత్ భీమా నాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు కురాకుల శ్రీనివాస్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఉపాధ్యక్షులు పాతపల్లి నరసింహ, ప్రొఫెసర్ బాలా నాయక్, తెలంగాణ గిరిజన జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ నాయక్, డాక్టర్ జి శంకర్, సోమలాల్ జాదవ్, సేవాలాల్ సేన నాయకులు రఘురాం రాథోడ్, మధు నాయక్ సేవాలాల్ సేన టీవీ మోహన్, గిరిజన సంస్కృతి ఎడిటర్ ఆర్ ధర్మానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తు చేశారు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, మ్యానిఫెస్టోలో 16 రకాల వాగ్దానాలను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారని చెప్పారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారోనని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ నేతలు మాత్రం ప్రజా ప్రభుత్వంలో గిరిజనులకు భాగస్వామ్యం లేకుండా వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లా వైరాకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారనీ, గిరిజన శాఖ మంత్రిని నియమిస్తామంటూ ఈ సందర్భంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ఇచ్చిన హామీల అమలుకు నిర్దిష్ట కార్యాచరణ ప్రకటించాలని కోరారు. లేదంటే రాష్ట్రంలోని అన్ని గిరిజన, ఆదివాసీ సంఘాలతో ఐక్య కార్యాచరణ ఏర్పాటు చేసి ప్రత్యక్ష పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎం బాలు, రఘు, గోపి, రామ్ కుమార్, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు మరో అడుగు ముందుకెయ్యాలి



- మహిళా రక్షణలో సర్కారుకు చేయూతనివ్వాలి
- ఆర్థిక అభ్యున్నతిలో వాటి పాత్ర అమోఘం
- ఎగతాళి చేసేవారికి మహిళా సంఘాలే బుద్ధి చెప్పాలి
- స్త్రీనిధి భవన నిర్మాణానికి హైదరాబాద్‌లో స్థలం : స్త్రీనిధి సర్వసభ్య సమావేశంలో మంత్రి డాక్టర్ సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్/రాజేంద్రనగర్

ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పించేలా మహిళా సంఘాలు మరో అడుగు ముందుకెయ్యాలనీ, మహిళా భద్రత కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో అవి కీలక పాత్ర పోషించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. బ్యాంకు మెట్లెక్కాలంటే భయపడే స్థాయి నుంచి బ్యాంకులకు, ప్రభుత్వ సంస్థలకు రుణాలిచ్చే స్థాయికి మహిళా సంఘాలు ఎదిగాయని కితాబిచ్చారు. స్త్రీనిధి భవన నిర్మాణం కోసం హైదరాబాద్‌లో స్థలం కేటాయించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి తగు నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ 11వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..గతంలో ప్రయివేటు వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద అవసరాల కోసం అప్పులు చేసి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తుచేశారు. వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కొప్పుల రాజు వంటి ఉన్నతాధికారులు స్త్రీనిధి ఫెడరేషన్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మైక్రోఫైనాన్స్ అప్పులు వద్దనీ, స్త్రీనిధి రుణాలు ముద్దని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం బాగుపడుతుందని ఆకాంక్షించారు. మహిళల ఆర్థిక ప్రగతే ఆ సమాజ ప్రగతి అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పారని, ఆ మహనీయుడి ఆలోచనల్ని తమ ప్రభుత్వం ఆచరిస్తున్నదని తెలిపారు. తమ ప్రభుత్వం మహిళలకోసం రూ.500 కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణంవంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నదని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని అవహేళన చేస్తూ కొందరు వీడియోలు రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతను తట్టుకోలేకే ఆ స్కీంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు చేయూతగా నిలిస్తే ఎందుకంత అక్కసు వెళ్లగక్కుతున్నారని ఫైర్ అయ్యారు. మహిళా సంక్షేమ పథకాలను ఎగతాళి చేస్తున్న వారికి మహిళలే బుద్ధి చెప్పాలన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని హామీనిచ్చారు.

అమ్మ ఆదర్శ కమిటీలకు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పిన తర్వాత పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను మహిళా సంఘాలకు అప్పజెప్పామనీ, జత కుట్టు కూలీని రూ. 50 నుంచి రూ. 70 పెంచామని వివరించారు. మహిళా శక్తి క్యాంటీన్‌లను జిల్లాలకు విస్తరిస్తామని హామీనిచ్చారు. 17 రకాల వ్యాపారాల్లో మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చి వారిని మరింత ఆర్థికంగా బలోపేతం చేస్తామని భరోసానిచ్చారు. మహిళా సంఘాలకు రూ. 2 లక్షల రుణబీమా, రూ.10 లక్షల ప్రమాద బీమాను సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని గుర్తు చేశారు. 63 లక్షల మంది మహిళా సభ్యులు అనుకుంటే కానిది లేదనీ, ఒక్కమాట మీద నిలిస్తే పెనుమార్పులు సాధ్యమని చెప్పారు. వరంగల్, దిశ ఎన్‌కౌంటర్లతో సమాజం మారలేదన్నారు. పాఠశాల గదుల నుంచే మార్పు మొదలయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తామన్నారు. మహిళల మీద నేరాలు జరుగకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు. అందులో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ అధ్యక్షులు జి.ఇందిర, మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, స్త్రీనిధి మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలనుపరిష్కరించాలి

- ఉద్యోగులను తెలంగాణకు తెచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు : టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్, ముజీబ్
- హైదరాబాద్‌లో ముగిసిన ఏఐఎస్‌జీఈఎఫ్ సమావేశాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ డిమాండ్ చేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించడం ద్వారా అవన్నీ పరిష్కారమయ్యేలా చూస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 122 మంది తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకొచ్చిన రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశాలు గురువారం ముగిశాయి. ఆ సంఘం అధ్యక్షులు సుభాష్ లాంబ, ప్రధాన కార్యదర్శి ఎ శ్రీకుమార్‌తోపాటు 24 రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ముజీబ్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. ఐదేండ్లకు ఒకసారి వేతన సవరణ జరగాలని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయాన్ని కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని కోరారు.

గ్రంథాలయం, మార్కెటింగ్ కమిటీ, ఎయిడెడ్ సంస్థల ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలను చెల్లించాలని చెప్పారు. నూతన జిల్లాలకు అదనపు క్యాడర్ స్ట్రెంత్‌ను మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, హైదరాబాద్ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, పి హరి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి విక్రమ్, నాయకులు కురాడి శ్రీను, శంకర్, ఆదిలాబాద్ అధ్యక్షులు అశోక్, సంగారెడ్డి అధ్యక్షులు జావిద్‌అలీ, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, మంచిర్యాల, మహబూబ్‌నగర్ అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, శేఖర్, వెంకటేశ్, లక్ష్మణ్, శ్రీహరి, రామ్మోహన్, రాజీవ్‌రెడ్డి, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త దరఖాస్తుదారులకీ గృహజ్యోతి ఇవ్వండి

- విద్యుదుత్పత్తిలో జాగ్రత్తలు తీసుకోండి
- జెన్‌కోలో టెక్నికల్ కమిటీ ఏర్పాటు : సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి కూడా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు సంబంధించిన గృహజ్యోతి పథకాన్ని వర్తింప చేయాలని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారుల్ని ఆదేశించారు. బుధవారంనాడిక్కడి మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. జెన్‌కో నిర్వహించే విద్యుదుత్పత్తి సంస్థల్లో, ముఖ్యంగా జెన్‌కోలో సాంకేతిక సమస్యల పరిష్కారానికి ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు ఇవ్వాలని సూచించారు. దాని ఆధారంగానే జెన్‌కో సీఎండీ నిర్ణయం తీసుకుని, విద్యుదుత్పత్తికి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్-1లో జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయాలా...లేక కొత్తది కొనుగోలు చేయాలా... అనే అంశాన్ని టెక్నికల్ కమిటీ పరిశీలిస్తుందని తెలిపారు. 2023 డిసెంబర్‌కు ముందు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అమలుకు సంబంధించి తప్పనిసరిగా ఈ ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. నిర్ణయాలను అమలు చేసే సమయంలో సీఎండీలు తప్పనిసరిగా ఎనర్జీ సెక్రెటరీని సంప్రదించాలని సూచించారు. జల విద్యుత్ కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, ఇందులో ఎలాంటి అలసత్వం వహించొద్దన్నారు. ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో 227 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రక్రియ మొదలైందనీ, దానిలో 113 సబ్ స్టేషన్లకు స్థల సమస్య లేదనీ, మిగతా వాటికి కలెక్టర్లు స్థలాలు కేటాయించాల్సి ఉందన్నారు. కాళేశ్వరం, ఇతర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు వినియోగిస్తున్న విద్యుత్, అవుతున్న ఖర్చుకు సంబంధించి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎనర్జీ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ట్రాన్స్ కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

పెట్టుబడుల లోగుట్టు...



పన్నెండు రోజుల విదేశీ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ నేతృత్వంలోని బృందం బుధవారం హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు, ఉన్నతాధికారులు ఆ టీమ్‌కు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించేందుకు, తద్వారా ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన సీఎం పర్యటన జయప్రదంగా ముగియటం హర్షణీయం. అయితే లోగుట్టు పెరుమాళ్లకెరుక అన్నట్టు పెట్టుబడులను ఆకర్షించేందుకోసమంటూ విదేశాలు పట్టుకు తిరుగుతున్న మన పాలకుల ఆర్భాట ప్రచారాలు, ప్రకటనలు వాస్తవంలో మాత్రం అందుకు భిన్నంగా ఉంటున్నాయి.

ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అయినా, తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్, రేవంత్‌ల పరిస్థితి అయినా ఇదే. ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన మరుసటి రోజే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వం లోని బృందం అమెరికాకు పయనమైంది. ఎనిమిది రోజులపాటు అక్కడ పర్యటించిన ఆయన టీమ్, ఆ తర్వాత దక్షిణ కొరియాకు కూడా వెళ్లింది. మొత్తం మీద ఆ రెండు దేశాల్లో 50కి పైగా భేటీలు, మూడు రౌండ్‌టేబుల్ సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ పర్యటనల ద్వారా రూ.31,532 కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించామని ప్రభుత్వం వెల్లడించింది. 19 కంపెనీలతో చేసుకున్న వివిధ ఒప్పందాల ద్వారా రాష్ట్రంలో 30,750 కొత్తఉద్యోగాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ప్రకటించింది. ఇవిగాక గత జనవరిలో దావోస్‌లో పర్యటించిన సీఎం...రూ.40,232 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయంటూ ప్రకటించారు. ఫిబ్రవరి నుంచి జులై వరకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాల విలువ మరో రూ.9,800 కోట్లంటూ పరిశ్రమల శాఖ లెక్కలేసింది.

ఇందుకు సంబంధించి మనం కొద్దిగా వెనక్కెళ్లి గతంలోకి తొంగిచూస్తే పాలకుల ప్రచారార్భాటాల్లోని డొల్లతనాన్ని అర్థం చేసుకోవచ్చు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తొలిసారి సీఎం అయ్యాక 2015లో చైనాలో పది రోజులపాటు పర్యటించారు. సెల్‌కాన్, మకనో, షాంఘై ఎలక్ట్రిక్ కార్పొరేషన్, లియో గ్రూప్ తదితర కంపెనీలతో ఆయన పలు ఒప్పందాలు చేసుకున్నారు. తద్వారా రూ.1,160 కోట్ల మేర పెట్టుబడులు వస్తాయంటూ ఊదర గొట్టారు. కానీ వీటిలో ఒక్క సెల్‌కాన్ సంస్థ తప్ప మరే కంపెనీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టకపోవటం గమనార్హం. అది కూడా కేవలం రూ.160 కోట్ల విలువైన యూనిట్ మాత్రమే నెలకొల్పటం కొసమెరుపు. అదే బీఆర్ఎస్ హయాంలో పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రిగా కేటీఆర్... దావోస్‌లో 2022లో నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పాల్గొని, రూ.4,200 కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించినట్టు ప్రకటించారు. రూ.322 కోట్లతో హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో తెలంగాణ మొబిలిటీ వ్యాలీని జర్మనీకి చెందిన జడ్.ఎఫ్. అనే కంపెనీ స్థాపించబోతోందని ఆయన అప్పట్లో వెల్లడించారు. ఇలాంటి ఒప్పందాలు, ఉద్యోగాల కల్పనలన్నీ ఆ తర్వాత అనుకున్నంత స్థాయిలో సఫలీకృతం కాలేదన్నది అనుభవంలో తేలిన విషయం.

చంద్రబాబు హయాంలోనూ వివిధ విదేశీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నప్పటికీ అవన్నీ మన నిరుద్యోగ యువతకు పూర్తి స్థాయిలో కొలువులు కల్పించలేకపోయాయి. ఐటీరంగం ద్వారా ఏటా దాదాపు పది వేల ఉద్యోగాలను సృష్టిస్తామంటూ అప్పట్లో ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో అది అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. దేశంలోనూ, అన్ని రాష్ట్రాల్లోనూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనేది పాలకుల తారకమంత్రం. పెట్టుబడికి ఆంక్షలులేని స్వేచ్ఛనిచ్చిన తర్వాత, మోడీసర్కార్ చట్టాలన్నింటినీ మార్చిపారేస్తున్న నేపథ్యంలో కార్మికులు, ఉద్యోగుల బతుకులు బాగుపడేదేముంది?

ఇక్కడో విషయాన్ని మనం గమనించాలి. దేశంలోగానీ, మన రాష్ట్రంలోగానీ ఇప్పటికీ 60 నుంచి 70 శాతం మంది ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల మీద ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఆ రంగంలో యాంత్రీకరణ పెరగటంతో ఉపాధి అవకాశాలు నానాటికీ సన్నగిల్లుతున్నాయి. ఫలితంగా ప్రజలు పనుల కోసం ఊళ్లొదిలిపెట్టాల్సిన దుస్థితి. ఈ క్రమంలో ఒక రాష్ట్రంలో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఈ వలసలు పెరిగిపోతున్నాయి. అంతిమంగా ఇది అనేక సమస్యలకు కారణమవుతోంది. కరోనాలాంటి విపత్కర సమయాల్లో సైతం అనేక రంగాల్లో ఉద్యోగులను గాలికొదిలేస్తే, వారిని ఆదుకున్నది, అక్కున చేర్చుకున్నది వ్యవసాయరంగమే. అందువల్ల ప్రభుత్వాలు పెట్టుబడులను ఆకర్షించటంతోపాటు 'సాగు'ను బహు'బాగు' చేయటం ద్వారా ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

> చంద్రబాబు హయాంలోనూ వివిధ విదేశీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నప్పటికీ అవన్నీ మన నిరుద్యోగ యువతకు పూర్తి స్థాయిలో కొలువులు కల్పించలేకపోయాయి. ఐటీరంగం ద్వారా ఏటా దాదాపు పది వేల ఉద్యోగాలను సృష్టిస్తామంటూ అప్పట్లో ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో అది అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. దేశంలోనూ, అన్ని రాష్ట్రాల్లోనూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనేది పాలకుల తారకమంత్రం. పెట్టుబడికి ఆంక్షలులేని స్వేచ్ఛనిచ్చిన తర్వాత, మోడీసర్కార్ చట్టాలన్నింటినీ మార్చిపారేస్తున్న నేపథ్యంలో కార్మికులు, ఉద్యోగుల బతుకులు బాగుపడేదేముంది?

జనగణమన..!

అహింస ఎప్పటిలాగే మళ్లీ ఓసారి
చరిత బానిసత్వపు అధిపత్యంపై
గెలిచి డెబ్బై ఎనిమిది వసంతాల
స్వాతంత్ర్య సంబరాలతో ఆదర్శపు
స్ఫూర్తి అంబరాన్ని తాకుతోంది..!

నేటి విశ్వోదయమే
నా త్రివర్ణ పతాకపు
శాంతి వికాసమే ప్రేమతత్వపు
ఎవరెస్ట్ శిఖరమై నవతరపు
వర్తమానానికి భవిష్యత్ తరపు
వందే"మాతరానికి" దిక్సూచైంది.
జగతిని జాగృతం చేస్తూ
"జనగణమన"
సాక్షిగా రవీంద్రుని స్వరం దేశభక్తికి
స్వర్ణమై ప్రకాశిస్తూనే వుంది..!
భిన్నత్వంలో ఏకత్వమై
పరిమళిస్తూనే వుంది..!

మనుషులను ద్వేషపు అసనాలతో
రెచ్చగొట్టడం మాని,
మానవత్వపు తేజంతో
స్వేచ్ఛావాయువుల్ని పీల్చాలని
పేదరికపు సంగ్రామంలో
దేశాన్ని గెలిపించాలని
"సత్యమన్న" మహాత్ముడి మాటలు
విశ్వ గమనాన్ని నడిపిస్తున్నాయి..!

విశ్వ గురువుగా మళ్లీ మనకు
పునర్ వైభవం రావాలన్న
వివేకానంద సూక్తులే
సూర్యోదయ కిరణాల్లా
అజ్ఞానపు చీకటిని
తరిమేస్తున్నాయి..!
నేతాజీ జైహింద్ నినాదం కోట్లాది
భారతీయుల నివాసమై
ప్రతిధ్వనిస్తుంది..!
భగత్‌సింగ్ ప్రాణత్యాగం
అశోక చక్రమై
భారతీయతకు ప్రాణం పోస్తుంది..!
అంబేద్కర్ అభ్యుదయం
సమస్త జనవాళికి
చదువు మార్గం చూపెడుతుంది..!
వీరనారి ఝాన్సీ సాహసం
కోహినూర్ వజ్రమై మన జాతినంత
కవనమై కదిలిస్తుంది..
మన గుండె గడపపై జాతీయ
జెండా ఎగురుతున్న ఈ వేళ
లౌకికతత్వపు శోభ ప్రపంచమంతా
ప్రపంచమంతా ప్రభవించాలి
స్వాతంత్ర్యపు స్ఫూర్తి
వేలాది ఉద్యమాలకు ఊపిరి
పోయాలి..!!

- పి.అరుణ్‌కుమార్,
9394749536

(అ)జెండా ఊంచా రహే హమారా!


బివి రాఘవులు

ఎన్‌డిఏ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మొదటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ఆగస్టు 15న ఎర్రకోట బురుజు నుండి వినబోతున్నాము. ఆయన ప్రసంగం వినడానికి, మూడు రంగుల జెండా ఆవిష్కరణను తిలకించడానికి వేలమందికి ప్రత్యేకంగా ఆహ్వానాలు వెళ్లాయి. అందులో నాలుగువేల ఆహ్వానాలు ప్రత్యేకంగా రైతులకు, మహిళలకు, యువకులకు, పేదలకు వెళ్లాయని, ఈ తరగతులకు ప్రధానమంత్రి ఎంత ప్రాధాన్యతనిస్తున్నారో ఇది వెల్లడిస్తున్నదని అప్పుడే మీడియాలో కథనాలు మొదలయ్యాయి. విడ్డూరం ఏమంటే, బీజేపీ మోడీ పాలన మూలంగా ఏ తరగతులైతే ఎక్కువగా ఇక్కట్ల పాలవుతున్నారో ఆ తరగతులనే స్వాతంత్ర్య దినోత్సవ సంరంభానికి ఆహ్వానించడం.



బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం జూన్ 8న ఏర్పడ్డాక గడచిన రెండు నెలల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ముఖ్యంగా కేంద్రం 2024-25 సంవత్సరానికి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు సరిగ్గా రైతులకు, మహిళలకు, యువకులకు, పేదలకు నష్టదాయకంగా ఉన్నాయి. ఇప్పుడు వీరందరికీ ఎర్రకోటపై నుండి మోడీగారు ఇచ్చే సందేశం వాతబెట్టి పసరు రాసినట్టుగా ఉంటుంది. రైతుల పరిస్థితి చూస్తే, గత మోడీ ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను ఉపసంహరించాలని, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని 2020లో దేశవ్యాపితంగా వీరోచిత పోరాటాన్ని సాగించారు. నెలల తరబడి ఢిల్లీ రాజధానిని దిగ్బంధనం చేశారు. ఉద్యమానికి తలొగ్గి నల్ల చట్టాలను రద్దు చేసినప్పటికీ, మోసపూరిత ఎత్తుగడలతో కాలయాపన చేసింది తప్ప, మద్దతు ధరకు చట్టబద్ధత ఇవ్వడానికి సిద్ధపడలేదు. ఇప్పుడు కూడా మోడీ ప్రభుత్వానికి అటువంటి ఆలోచన లేదనేది బడ్జెట్ ప్రసంగాలు విదితం చేస్తున్నాయి. పైపెచ్చు మొన్న బడ్జెట్‌లో ఎరువులకు సబ్సిడీ తగ్గించారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్టు పెంచలేదు. ఇంకోవైపు వ్యవసాయంలోకి కార్పొరేట్లు ప్రవేశించడానికి వీలుగా అగ్రిస్టాక్ వంటి కొత్త ప్రతిపాదనలు చేశారు. రైతులు, ప్రత్యేకంగా పేద, మధ్యతరగతి, కౌలు రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలకు పరిష్కారాలు చూపకుండా, భూ వ్యాపారాన్ని వేగిరపర్చడానికి రాష్ట్రాలను ఒత్తిడి చేసేందుకు ప్రోత్సాహక పథకాలను సిద్ధం చేశారు. యువకుల పరిస్థితి మరీ అధ్వాన్నం. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలని మోడీ వాగ్దానం చేసినప్పుడు యువకులు చాలా ఆశపడ్డారు. గత దశాబ్ద కాలంలో బీజేపీ ప్రభుత్వం ఉపాధి కల్పనలో ఘోరంగా విఫలమైంది. నిరుద్యోగం పెరిగింది. ఉపాధిని పెంచే పరిశ్రమలను, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడం కాకుండా మేక్ ఇన్ ఇండియా వంటి స్కీములన్నీ విదేశీ కంపెనీలు, ఉపాధి సృష్టించని హైటెక్ పరిశ్రమలు పెట్టుకోవడానికి తోడ్పడుతున్నాయి. తాజా బడ్జెట్‌లో ఉపాధి సృష్టికి ప్రకటించిన స్కీంలు ప్రభుత్వ సొమ్మును ఐదు వందల పెద్ద కంపెనీల బొక్కసం నింపడానికి వినియోగపడతాయి తప్ప, యువకులకు ఉపాధినిచ్చేవి కావు.

పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో ఆశ్చర్యం గొలిపే అంశాలు ప్రస్తావించబడ్డాయి. మన పెట్టుబడిదారుల లాభాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయని, కానీ వారు పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టడంలేదని, యంత్రాలు, పరికరాలు కొనేదానికన్నా విలాసాలకు ఖర్చు పెడుతున్నారని సర్వే వెల్లడించింది. ఇక ఎక్కడినుండి మన యువతకు ఉపాధి వస్తుంది. దేశంలోని యువతరం ఆటపాటల్లో వారు ఏం సాధించారనేది మన ప్రగతికి, దేశ ప్రతిష్టకు ఒక కొలమానం. పారిస్‌లో జరిగిన ఒలంపిక్స్‌లో మన దేశం ఒక వెండి, ఐదు కాంస్య పతకాలతోనే తిరిగి రావాల్సి వచ్చింది. రావలసిన కొన్ని పతకాలు తృటిలో తప్పిపోయాయి. ఎంతో సాధనచేసి పోటీల్లో పాల్గొన్న యువతీయువకులను మనం అభినందించాలి. అయితే మనం 140కోట్ల జనాభా కలిగిన, ప్రపంచంలో సంపన్న దేశాల పక్కన చేరాలని ఉవ్విళ్లూరుతున్న దేశంగా చూసుకున్నపుడు, మనం ఎక్కడు న్నామని ప్రశ్నించుకుంటే యువతరాన్ని ఎంత నిర్లక్ష్యం చేస్తున్నామో అర్థమవుతుంది. మన పాఠశాల, కళాశాలస్థాయి విద్యావిధానం ఎంత లోపభూయిష్టంగా ఉందో, మోడీ వచ్చిన తర్వాత నూతన విధానం పేరుతో అది మరింత అధ్వాన్నం ఎలా అయిందో ఆటల్లో వెనకంజ స్పష్టంగా వెల్లడిస్తుంది. యువతరం పట్ల మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం తెలియ జేస్తుంది.

ఇక మహిళలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, ఇతర సామాజిక తరగతి గురించి చెప్పుకోనక్కరలేదు. ఈ తరగతులపై హింస, అత్యా చారాలు, నిత్యకృత్యమయ్యాయి. పితృస్వామిక భావజాలాన్ని, సనాతనవాదాన్ని గొప్పగా బీజేపీ నాయకులు, సంఘ్ పరివార్ కీర్తిస్తున్న తరుణంలో బలహీనవర్గాలపై అవమానాలు, అఘాయిత్యాలు పెరగడంలో ఆశ్చర్యం లేదు. ఆరెస్సెస్ అనుకూల పత్రిక పాంచజన్యంలో, అత్యంత దుర్మార్గమైన కుల వ్యవస్థను దేశాన్ని సమైక్యంగా ఉంచే ఒక గొప్ప వ్యవస్థగా కీర్తిస్తూ రాశారంటే బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత సామాజిక అభివృద్ధి నిరోధకులకు ఎంత ధైర్యం వచ్చిందో చూడవచ్చు. గిరిజనుల పరిస్థితి మరింత దైన్యంగా మారింది. అడవులు, గనులు, కొండలను కార్పొరేట్ల లూటీకి అప్పగించడానికి, వారికి ఇచ్చిన రక్షణలన్నింటిని తొలగిస్తున్నా రు. అభ్యంతరం పెట్టినవాళ్లపై క్రూర నిర్బంధం ప్రయోగిస్తున్నారు. ఉదాహరణకు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన వేలాది గిరిజన కుటుంబాలను పునరావాసం కల్పించకుండా రోడ్డున పడేశారు. మైనారిటీలైతే బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితిని సృష్టించారు.

పేదలను వాడుకుని విసిరేసే వస్తువులుగా మోడీ ప్రభుత్వం చూస్తున్నది. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకానికి వరుసగా కోతలు పెడుతున్నది. ఈ బడ్జెట్టులోనూ కేటాయింపులు తగ్గించింది. ఆహార సబ్సిడీని తగ్గించింది. ప్రభుత్వ ఆర్థిక సర్వే ప్రకారమే పెట్టుబడిదారుల లాభాలు ఇరవై శాతానికి పైగా పెరుగుతుంటే, కార్మికులు, కష్టజీవుల ఆదాయాలు పడిపోయాయి. మధ్య తరగతి ఆదాయాలు సైతం ఎదుగుబొదుగు లేకుండా ఉన్నాయి. పెద్ద పెద్ద భూ యజమానుల ఆదాయాలను కలుపుకుని లెక్కగట్టినా రైతు ఆదాయాలు ఒక్క శాతం మాత్రమే పెరిగాయి. ధరలు మాత్రం ఐదు శాతంపైనే పెరుగుతున్నాయి. పేదలు ఎక్కువగా వినియోగించే ఆహార పదార్థాల ధరలు పదిశాతం పైబడి పెరుగుతున్నాయి. అంటే నిజ ఆదాయాలు ఇంకా తక్కువగా ఉన్నాయన్నమాట. కనీవినీ ఎరుగని లాభాలు గడిస్తున్న కార్పొరేట్ల నుండి అదనపు పన్నులు వసూలు చేసి పేదల ఆదాయాలను పెంచే కార్యక్రమాలు చేపట్టకుండా, ఈ బడ్జెట్‌లో వారికి మరిన్ని రాయితీలు, తాయిలాలు మోడీ ప్రభుత్వం ఇస్తున్నది. ఇది పేదలపై మోడీ చూపిస్తున్న ప్రేమలోని కుటిలత్వం.

పైన ప్రస్తావించినవన్నీ ఒక ఎత్తయితే, మోడీ ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను విధ్వంసం చేసేందుకు తీసుకుంటున్న నిర్ణయాలు మరో ఎత్తు. మూడవసారి అధికారం చేపట్టిన తర్వాత తీసుకుంటున్న చర్యలను చూసినా నిరంకుశ పాలనపై వేగంగా నడుస్తున్నట్లు గమనించవచ్చు. పౌర, నేర చట్టాలలో ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగే అనేక మార్పులు చేసారు. మీడియా నోరు నొక్కేందుకు కొత్త బ్రాడ్‌కాస్టింగ్ బిల్లును ప్రతిపాదిస్తున్నారు. ఒకదేశం - ఒకే ఎన్నిక కోసం రాజ్యాంగంలో తీవ్ర మార్పులు చేయడానికి సిద్ధమవుతున్నారు. మైనారిటీలకు నష్టం కలిగించే రీతిలో వక్ఫ్ బోర్డు చట్టానికి పలు సవరణలు తెస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో పౌరహక్కులను హరించే అనేక రాక్షస చట్టాలను తెస్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నారు.

ఇటువంటి దుష్పరిపాలనను కప్పిపుచ్చుకోవడానికి స్వతంత్ర్య దినోత్సవాన్ని ప్రధానమంత్రి మోడీ ఉపయోగపెట్టుకుంటారు. వాగాడంబరంతో నిజాలను కప్పేస్తాడు. మభ్యపెట్టే వాగ్దానాలను చేస్తారు. మనకు తెలుసు మోడీ చెప్పేది ఒకటి, చేసేదొకటి అని.

అందుకే మనం కూడా ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సామాజిక న్యాయాన్ని ప్రజల జీవన ప్రమాణాలను రక్షించుకునేందుకు ఈ సందర్భంగా కృతనిశ్చయులం కావాలి. ■

> మోడీ ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను విధ్వంసం చేసేందుకు తీసుకుంటున్న నిర్ణయాలు మరో ఎత్తు. మూడవసారి అధికారం చేపట్టిన తర్వాత తీసుకుంటున్న చర్యలను చూసినా నిరంకుశ పాలనపై వేగంగా నడుస్తున్నట్లు గమనించవచ్చు. పౌర, నేర చట్టాలలో ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగే అనేక మార్పులు చేసారు. మీడియా నోరు నొక్కేందుకు కొత్త బ్రాడ్‌కాస్టింగ్ బిల్లును ప్రతిపాదిస్తున్నారు. ఒకదేశం - ఒకే ఎన్నిక కోసం రాజ్యాంగంలో తీవ్ర మార్పులు చేయడానికి సిద్ధమవుతున్నారు. మైనారిటీలకు నష్టం కలిగించే రీతిలో వక్ఫ్ బోర్డు చట్టానికి పలు సవరణలు తెస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో పౌరహక్కులను హరించే అనేక రాక్షస చట్టాలను తెస్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నారు.

> కేంద్రం 2024-25 సంవత్సరానికి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు సరిగ్గా రైతులకు, మహిళలకు, యువకులకు, పేదలకు నష్టదాయకంగా ఉన్నాయి. ఇప్పుడు వీరందరికీ ఎర్రకోటపై నుండి మోడీగారు ఇచ్చే సందేశం వాతబెట్టి పసరు రాసినట్టుగా ఉంటుంది. రైతుల పరిస్థితి చూస్తే, గత మోడీ ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను ఉపసంహరించాలని, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని 2020లో దేశవ్యాపితంగా వీరోచిత పోరాటాన్ని సాగించారు. నెలల తరబడి ఢిల్లీ రాజధానిని దిగ్బంధనం చేశారు. ఉద్యమానికి తలొగ్గి నల్ల చట్టాలను రద్దు చేసినప్పటికీ, మోసపూరిత ఎత్తుగడలతో కాలయాపన చేసింది తప్ప, మద్దతు ధరకు చట్టబద్ధత ఇవ్వడానికి సిద్ధపడలేదు.

ప్రాజెక్టు పేరు మారితే చరిత్ర మారుతుందా?


నున్నా నాగేశ్వరరావు
9490098191

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. దీని కోసం జిల్లాలో పెద్దఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. మంత్రుల పర్యటనలు, ట్రయల్ రన్స్ నిర్వహిస్తూ హంగామా చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ను తెచ్చిన లేదా పూర్తిచేసిన ఘనత తమదంటే తమదేనని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీలుపడి మీడియా సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ ఖాతాలో వేసుకోవాలని, తద్వారా రాజకీయ లబ్ది పొందాలని ఆరాటపడుతున్నారు.కానీ ఈ ప్రాజెక్టును సాధించింది ఎవరు? ప్రజల తరపున పోరాడింది ఎవరు? వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసింది ఎవరు? ఈ వాస్తవాలు నేడు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉన్నది.

గోదావరి నది ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఎక్కువ దూరం ప్రయాణిస్తుంది. గత కాంగ్రెస్, తెలుగుదేశం పాలకుల నిర్లక్ష్యం వలన వందల టీఎంసీల నీళ్లు వృథాగా సముద్రం పాలవుతున్నాయి. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద 2.5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ ఒక పంటకు కూడా గ్యారంటీ లేని పరిస్థితి. 1997 నుండి 2003 వరకు వరుసగా అనావృష్టి, కరువు పరిస్థితులు ఏర్పడి ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయి. సాగునీరే కాదు, తాగునీరు కూడా దొరకని పరిస్థితి నెలకొన్నది. ఖమ్మం జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి గోదావరి జలాలను మళ్లించటమే పరిష్కారమని చాలాకాలంగా ఉభయ కమ్యూనిస్టు పార్టీలు డిమాండ్ చేస్తూ వచ్చాయి.

మహాప్రస్థాన పాదయాత్ర

జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రజల చిరకాల కోరికను తీర్చటానికి తాగు, సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధించటమే ఏకైక పరిష్కారమని సీపీఐ(ఎం) పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ భావించింది. ప్రాజెక్టు కార్యరూపం దాల్చటానికి కార్యాచరణను రూపొందించింది. ఆ కార్యాచరణే మహాప్రస్థాన పాదయాత్రగా మారింది. నాటి సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి, ఖమ్మం పార్లమెంట్ మాజీ సభ్యులు కామ్రేడ్ తమ్మినేని వీరభద్రం 2003లో దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధనే లక్ష్యంగా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. వాజేడులో ప్రారంభమైన ఈ యాత్ర సుమారు అయిదు నెలలపాటు 46 మండలాల్లో 2600 కిలోమీటర్లకుపైగా జనప్రవాహంలా సాగి వేలాదిమందితో ఖమ్మంలో ముగిసింది. గ్రామ గ్రామాన ప్రజలు రాజకీయాలకతీతంగా యాత్రకు ఘన స్వాగతం పలికారు. సంపూర్ణ మద్దతు, సంఘీభావాన్ని తెలిపారు. గ్రామాల్లో అనేక సమస్యలు ముందుకొచ్చాయి. అంతర్లీనంగా వాటన్నింటికి దుమ్ము గూడెం ప్రాజెక్టు సాధనే గోదావరి జలాలు జిల్లాలో పారించటమే పరిష్కారంగా ఉన్నది.నాడు సాధ్యం కాదు అన్నవారే నేడు సాధించామం టున్నారు. నాటి టీడీపీ నేతలు యాత్రను అపహాస్యం చేసినా ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

2004లో జరిగిన శాసనసభ ఎన్నికలలో 9 స్థానాలకు గాను కాంగ్రెస్, వామపక్షాలు అన్ని స్థానాలు గెలుపొందాయి. టీడీపీ 9 స్థానాలలో ఓటమి పాలైంది. ఖమ్మం, మధిర, భద్రాచలం సీపీఐ(ఎం) గెలుచుకున్నది. జిల్లాలో 8 స్థానాలలో కాంగ్రెస్, వామపక్షాలు కలిసి చేసినప్పటికీ ఖమ్మం అసెంబ్లీ స్థానంలో సర్దుబాటు కుదరలేదు. చతుర్ముఖ పోటీలో మహాప్రస్థాన పాదయాత్ర సారథి తమ్మినేని వీరభద్రం టీడీపీపై పదివేల మెజార్టీతో ఖమ్మం అసెంబ్లీ నుండి గెలుపొందాడు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తమ్మినేని వీరభద్రం 9 మంది శాసనసభ్యులను తీసుకొని ముఖ్యమంత్రిని కలిసి దుమ్ముగూడెం ప్రాజెక్టు మంజూరు చేయమని ఒత్తిడి చేశారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి హామీ నిచ్చారు. రెండేండ్లయినా కార్యరూపం దాల్చకపోవడంతో అసెంబ్లీలో చర్చకు తెచ్చారు.2007లో దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం జిల్లా కమిటీ కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వగా రెండు రోజులు పదివేల మంది రైతులు పాల్గొన్నారు. అక్కడే వంటావార్పు, బస చేశారు. సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలంతా వారితో పాటు భద్రాచలం ఎంపీ మిడియం బాబూరావు పాల్గొన్నారు. త్వరలో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తానని ముఖ్యమంత్రి మాటగా జిల్లా కలెక్టర్ హామీనివ్వటంతో ఆందోళన విరమించారు.

రాజకీయ ప్రయోజనాల కోసం...

ప్రాజెక్టును వైఎస్ విడగొట్టారు. దుమ్ముగూడెం వద్ద రాజీవ్‌సాగర్ గాను, రుద్రమకోట వద్ద ఇందిరాసాగర్ గాను మార్చి నాలుగు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 2.5 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు స్థిరీకరణతో పాటు బేతుపల్లి, లంకాసాగర్, వైరా, బయ్యారం, పాలేరు చెరువుల కింద ఆయకట్టు స్థిరీకరణ, తాగునీటి అవసరాలు తీర్చటానికి రూపొందించబడింది.కార్ల యాత్ర అసెంబ్లీకి పాదయాత్రగా మారింది. ఈ రెండు ప్రాజెక్టులకు సుమారు రూ.4వేల కోట్ల అంచనాతో ప్రతిపాదించారు. రెండేండ్లయినా నిధులు కేటాయింపులు చేయలేదు. 2009లో సీపీఐ(ఎం), తెలుగుదేశం, న్యూడెమోక్రసీ పార్టీలతో కలిసి ఖమ్మం నుండి 500 కార్లతో అసెంబ్లీకి వెళ్లాలని కార్యక్రమం చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించింది. అనుమతి లేదని కార్లను అడ్డుకున్నది. మూడు పార్టీల నాయకులు తమ్మినేని, తుమ్మల నాగేశ్వరరావుల సారథ్యంలో పాదయాత్ర చేపట్టారు.వీరితో పాటు ఆయా పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు వందలాదిగా కదిలారు. ఈ యాత్ర వారం రోజులు సాగి నకిరేకల్ చేరుకునేసరికి నాటి ఆర్థిక మంత్రి రోశయ్య రూ.300 కోట్లు కేటాయిస్తూ బడ్జెట్ పెట్టడంతో యాత్ర ముగిసింది. మోకాళ్ల యాత్ర చేసినా దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధ్యం కాదన్న తెలుగుదేశం నాయకులంతా ఈ పాదయాత్రలో పాల్గొనడం కొస మెరుపు.

దుమ్ముగూడెంకు అరకొరగా నిధులు కేటాయించినా



పనులు మాత్రం నత్తనడకన సాగాయి. కృష్ణా జలాలను శ్రీశైలం నుండి పోతిరెడ్డి పాడు సొరంగమార్గం ద్వారా రాయలసీమకు తరలించి, గోదావరి జలాలను నాగార్జునసాగర్‌కు తరలించి ఖమ్మం జిల్లా ప్రజలకు దుమ్ముగూడెం నీళ్ల రాకుండా దుమ్ముగొట్టే కుట్రలకు నాటి వైఎస్ ప్రభుత్వం తెరలేపింది. దాని కోసం దుమ్ముగూడెం నుండి సాగర్ టైల్‌పాండ్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 165 టీఎంసీలను తరలించటానికి ప్రాజెక్టు ప్రతిపాదన నిధుల కేటాయింపులు జరిగాయి. దీనిని సీపీఐ(ఎం) పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. తెలుగుదేశంతో కలిసి జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టింది. జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పర్యటనను అడ్డుకున్నది.

1500 మందితో మహారైతు పాదయాత్ర

వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి మరణంతో కొంతకాలం సాగర్ టైల్‌పాండ్ ఆగిపోయింది. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మళ్లీ కొనసాగించే ప్రయత్నాలు చేశారు. దుమ్ముగూడెం-సాగర్ టైల్‌పాండ్ రద్దు చేయాలి, దుమ్ముగూడెం ప్రాజెక్టును పూర్తిచేయాలి, నిధులివ్వాలనే డిమాండ్‌తో 1500 మంది రైతులతో 2012లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ రైతు మహాపాదయాత్ర చేపట్టింది. కామ్రేడ్ పోతినేని సుదర్శన్ సారథ్యంలో దుమ్ముగూడెం నుండి భద్రాచలం మీదుగా పాలేరు-ఖమ్మం వరకు 350 కిలోమీటర్లు 23 రోజులు సాగింది. ఈ యాత్రకు ప్రజల నుండి అనూహ్యమైన స్పందన వచ్చింది. ఈ యాత్రలో పాల్గొన్నవారు హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో ధర్నాకు దిగారు. అధికార యంత్రాంగంలో కదలిక వచ్చి పనులు ప్రారంభించారు.

సీతారామగా మారిన దుమ్ముగూడెం

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోయి తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైంది. కేసీఆర్ ప్రభుత్వం రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం పెండింగ్ ప్రాజెక్టులను రీడిజైన్ పేరుతో వాటి పేర్లు, అంచనాలు మార్చివేశారు. దుమ్ముగూడెం రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్‌లను మార్చివేసి మొదట శ్రీరామ తదుపరి సీతారామ ప్రాజెక్టుగా మార్చారు. అప్పటి వరకు ఖర్చు పెట్టిన సుమారు రూ.2 వేల కోట్లు వృథా అయ్యాయి. మొదట రూ.13వేల కోట్లు తదుపరి 18 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టు డిజైన్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్‌లో మొత్తం పది లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, తాగునీటి పథకాలకు రూపకల్పన చేశారు. రెండేండ్లలో పూర్తిచేస్తామని కేసీఆర్, తుమ్మల నాగేశ్వరరావులు ప్రకటించారు. పదేండ్ల బీ(టీ)ఆర్ఎస్ పాలన ముగిసినా పూర్తికాలేదు. సుమారు రూ.13 వేల కోట్లు ఖర్చు చేశారు. మొదట ప్రతిపాదించిన రోళ్లపాడు, బయ్యారం చెరువులను (బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లుగా మార్చే ప్లానును) మినహాయించారు.

పూర్తికాని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవాలా?

తొమ్మిది మాసాల క్రితం 2023లో జరిగిన శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓడిపోయింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అనూహ్యంగా ఖమ్మం జిల్లా నుండే గెలిచిన ఐదుగురిలో ముగ్గురు మంత్రులయ్యారు. ప్రాజెక్టును ఆగస్టు15కల్లా ప్రారంభమవుతుందని ప్రకటించారు. జూలూరుపాడు దాకా వచ్చిన కాల్వను అడ్డం తిప్పి ఏన్కూర్ వద్ద నాగార్జునసాగర్ ఎడమకాల్వలో కలుపుతున్నారు. దీని ఫలితంగా సత్తుపల్లి నియోజకవర్గానికి, వైరా చెరువుకు మాత్రమే నీళ్లు వెళ్తాయి. ఇది మినహా కొత్తగూడెం జిల్లాకు, వైరా, ఖమ్మం, పాలేరు, డోర్నకల్ నియోజకవర్గాలకు ఈ ప్రారంభం ద్వారా ఎకరానికి కూడా నీళ్లు రావు. ప్రధాన కాల్వకు పాలేరు వరకు భూసేకరణ పూర్తికాలేదు. ఇప్పటివరకు అయిన కాల్వకు డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు 6500 ఎకరాలు భూసేకరణ జరగాలి, పనులు చేయాలి. ప్రస్తుతం బి.జి.కొత్తూరు, పూసుగూడెం, కమలాపురం పంపుహౌజ్‌లు మాత్రమే పూర్తయ్యాయి. వైరా చెరువు అలుగు పారుతోంది. నాగార్జునసాగర్ నిండింది. ఎడమ కాల్వకు తక్షణం నీళ్లవసరం లేదు. 104 కిలోమీటర్ల ప్రధాన కాల్వను పూర్తిచేసి పాలేరుకు అనుసంధానం చేస్తే రబీ సీజన్‌కు సత్తుపల్లికి కూడా నీళ్లివ్వచ్చు. అసంపూర్తిగా, అసమగ్రంగా ఉన్న ప్రాజెక్టును ప్రారంభించటమంటే పేరు కోసమో, గత ప్రభుత్వం చేయలేదు గనుక తాము చేశామని చెప్పుకోవటానికి మాత్రమే ఇది ఉపయోగపడుతుంది.

సమగ్రంగా ప్రాజెక్టును పూర్తిచేయాలి

మండల స్థాయి, గ్రామస్థాయి పాదయాత్రలు, మహాప్రస్థాన, మహారైతు పాదయాత్రలు, అసెంబ్లీకి పాదయాత్ర, హైదరాబాద్‌లో ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడులు, మండల రెవెన్యూ ఆఫీసుల దిగ్బంధనాలు, అరెస్టులు, కేసులు, నిర్బంధాలు, లాఠీ ఛార్జీలు ఎదుర్కొని ప్రభుత్వాల మెడలు వంచి ఈ ప్రాజెక్టును సాధించింది సీపీఐ(ఎం). మిగతా వామపక్షాలు కూడా తమ తమ పద్ధతుల్లో ఆందోళనలు, పోరాటాలు చేశాయి. గత కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల అసమర్థత, నిర్లక్ష్యం వలన రెండు దశాబ్దాలు గడిచినా పూర్తికాలేదు. కొత్త సీసాలో పాత సారాయిలాగా అదే నాయకులు మంత్రులుగా ఉన్నారు. ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు. రూ.4వేల కోట్లతో పూర్తయ్యే పనులు 20 వేల కోట్లు దాటుతున్నాయి. ఆగస్టు 15న అరకొరగా ప్రారంభించి వదిలేయకుండా పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, ఇల్లందు, ఖమ్మం, డోర్నకల్, మధిర నియోజకవర్గాలతో పాటు దుమ్ముగూడెం వైపు ప్రగళ్లపల్లి లిఫ్టును కూడా పూర్తిచేసి పదిలక్షల ఎకరాలకు నీళ్లివ్వాలి. రోళ్లపాడు, బయ్యారం, వైరా, బేతుపల్లి, లంకాసాగర్, తుమ్మల చెరువు తదితర చెరువులను అనుసంధానం చేయాలి. అప్పుడే ఈ ప్రాజెక్టు పూర్తవుతుంది. అప్పటిదాకా సీపీఐ(ఎం) ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుంది.

> మండల స్థాయి, గ్రామస్థాయి పాదయాత్రలు, మహాప్రస్థాన, మహారైతు పాదయాత్రలు, అసెంబ్లీకి పాదయాత్ర, హైదరాబాద్‌లో ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడులు, మండల రెవెన్యూ ఆఫీసుల దిగ్బంధనాలు, అరెస్టులు, కేసులు, నిర్బంధాలు, లాఠీ ఛార్జీలు ఎదుర్కొని ప్రభుత్వాల మెడలు వంచి ఈ ప్రాజెక్టును సాధించింది సీపీఐ(ఎం). మిగతా వామపక్షాలు కూడా తమ తమ పద్ధతుల్లో ఆందోళనలు, పోరాటాలు చేశాయి. గత కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల అసమర్థత, నిర్లక్ష్యం వలన రెండు దశాబ్దాలు గడిచినా పూర్తికాలేదు. కొత్త సీసాలో పాత సారాయిలాగా అదే నాయకులు మంత్రులుగా ఉన్నారు. ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు. రూ.4వేల కోట్లతో పూర్తయ్యే పనులు 20 వేల కోట్లు దాటుతున్నాయి.

నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉమారాణి



నవతెలంగాణ- నకిరేకల్

నకిరేకల్ పట్టణ 11వ వార్డు కౌన్సిలర్, వైస్ చైర్‌పర్సన్ మురారి శెట్టి ఉమారాణిని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 12న నకిరేకల్ మున్సిపల్ చైర్మెన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా 16 మంది కౌన్సిలర్లు మద్దతు తెలపడంతో అవిశ్వాసం నెగ్గింది. దీంతో చైర్మెన్ న్ స్థానం ఖాళీ ఏర్పడింది. తదుపరి చైర్మెన్ ఎన్నిక జరిగేంతవరకు వైస్ చైర్మెన్ ఉమారాణిని చైర్‌పర్సన్‌గా విధులు నిర్వర్తించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ప్రజా సమస్యలను ఎత్తిచూపడంలో ముందున్న నవతెలంగాణ

న్యాయవాది బొమ్మరగాని కిరణ్



నవతెలంగాణ-నల్లగొండడెస్క్

ప్రజాసమస్యలను వెలికితీయడంతో నవతెలంగాణ నిరంతరం ముందుంటుందని , రానున్న రోజుల్లో పత్రిక మరింత అభివృద్ధి చెంది పేద ప్రజలకు, కార్మికవర్గానికి, రైతంగా సమస్యలను ఎత్తిచూపుతూ మరింత ముందుకు వెళ్లాలి. ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానకర్తగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా సిబ్బందికి, విలేకర్లకు శుభాకాంక్షలు.

ఆస్పత్రుల ఫిర్యాదుల కోసం ...
కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్

- ఫిర్యాదులు రాకుండా చూసుకోవలసిన బాధ్యత వైద్యులదే
- కలెక్టర్ నారాయణ రెడ్డి



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ప్రభుత్వాస్పత్రులపై వచ్చే ఫిర్యాదుల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. అందువల్ల జిల్లాలోని అన్ని ఏరియాస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలోని డాక్టర్లు, సిబ్బంది వారి ఆస్పత్రులపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కోరారు. వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. బుధవారం ఆయన నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుష, మహిళ వార్డులు, ల్యాబ్, ఎమర్జెన్సీ వార్డులను సందర్శించి వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన పలువురు రోగులతో మాట్లాడారు. ఎక్కువమంది జ్వరం , వంటి నొప్పులు,తదితర కారణాలతో ఆస్పత్రికి వస్తున్నారని గమనించిన ఆయన ఏ మండలాలు, గ్రామాల వారు వస్తున్నారని డాక్టర్లను అడిగారు. గడిచిన వారం రోజుల నివేదికను ఆధారం చేసుకుని ఏయే మండలాల నుండి జ్వరపీడితులు ఎక్కువగా వస్తున్నారో సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ రమణ కుమార్‌ను ఆదేశించారు. ఆస్పత్రిలో మందులు సరిపడా ఉన్నాయా? ఫ్లూయిడ్స్ ,అంటీ బయోటిక్స్ ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ ని సందర్శించి ల్యాబ్ రిపోర్ట్స్ ను పరిశీలించారు. టీ హబ్ కు రోజు ఎన్ని టెస్టులు వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్ నుండి శాంపిల్స్ తమకు వస్తున్నట్లు లాబ్ నిర్వాహకులు కలెక్టర్ కు వివరించారు. అలాగే జిజిహెచ్ నల్గొండ నుండి ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇప్పటివరకు నిర్వహించిన టెస్టులలో గత నెల, ఈనెల డెంగ్యూ,చికెన్‌గున్యా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ తనిఖీ చేసే సమయానికి 200 శాంపిల్స్ ని కలెక్ట్ చేసి 98 టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు. టీ- హబ్ నిర్వాహకులు, ల్యాబ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఎమర్జెన్సీ వార్డును తనిఖీ చేసిన కలెక్టర్ రోగులపట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా కార్మిక శాఖ ఉప కమిషన్ శ్యాంసుందర్ జాదు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు


స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు.బుధవారం ఆయన ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సంవత్సరం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే ప్రముఖులకు, ప్రజలు, మీడియా తదితరులందరికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రోటోకాల్ ప్రకారం సీట్లు ఏర్పాటుతో పాటు,టెంట్లు, తాగునీరు, ఏర్పాట్లలో ఎలాంటి లోపం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, గృహ నిర్మాణ పిడి రాజ్ కుమార్,ఆర్డిఓ రవి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, డిపిఆర్ఓ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషన్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, డిఎస్పి శివశంకర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషి...
రాచమల్ల రామచంద్రం

- 27ఏండ్లు ఏకగ్రీవ సర్పంచిగా చేసి మనన్నలు
- రామచంద్రం మరణం తీరని లోటు

నవతెలంగాణ- చిట్యాల

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ,వట్టిమర్తి గ్రామానికి సుదీర్ఘకాలం 27ఏండ్ల పాటు ఏకగ్రీవ సర్పంచ్ గా పనిచేసిన రాచమల్ల రామచంద్రం మృతి పట్ల ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఆయన అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాచమల్ల రామచంద్రం చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో 1944లో రాచమల్ల సర్వయ్య, మల్లమ్మ దంపతులకు జన్మించారు. ఆయనకు ఒక తమ్ముడు, ఒక చెల్లెలు ఉన్నారు. రామచంద్రం ,మీనమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇతను తల్లిదండ్రులతోపాటు తమ కుటుంబ అవసరాల కోసం వ్యవసాయ పనులు చేసుకుంటూ అమరజీవి నర్రా రాఘవరెడ్డి నడిపే వయోజన పాఠశాలలో (రాత్రి పాఠశాల) అక్షరాభ్యాసం పొందాడు. ఈ క్రమంలోనే నర్రా రాఘవరెడ్డి సూచనతో జీతగాల సంఘానికి నాయకత్వం వహిస్తూ కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులు అయ్యారు.. ఆ సందర్భంలోనే కమ్యూనిస్టు పార్టీలో సైద్ధాంతిక విభేదాలు వచ్చిన కారణంగా సీపీఐ(ఎం) వైపు నర్రా రాఘవరెడ్డి ,కందాల రంగారెడ్డి ఉండగా వారి సమక్షంలో పార్టీ సభ్యత్వం పొందారు. ఆనాడు శివనేనిగూడెం, వట్టిమర్తి గ్రామాలకు కలిపి ఒకే పంచాయతీ బోర్డు ఉండేది, దానికి మొదటి సర్పంచి నర్రా రాఘవరెడ్డి కాగా, ఆయన అనంతరం 1971లో రాచమల్ల రామచంద్రం ఏకగ్రీవ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు అప్పటినుండి అప్రతిహతంగా 27 ఏండ్ల పాటు ఏకగ్రీవంగా సర్పంచ్ గా కొనసాగారు. వట్టిమర్తి గ్రామంలో కరెంటు ,మంచినీటి వసతి, రోడ్లు ,మురుగు కాలువలు, ప్రాథమిక పాఠశాల తో పాటు ఉన్నత పాఠశాలను సాధించడంలో కీలకపాత్ర పోషించారు. రామచంద్రంకు ఎక్కువగా చదువు లేకపోయినా పాఠశాలలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వట్టిమర్తి గ్రామ విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు అందించడంలో ముఖ్య భూమిక పోషించారు. దీనివల్ల గ్రామంలోని విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నత ఉద్యోగాలుగా స్థిరపడ్డారు . నీతి ,నిజాయితీగా ఉండి నర్రా రాఘవరెడ్డి సలహాలు సూచనలతో ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ సేవలు అందించారు.



అంతేకాకుండా చిట్యాల గ్రామపంచాయతీలో రైస్ మిల్లుల నిర్మాణానికి ఆటంకాలు వచ్చినప్పుడు వట్టిమర్తి గ్రామ పరిధిలో రైస్ మిల్లుల నిర్మాణానికి అనుమతి ఇచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించారు. వట్టిమర్తి శివారులో గల కుమార్ మెటలర్జికల్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీకి గ్రామపంచాయతీ అనుమతులు ఇచ్చి పారిశ్రామిక రంగానికి పెద్ద పీట వేశారు. దీంతో వట్టిమర్తి తో పాటు చుట్టు పక్కల గ్రామాల యువతకు ఉపాధి కల్పించడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన సీపీఐ(ఎం) నల్గొండ డివిజన్ కమిటీ సభ్యులుగా కొనసాగుతూ నార్కట్ పల్లి ప్రాంత బాధ్యతలు నిర్వహించేవారు. ఈ క్రమంలో సైకిల్ పై తిరుగుతూ పార్టీ ఉద్యమాన్ని గ్రామాలలో విస్తరింపజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులుగా అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులుగా కూడా పనిచేశారు. పార్టీ నూతనంగా మండల కమిటీలు ఏర్పాటుచేసిన సందర్భంలో ఆయన నార్కట్‌పల్లి మండలానికి మొదటి కార్యదర్శిగా ఎన్నికై పని చేశారు అనంతరం నల్లగొండ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులుగా పని చేశారు. కొంతకాలం నుండి అనారోగ్యంతో ఉండగా వట్టిమర్తి గ్రామంలోనే ఉంటూ తన శేష జీవితాన్ని గడిపారు. ఈ క్రమంలోనే ఆరోగ్యం మరింత క్షీణించడంతో హైదరాబాదులో నివాసముంటున్న కుమారుడి వద్ద ఉండి బుధవారం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకపోగా తుది శ్వాస విడిచారు.



వైద్య సేవలందించడంలో అలసత్వం వహించవద్దు

- వైద్యులు, సిబ్బందిపై అదనపు కలెక్టర్ ఆగ్రహం

నవతెలంగాణ -మిర్యాలగూడ

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో అలసత్వం వహించవద్దని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచందరావు సూచించారు. బుధవారం స్థానిక ఏరియాస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విధులకు హాజరైన వైద్యులు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఇప్పటివరకు జ్వరాలతో ఎంతమంది వైద్య సేవలు పొందుతున్నారు..? ఎంతమంది ఇన్ పేషెంట్‌గా చేరి వైద్య చికిత్స పొందుతున్నారు వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలో జనరల్ గైనకాలజిస్ట్ వార్డులను తిరిగి రోగులు తమకు అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి ఆరా తీశారు. ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలను రోగులకు వివరించి అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలు అదే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం సీజన్లో జ్వరాలు బారిన పడుతున్న వారి వివరాలను సేకరిస్తున్నామని దానికి గల కారణాలు తెలుసుకొని నివారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెలలో ఈ ఆస్పత్రిలో 99 మంది జ్వరం పేరిట ఆస్పత్రికి వస్తే రక్తపరీక్షలు చేసి ముగ్గురికి డెంగ్యూ ఉన్నట్టుగా నిర్ధారించాలని వారందరికీ కూడా వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా మలేరియా ఇతర వైరల్ ఫీవర్ వస్తున్నాయని వాటిని అరికట్టేందుకు అని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్యులు సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే మరోసారి ఆస్పత్రిని తనిఖీ చేస్తానన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎం.డి యూసుఫ్ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ శ్రీనివాస్ సమరథ్, డిఈ వెంకన్న, శానిటరీ ఎన్‌స్పెక్టర్ వెంకటరమణ పర్యావరణ ఇంజనీర్ శ్వేత, వైద్యులు సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ నిధులతోనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇలియాజ్

నవతెలంగాణ -మిర్యాలగూడ

ప్రభుత్వ నిధులతోనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుతున్నారని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండి ఇలియాజ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో 30 మీటర్లు ఎత్తు గల జాతీయ జెండాను ఏర్పాటు చేసేందుకు గత సంవత్సరం సెప్టెంబర్‌లో మున్సిపల్ బడ్జెట్లో 20 లక్షల రూపాయలు ఆమోదం కోసం ప్రతిపాదన చేశారని కౌన్సిల్ ఆమోదంతో నిధులు మంజూరు చేశారన్నారు. ఆ సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయా అని చెప్పారు. ఇప్పుడు ఆ నిధులతో ఎన్ఎస్‌పి క్యాంపులో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కానీ స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగతంగా వేడుకలు జరుగుతున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎవరు సొంత నిధులతో ఆ వేడుకలు జరపడం లేదని మున్సిపల్ నిధులు ఖర్చు చేస్తున్నారని ఈ విషయం పట్టణ ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రాజకీయంగా వాడుకోవడం సరైనది కాదన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

నవతెలంగాణ -నకిరేకల్

స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. బుధవారం నకిరేకల్ పట్టణంలో పట్టేటి శివరాజ్ నూతనంగా ఏర్పాటు చేసిన శివ ఐరన్ సిండికేట్ షాపును, అదేవిధంగా చంద్రశేఖర్ నూతనంగా ఏర్పాటు చేసిన సూర్యా బేకర్స్ షాపును ఎమ్మెల్యే వేంవేంగా ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.



త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేయండి

- డీఆర్‌డీఏ పీడీ ఎర్రబెల్లి శేఖర్ రెడ్డి



నవతెలంగాణ -నకిరేకల్

నకిరేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఎర్రబెల్లి శేఖర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి నూతనంగా నిర్మిస్తున్న తాత్కాలిక తరగతి గదులు, శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు, ఎన్నారై లతో కూడిన సమూహాన్ని ఏర్పాటు చేసి ఆర్థిక సహకారం కోరాలని సూచించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య, వసతుల కల్పన తదితర అంశాలను ఆ సమూహంలో పేర్కొనడం ద్వారా పూర్వ విద్యార్థులు, ఎన్నారైలు ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకొస్తారన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట పిఆర్ డిప్యూటీ ఈ ఈ కొండయ్య, ఎంపీడీవో చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ బాలయ్య, పిఆర్ ఏ ఈ సంపత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోదాటి రాములు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లాలోనే నకిరేకల్‌ను ముందంజలో ఉంచండి

నకిరేకల్ మండలాన్ని అన్ని పారామీటర్లలో జిల్లాలోనే ముందంజలో ఉంచాలని డీఆర్‌డీఏ పీడీ ఎర్రబెల్లి శేఖర్ రెడ్డి ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్, ఐకేపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాలన్నారు. అనంతరం ఐకెపి సమీక్ష నిర్వహించారు. జిల్లాలోనే నకిరేకల్ మండలాన్ని ముందంజలో ఉంచడం పట్ల ఏపిఎం, సీసీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో రమణయ్య, ఏపీఎం నరహరి, సీసీలు కొండ మట్టయ్య, మాతంగి స్వరూప, ఈజీఎస్ ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో జూనియర్ డాక్టర్ల ధర్నా



నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్

పశ్చిమ బెంగాల్ రాజధాని కలకత్తాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్య ను ఖండిస్తూ దేశవ్యాప్త జూడాల నిరసనలో భాగంగా బుధవారం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైద్య నిపుణులకు, ముఖ్యంగా మహిళలకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు ఇలాగే కొనసాగితే సురక్షితమైన వాతావరణంలో పనిచేయడం కష్టమవు తుందన్నారు. వైద్యులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కరించాలని, సరిపడా పోలీసు సిబ్బందితో ఔట్ పోస్టును బలోపేతం చేయాలని, ఇంటెర్న్స్, ఎస్ఆర్ఎస్, డీఎంవోలు, డీఎస్ఓ ల కోసం సురక్షితమైన డ్యూటీ రూములను ఏర్పాటు చేయాలని కోరారు. సురక్షితమైన రవాణా సౌకర్యం, పని ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ జిఎంసి నల్లగొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ కే అబ్దుల్ సమద్, డాక్టర్ జనరల్ కార్యదర్శి గగన్, డాక్టర్ సత్య సాయి కృష్ణ, డాక్టర్ బాలు, డాక్టర్ ఇంద్రాణి, డాక్టర్ షాబాజ్, డాక్టర్ హిమాన్షి, డాక్టర్ ఆశ్లేషవల్లి,డాక్టర్ సంప్రీత్, డాక్టర్ హసన్, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం



నవతెలంగాణ-చండూరు

నల్లగొండ జిల్లాలో క్షామ పీడిత, ఫ్లోరైడ్ ప్రాంతాలైన దేవరకొండ మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందించే డిడి ఎత్తిపోతల పథకం డీపీఆర్ ను వెంటనే ఆమోదించి సాగునీరు అందించే వరకు మా పోరాటం కొనసాగుతుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. బుధవారం గట్టుప్పల మండల కేంద్రంలో గట్టుప్పల, చండూరు మండలాల ఉమ్మడి మండల కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చాపల మారయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదించకపోవడం, సుమారు 27 కిలోమీటర్ల కాలువని తవ్వే పనులకు సంబంధించిన పర్యావరణ అనుమతుల కోసం లేఖలు రాయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా డిండి ఎత్తిపోతల పథకానికి డీపీఆర్ ఆమోదింపజేసి అధిక నిధులు కేటాయించి ప్రాజెక్టు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. డిండి ఎత్తిపోతల పథకం సాధన కోసం ఈ నెల 19 వరకు గ్రామాల వారిగా సంతకాల సేకరణ, 20 నుండి 26 వరకు మండల కేంద్రాలలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు, సెప్టెంబర్ 2న సేకరించిన సంతకాలను తీసుకొని కలెక్టర్‌కు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గట్టుప్పల మండల కార్యదర్శికర్నాటి మల్లేశం, చండూరు సీపీఐ(ఎం) మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ గౌడ్, మండలాల నాయకులు పగిళ్ల శ్రీను, పడసబోయిన యాదగిరి, కకునూరి నగేష్, టేకుమట్లకృష్ణ, కొత్తపల్లి నరసింహ,పెదగాని నరసింహ, గుంటోజు విశ్వనాథం, పసుపుల చెన్నయ్య, కర్నాటి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రంలో ట్రయల్ రన్



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

లక్ష ఎకరాలకు సాగునీరు, నాలుగు నియోజకవర్గాల్లో తాగునీరు అందించేందుకు నిర్మాణం చేపట్టిన మండల పరిధిలోని బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు సకాలంలో ప్రాజెక్టును అందుబాటులో తెచ్చేందుకు కసరత్తు మొదలెట్టింది. అందులో భాగంగా బుధవారం బబ్రాహ్మణవెల్లంల ఉదయసముద్రం ప్రాజెక్టు ట్రయల్ రన్ గంటసేపు నిర్వహించారు. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడంతో. సంపును నీటితో నింపి.. ప్రాజెక్టులో నీటిని నిలువ ఉంచే ప్రయత్నం అధికారులు చేపట్టారు. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని గంటలపాటు ట్రయల్ రన్ నిర్వహించి వదిలేసిన సంఘటన తెలిసిందే. రాష్ట్ర రోడ్డు భవనాల సినిమాటో ఫోటోగ్రఫీ శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్వగ్రామంలో గత 18 ఏండ్లుగా నిర్మాణంలో ఉంది. ప్రాజెక్టు సంపు పూర్తయినప్పటికీ ఇంకా కుడి, ఎడమ కాలువలు నిర్మాణం జరగాల్సి ఉంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆసక్తితో నిర్మాణం చేపట్టిన ఈ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేస్తామని ఇప్పటికీ పలుమార్లు ప్రకటించారు.

సాగర్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

- గరిష్ట స్థాయి నీటిమట్టానికి చేరుకున్న సాగర్ జలాశయం



నవతెలంగాణ-నాగార్జునసాగర్

ఎగువ శ్రీశైలం నుండి నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం తిరిగి కొనసాగడంతో ఎన్ఎస్పి అధికారులు బుధవారం 2 క్రస్ట్ గేట్లను 5అడుగుల మేర ఎత్తి 16,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.శ్రీశైలం జలాశయం నుండి సాగర్ జలాశయానికి 63,123 క్యూసెక్కుల వరద వస్తుండటంతో సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిడటంతో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు.దీనితో నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 590 అడుగులవద్ద నీరు నిల్వవుంది.డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 312.0450 టీఎంసీల నీరు నిల్వ ఉంది.జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,394 క్యూసెక్కుల నీటిని,కుడి కాలువ ద్వారా 7528 క్యూసెక్కుల నీటిని,ఎడమ కాల్వద్వారా 7601 క్యూసెక్కుల నీటిని,ఎస్.ఎల్.బి.సి ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని,లోలేవల్ కెనాల్ ద్వారా 600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నుండి మొత్తం 63,123 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన స్పందన



నవతెలంగాణ-కొండమల్లేపల్లి

మారకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా బుధవారం నల్లగొండ జిల్లాలో నిర్వహించినటువంటి జిల్లా స్థాయి విద్యార్థుల ఉపన్యాస పోటీల్లో కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బొడ్డుపల్లి స్పందన పాల్గొని జిల్లా ప్రథమ బహుమతి పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి ముత్యాలు, పద్మాల కుమార్తె బొడ్డుపల్లి స్పందన తమ పాఠశాలలో పదవ తరగతి చదువుతుందని బుధవారం జిల్లాలో మారకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో మొత్తం 33 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా అందులో తమ పాఠశాల నుండి బొడ్డుపల్లి స్పందన పాల్గొని జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచడం ఎంతో అభినందనీయమన్నారు. నేడు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ విద్యార్థి ప్రశంస పత్రాన్ని అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని స్పందనను పాఠశాల ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, గైడ్ టీచర్స్ కొలిశెట్టి శ్రీధర్, కట్టబోయిన శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జాన్, సరస్వతి, అంజయ్య, యాదయ్య సైదయ్య, బాలాజీ, సైదా, వెంకటయ్య ఆంజనేయులు తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

'వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటు'



నవతెలంగాణ-చిలుకూరు

సుందరి వెంకటయ్య మృతి సీపీఐ(ఎం) పార్టీకి తీరనిలోటు అని ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు గద్దపాటి కిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని మాధవగూడెం గ్రామంలో అనారోగ్యం కారణంగా సుందరి వెంకటయ్య మృతి చెందడంతో ఆయన పార్థివ దేహానికి ఎర్రజెండా కప్పి ఘనమైన నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాదాస్ కోటయ్య రామ పొంగు రామారావు, ఉల్లిందల అంజయ్య, ములకలపల్లి కోటేశ్వరావు, దాసురాజు నాగరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జూనియర్ కళాశాల ప్రారంభం

నవతెలంగాణ-తిరుమలగిరి

మండల ప్రజల దశాబ్దాల కల ప్రభుత్వ జూనియర్ కళాశాలను నేడు (గురువారం) ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను శాసనసభ్యులు మందుల సామెల్ ప్రారంభిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎల్సోజు నరేష్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మునిసిపల్ చైర్మెన్ శాగంటి అనసూయ రాములు, మాజీ మార్కెట్ చైర్మన్ మూల అశోక్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పేరాల వీరేష్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమీలాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకరి జనార్ధన్, మూల రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు బత్తుల శ్రీను, భూత్ ఇంచార్జ్ పత్తేపురం సుధాకర్, గ్రామశాఖ అధ్యక్షులు నాయిని కృష్ణ, ఎల్లంల నాగరాజు, బానోత్ భాస్కర్, మండల కాంగ్రెస్ నాయకులు కిష్ట నాయక్, రవీందర్ నాయక్, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు సాదిఖ్ అలీ, దేవేందర్, రషీద్, సతీష్ పాల్గొన్నారు.

పైసలిస్తేనే.. ఫైల్ కదిలేది !

- కలెక్టరేట్‌లోని ఓ విభాగంలో ఉద్యోగి భాగోతం
- ట్రాన్స్ఫర్స్ అవ్వాలన్నా, బిల్లులు పాస్ కావాలన్నా భారీగా వసూళ్లు
- పైఅధికారి అండదండలతో రెచ్చిపోతున్న వసూల్ రాజా
- ట్రాన్స్ఫర్ అయినా డిప్యుటేషన్ పేరుతో ఆఫీసులోనే తిష్ట



నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

సూర్యాపేట కలెక్టరేట్ రెవెన్యూశాఖ డిపార్ట్మెంట్‌లో పైసలు ఇవ్వనిదే ఫైల్ కదలడం లేదు. ప్రతి పనికి ఒక రేట్ ఫిక్స్ చేసుకొని కాసులు చెల్లించాల్సిందే అని సొంత శాఖలోని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఇటీవల జరిగిన రెవెన్యూ బదిలీలలో భారీగా ముడుపులు తీసుకొని తమకు అనువైన ప్రాంతాలకు ట్రాన్స్ఫర్స్ చేశారు. అంతేకాకుండా బిల్లులు శాంక్షన్ అవ్వాలంటే ఆ ఉద్యోగికి భారీగా చెల్లించాల్సిందే అని కొంతమంది పనులు చేసిన వ్యక్తులు మొర పెట్టుకుంటున్నారు. పైసలు ఇవ్వకుంటే ఫైల్ డిలే చేస్తూ అటు ఉద్యోగులను ఇటు కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయన భాగోతం అంతా తెలిసి ఆయనను తుంగతుర్తి నియోజకవర్గానికి బదిలీ చేసినా.. డిప్యుటేషన్ పేరుతో కలెక్టరేట్‌లోనే తిష్ట వేశారు. మరోపక్క ఆ ఉద్యోగి వెనుక ఓ పెద్ద సారు అండదండలు పుష్కలంగా అండదండలతోనే సదరు ఉద్యోగి భారీగా వసూళ్ల చేస్తున్నారన్న ఆరోపణటూ ఉన్నాయి.

బదిలీల పేరుతో భారీగా వసూళ్లు..

జిల్లాలో ఇటీవల రెవెన్యూ శాఖలో పెద్ద ఎత్తున బదిలీలు చేపట్టారు. వీటిలో జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, ఆఫీస్ సబార్డినేటర్ల వరకు వివిధ మండలాలకు బదిలీలు చేశారు. అయితే కొంతమంది ఉద్యోగులను దూర ప్రాంతాలకు బదిలీ చేయడంతో వారికి అనుకూలమైన ప్రాంతాలకు ట్రాన్స్ఫర్ చేసేందుకు ఒక్కొక్క ఉద్యోగి నుండి రూ.15 వేల నుండి రూ.50వేల వరకు వసూళు చేశారు. పైసలు ఇవ్వని వారికి మాత్రం దూర ప్రాంతాలకు కావాలని బదిలీ చేశారని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. దీని వెనుక పెద్ద సారు అండదండలు ఉండడంతో చేసేది ఏమి లేక అడిగినంత డబ్బులు సమర్పించుకున్నారు.

బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు..

కలెక్టరేట్‌లో చేసిన పనులకు ఏండ్లుగా బిల్లులు ఇవ్వకుండా సదరు ఉద్యోగి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపణలున్నాయి. చేసిన పనులలో ప్రతి బిల్లులో 5 పర్సెంటేజ్ కమీషన్ చెల్లించాలని కాంట్రాక్టర్లకు హుకుం జారీ చేయడంతో పైసలు ఇచ్చుకోలేక కాంట్రాక్టర్లు ఏండ్ల తరబడి కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవ సమయంలో ఆఫీసులకు బోర్డులు చేయించుకొని నేటికి ఆ బిల్లులు ఇవ్వకుండా జఫ్యాన్ చేస్తున్నారు. అంతేకాకుండా ఆఫీసులకు కావాల్సిన ఫర్నిచర్ మొదలు కొని కంప్యూటర్లు, స్టేషనరీ వరకు చెల్లించాల్సిన బిల్లులలో కమిషన్ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

పెండింగ్లో ఇంక్రిమెంట్లు..

రెవెన్యూ ఉద్యోగులకు ఇవ్వాల్సిన 12 సంవత్సరాలు, 6 సంవత్సరాల ఇంక్రిమెంట్లను పెండింగ్‌లో పెట్టి ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వం ఇంక్రిమెంట్లను విడుదల చేసినా.. ఉద్యోగులకు ఇవ్వాలంటే మాత్రం భారీగా డబ్బులు డిమాండ్ చేయడంతో చాలా మండలలోని రెవెన్యూ ఉద్యోగులకు రావాల్సిన ఇంక్రిమెంట్లు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. వారంరోజుల క్రితం ఒక రెవెన్యూ ఉద్యోగికి ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా పెండింగ్ పెట్టడంపై ఆ ఉద్యోగి ఆగ్రహం వ్యక్తం చేస్తూ గొడవకు దిగడం గమనార్హం. బదిలీ అయిన ఉద్యోగిని తిరిగి డిప్యుటేషన్‌పై కలెక్టరేట్‌కి తీసుకురావడం పట్ల ఉద్యోగులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఆ శాఖలోని సదరు ఉద్యోగులను మార్చాలని రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు కోరుతున్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-తుంగతుర్తి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు ఆస్పత్రిలోని గదులను, స్టోర్ రూములను, రోగులకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం మందుల నిల్వ ఉన్న రూములో రికార్డులను పరిశీలించి ఎంత స్టాక్ ఉందో సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉన్నదని తన దృష్టికి వచ్చిందని, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణం ఆగిపోయిన విషయం జిల్లా మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని త్వరలో పరిష్కారం అవుతుందని తెలిపారు. ఆస్పత్రిలో రక్త పరీక్షలకు వచ్చే రోగాల నుండి సేకరించిన నమూనాలను జిల్లా ఆస్పత్రికి వాహనంపై తీసుకు వెళ్లాల్సి ఉండగా ద్విచక్ర వాహనంపై తీసుకు వెళ్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అట్టి విషయంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మల్ కుమార్, తహశీల్దార్ కంటమయ్య, ఎంపీడీవో శేషు కుమార్, ఎంఈవో బోయిని లింగయ్య, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలతో స్నేహభావం కలిగి ఉండాలి

- పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించిన ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



నవతెలంగాణ-అర్వపల్లి

పోలీసులు ప్రజలతో స్నేహభావంను కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో సిఐఎస్ఐలతో ప్రస్తుతం వరకు జరిగిన పలు కేసువివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు సరైన విధంగా స్పందించాలన్నారు. అనంతరం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. ప్రమాదంలో జరిగినప్పుడు అదుపులో తీసుకున్న వాహనాలను పరిశీలించారు. టూ వీలర్ ద్వారా ప్రయాణించే వాహనదారుడు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయవద్దని. అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట సూర్యాపేట డీఎస్పి రవి, నాగారం సీఐ రఘువీర్ రెడ్డి, అర్వపల్లి ఎస్సై సిహెచ్ బాలకృష్ణ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడం అభినందనీయం



ఏఎస్పీ నాగేశ్వరరావు

నవతెలంగాణ-సూర్యాపేట

ప్రజల కోసం స్వచ్ఛమైన శుద్ధిచేసిన తాగు నీళ్లను అందించడం అభినందనియమని ఎఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. సువెన్ ఫార్మా వారు నూతనంగా నిర్మించిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ను బుధవారం స్థానిక 5వ వార్డ్ వస్త్రం తండాలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. తండాలో కలుషిత నీరు బారిన పడకుండా ఉండేందుకు వీలుగా సువెన్ ఫార్మా వారు వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం హర్షదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 6వార్డు కౌన్సిలర్ ధరావత్ నీలాబాయి లింగా నాయక్,ఫార్మా కంపెనీ కి చెందిన మూర్తి, రమేష్ బాబు, వెంకట్ రెడ్డి, సైదులు, బిఆర్ఎస్ నాయకులు ధరావత్ శివరాం నాయక్ , ధరావత్ సైదా నాయక్, తార సింగ్,సేవ్య నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం సేవలు సంతోషకరం

- రాష్ట్ర పబ్లిక్ కమిషన్ డైరెక్టర్ పాల్వాయి రజినీ కుమారి



నవతెలంగాణ-అర్వపల్లి

స్వశక్తితో విద్యార్థుల సౌకర్యార్థం కోసం ఏర్పాటు చేసి సేవలందించడం చాలా సంతోషకరమని అక్షరం ఫౌండేషన్ సభ్యుల సేవలు అభిందనీయమని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ కమిషన్ డైరెక్టర్ పాల్వాయి రజనీ కుమారి అన్నారు. బుదవారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక, అంగన్‌వాడీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు అక్షరాభ్యాసం చేసే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, నవోదయ విద్యా సంస్థలు చైర్మన్ మారం లింగారెడ్డి,రత్నం లక్ష్మాజీ, పాఠశాల కమిటీ చైర్మన్ బొడ్డు స్వప్న,అక్షరం పౌండేషన్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్,వైస్ చైర్మన్ చింత బిక్షం, ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రవీందర్, సభ్యులు లక్ష్మణ్, బొడ్డు సోమరాజు, బొడ్డు రమేష్, జీడి వెంకన్న, బొడ్డు వెంకట్, దాసరి శీను, బొడ్డు అర్జున్, చెరుకుపల్లి గోపి, వడాకాల శ్రీనాథ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-హుజూర్ నగర్

పట్టణంలోని ఎస్ఎస్పి క్యాంప్ హైస్కూల్లో సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు ఎస్ఐ ముత్తయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు మత్తుమందుల వాడకం రోడ్డు సేఫ్టీ బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలు ఆయన విద్యార్థులకు వివరించారు ఉన్నత విద్య దశ విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైంది అన్నారు రాబోయే రోజుల్లో అన్ని పోటీ పరీక్షలకు ఈ విద్య ఎంతగానో ఉపయోగపడతాది అన్నారువిద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ఎటువంటి వక్రమార్గాలు పట్టకుండా తమ చదువును కొనసాగించాలన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీరెల్లి శ్రీనివాసరెడ్డి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్లు తిని నెమలి మృతి !



నవతెలంగాణ-గరిడేపల్లి

మండలంలోని కాచవారిగూడెం గ్రామంలోని పంటపొలాల్లో బుధవారం జాతీయపక్షి నెమలి వడ్లుతిని మృత్యువాతపడిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. పొలంలో చల్లిన వడ్ల గింజలు తిని కొట్టుకుంటుండగా పొలానికి చెందిన రైతు లక్ష్మయ్య చూసి సంబంధిత అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. హుజూర్నగర్ అటవీశాఖ డివిజన్ కార్యాలయం సెక్షన్ అధికారి గోవర్ధన్ వెంటనే కాచవారిగూడెం గ్రామానికి వెళ్లి జాతీయపక్షి నెమలిని స్వాధీనం పరుచుకున్నారు. పొలంలోని విషపూరితమైన వడ్ల గింజలను తినడంతో నడవలేని స్థితికి చేరుకుందని వెంటనే నెమలికి వైద్యం అందించేందుకు ఆసుపత్రికి తీసుకెళు ండగా చనిపోయిందని సెక్షన్ అధికారి గోవర్ధన్ తెలిపారు. మృత్యువాతపడిన నెమలికి గరిడేపల్లి పశువుల ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి దహన సంస్కారాలు నిర్వహించినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించే పత్రిక

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పగిళ్ల అశోక్ రెడ్డి



నవతెలంగాణ-నూతనకల్

ప్రజా సమస్యలపై నిరంతరం స్పంధించే దినపత్రిక నవతెలంగాణ అని, పత్రిక 9వ వార్షికోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పగిళ్ల అశోక్ రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. దినపత్రిక అభివృద్ధి చెంది రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని కోరుకుంటూన్నానన్నారు.

ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక

తహశీల్దార్ కంట్లమయ్య గౌడ్



నవతెలంగాణ-తుంగతుర్తి

ప్రజల పక్షాన ఉంటూ ప్రశ్నించే పత్రిక నవతెలంగాణ దినపత్రిక అని తుంగతుర్తి తహశీల్దార్ కంట్లమయ్య గౌడ్ అన్నారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల శ్రేయస్సును కోరి అన్ని వర్గాల ప్రజలను ఒకే తాటి పైకి తీసుకువచ్చి తేడాలు లేకుండా సమ న్యాయం చేసే పత్రికగా పేరుపొందిందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లో ఆటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారాధిగా ఉంటు నిరంతరం ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొని పరిష్కారంలో ముందుంటున్న పత్రిక అన్నారు. భవిష్యత్లో కూడా ఇలాంటి వార్షకోత్సవాలు జరుపుకోవాలని కోరారు.

9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మాజీ ఎంపీటీసీ పన్నాల రమా మల్లారెడ్డి



నవతెలంగాణ-నూతనకల్

సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై అనునిత్యం ప్రశ్నించే గొంతుక నవతెలంగాణ దినపత్రిక అని మాజీ ఎంపీటీసీ పన్నాల రమ మల్లారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నవతెలంగాణ 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల, కార్మికుల, కర్షకుల సమస్యలపై అనునిత్యం ప్రత్యేక కథనాలు రాస్తూ రైతులు కార్మికుల పక్షాన నవ తెలంగాణ దినపత్రిక పనిచేస్తుందన్నారు.

21 నుంచి వ్యకాస జిల్లాస్థాయి శిక్షణా తరగతులు

నవతెలంగాణ-చిలుకూరు

ఈనెల 21 మరియు 22 తేదీలలో రెండు రోజులు మోతె మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డులోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్లో వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా స్థాయి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నారసాని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. చిలుకూరు మండల వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. ఆయన వెంట వ్యకాస మండల అధ్యక్షులు పిల్లి వీరమల్లు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాగాటి రాములు, బత్తిని వెంకటయ్య అమెరబోయిన కృష్ణ లింగయ్య గట్టు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి పథకం ద్వారా రూ.16 వేలు సాయం



నవతెలంగాణ హుజూర్ నగర్

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన పేద విద్యార్థులకు బుధవారం కెనరా బ్యాంక్ మేనేజర్ బాలాజీ నాయక్ విద్యాజ్యోతి పథకం ద్వారా రూ.16 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయవాని మాట్లాడుతూ కెనరా బ్యాంకు వారు తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాతరాజు శ్రీనివాస్ మాతంగి ప్రభాకర్ బయ్యారపు శ్రీదేవి ప్రసాద్ విజయలక్ష్మి శైలజ జనార్దన్ రెడ్డి ఆస్మా మోబిన్ పాల్గొన్నారు.

స్థానిక నిరుద్యోగులకే అవకాశం కల్పించాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరిలో 34 సంవత్సరాల జూనియర్ కళాశాల కళ నెరవేర్చిన తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలుకు తిరుమలగిరి ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ కొన్ని సంవత్సరాలుగా తిరుమలగిరి మండల కేంద్రంలో ఉన్న ప్రైవేటు డిగ్రీ మరియు ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలో పనిచేయుచున్న ఈ ప్రాంత నిరుద్యోగులైన ప్రయివేటు లెక్చరర్స్‌కి అతిథి అధ్యాపకులుగా బోధన సౌకర్యం కల్పించగలరని కోరుతూ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గాదరబోయిన లింగయ్య, నెల్లుట్ల రాజు, సంగెపాక ప్రభాకర్, తీగుళ్ల శ్రీనివాస్, శిగ వీరన్న, కిరణ్, అశోక్, వెంకన్న, సైదులు, తదితర ప్రైవేట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందక ఇబ్బందులు

- రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి
- కాలువ వద్ద నిరసన తెలిపిన రైతులు, నాయకులు



నవతెలంగాణ-హుజూర్‌నగర్‌టౌన్

మండలంలోని లింగగిరి మేజర్ కాలువ ద్వారా చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. బుధవారం రైతులతో కలిసి మేజర్ కాలువలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగర్ మేజర్ 9 కిలోమీటర్ల పరిధిలో ఆరువేల ఎకరాల పైన సాగునీరు అందించాల్సి ఉందని, హుజూర్ నగర్ పట్టణ ప్రాంతంలో మూడు కిలోమీటర్ల మేర కాల్వలో చెత్తాచెదారం రాళ్ల నిండుకొని ఉండడంతో కనీసం 6 కిలోమీటర్ల వరకు కూడా నీరురాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే రైతులు రూ.30 వేల పైన పెట్టుబడి పెట్టి కొంతవరకు కాల్వ బాగు చేసుకున్నారని, ఇంకా రెండు కిలోమీటర్ల మేర కాల్వ బాగు చేయాల్సి ఉందన్నారు. ఈవిషయాన్నీ డిఈకి తెలుపగా నిర్లక్ష్యమైన సమాధానం చెప్పారన్నారు. రైతుల పట్ల అధికారి వైఖరి సరైనది కాదన్నారు.ఈవిషయంలో స్పందించిన ఏ ఈ శ్రీనివాస్ నిరసన తెలియజేస్తున్న రైతుల వద్దకు వచ్చి,రెండు రోజుల్లో కాలువ మరమ్మతులు పూర్తి చేయించి చివరి భూములకు సాగునీరు అందించే విధంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పాశం వీరబాబు,రేపాకుల మురళి,ప్రజాసంఘాల నాయకులు వట్టెపు సైదులు, పోసనబోయిన హుస్సేన్, శీలం శ్రీను, జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం వెంకటనారాయణ,రేపాక వీరస్వామి, పంగా వెంకట్, రైతులు చింతల నరసింహారావు ,లొడంగి ఎల్లయ్య ,తగర్ల నరసింహరావు, కడాల వెంకన్న బాబు,కాటావుల గోపి, చింతల రామకృష్ణ,జాల సోమరాజు బండారు సైదులు తదితరులు ఉన్నారు.

స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



నవతెలంగాణ-సూర్యాపేట

నేడు జరుగనున్న భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. బుధవారం స్థానిక ఇందిరమ్మ కాలనీ వద్ద గల పెరడ్ గ్రౌండ్ లో 78వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను ఎఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. స్వాతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి హాజరై జాతీయ జెండా ఆవిష్కరణ చేసి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, త్రాగునీరు తదితర సౌకర్యాలు వివిధ శాఖల అభివృద్ధిపై ఫోటో ఎగ్జిబిషన్, విద్యార్థులచే సంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖలు ఏర్పాటు చేస్తున్న స్టాల్స్ కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వేణుమాధవ్, తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, జెడ్పి సీఈవో అప్పారావు, డీఎస్ఓ మోహన్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఆర్ ఐ శ్రీధర్, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని 10వ తరగతి విద్యార్థి మృతి

నవతెలంగాణ-కోదాడరూరల్

10వ తరగతి చదువుతున్న విద్యార్థి ఉరేసుకుని మృతి చెందిన సంఘటన పట్టణంలో బుధవారం కలకలం రేగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన సాయిలి హర్షవర్ధన్ పట్టణంలోని శ్రీ చైతన్య స్టార్‌కిడ్స్ బ్రాంచ్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. కాగా పట్టణంలో కిరాయికి ఉంటూ రోజు పాఠశాలకు వచ్చేవాడు. మంగళవారం పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ కోసం హర్షవర్ధన్ తల్లిని మీటింగ్‌కు రమ్మని పాఠశాల సిబ్బంది తెలిపారు. కాగా మంగళవారం ఉదయం పూట పాఠశాలకు వచ్చిన హర్షవర్ధన్ మధ్యాహ్నం సమయంలో భోజనం కోసం కిరాయి ఇంటికి వెళ్ళాడు. హర్షవర్ధన్ తల్లి బజార్‌కి వెళ్ళిన అనంతరం ఒక్కడే ఉన్న హర్షవర్ధన్(15) ఇంట్లో ఉరేసుకొని మృతి చెందాడని. విషయం కుటుంబ సభ్యులకు తెలపగానే పాఠశాలకు సమాచారం అందజేశారు. అనంతరం మృతుడు హర్షవర్ధన్‌ని స్వగ్రామమైన బేతవోలు గ్రామానికి తీసుకొని వెళ్లారు. బాలుని మృతికి గల కారణాలు తెలియరాలేదు. పాఠశాలలో చదువులో ముందుంటాడని పలువురు తెలుపుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కోదాడరూరల్

మండల పరిధిలోని నల్లబండగూడెం గ్రామంలో సాయిబాబా దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ జన్మదిన వేడుకలు మాజీ ఎంపీపీ చింతా కవిత రాధారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో మొక్కలు నాటారు. పట్టణంలో రంగా థియేటర్ చౌరస్తా లో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణ, యూత్ అధ్యక్షుడు ఇమ్రాన్,మాజీ పిఎసిఎస్ చైర్మన్ ముత్తవరపు రమేష్ ,కొల్లూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్వైజర్‌గా కందుకూరి మంగ

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మండల ఐసీడీఎస్ సూపర్వైజర్ గా కందుకూరి మంగమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అంగన్వాడి సూపర్వైజర్ గా అడ్డగూడూరు ,మోత్కూరు మండలాల్లో దీర్ఘకాలికంగా పనిచేసి ఆ ప్రాంతంలో అంగన్వాడి విద్యను పటిష్టం చేయడం లో కీలకపాత్ర పోషించారు. కొంతకాలంగా అక్కడ పనిచేసి అంగన్వాడీ సిబ్బందితోపాటు అధికారుల మన్నలను పొందారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా అంగన్వాడి పాఠశాలను సందర్శిస్తూ ప్రభుత్వం నుంచి అందే పోషకాలు వస్తువులు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకున్నారు. అంగన్వాడి టీచర్ గా మొదలైన ప్రస్థానం సూపర్వైజర్ గా నియామకమై ఎంతో కృషి చేశారు. నేడు తిరుమలగిరి మండలం సూపర్వైజర్ గా నియామకం కావడంతో అంగన్వాడి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పాస్టర్లంతా ఐక్యంగా ఉండాలి

- జిల్లా పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లాలోని పాస్టర్లంతా ఐక్యంగా ఉండి క్రీస్తుసంఘ అభివృద్ధికి పాటుపడాలని నూతన కమిటీ పిలుపునిచ్చింది. జిల్లా పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ చైర్మన్ రెవరెండ్ మామిడి సామ్సన్, ఎన్నికల కమిటీ చైర్మన్ డాక్టర్ సాయిని జాకబ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక క్రీస్తు సంఘం చర్చిలో ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షులుగా బ్రదర్ మీసాల ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రెవరెండ్ డాక్టర్ కాసర్ల శ్యాంసుందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా రెవరెండ్ కొత్తపల్లి అంద్రెయ్య, ప్రధాన కార్యదర్శిగా రెవరెండ్ పి ప్రసన్నకుమార్, సహాయ కార్యదర్శిగా బ్రదర్ మీసాల జ్యోతి బాబు, కోశాధికారిగా రెవరెండ్ పుల్లూరి దానియేల్, రెవరెండ్ గుంటూరు బాబురావు అధ్యక్షతన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పి మరియన్న, పి సజీవ, యు మత్తయ్య, పి కొర్నెల్ పాల్, నిర్మల్ బాబు, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
గురువారం | ఆగస్టు 15, 2024 | www.navatelangana.com

నేడు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రాక

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య ఆలేరు పట్టణానికి రానున్నారు.15 ఆగస్టు సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉదయం 7 గంటలకు , కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఏడున్నర గంటలకు జాతీయజెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం జనగామ జిల్లా కేంద్రంలో ధర్మకంచ వద్ద జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగుర వేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని గౌరవ వందనం స్వీకరించనున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

నవతెలంగాణ-భువనగిరి

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర వేడుకల సందర్భంగా ఏర్పాట్లు వేగవంతంగా చేస్తున్నారు. పోలీసు, ఎన్సీసీ, స్కాట్ పరేడ్‌తో పాటు కవాత్ చేయనున్నారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖలు తమ శకటాలను ప్రదర్శించనున్నారు.విద్యార్థులు పరేడ్‌లో పాల్గొనవడమే కాకుండాపలు సాంస్కృతికకార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రత్యేకమైన వేదికతోపాటు ప్రేక్షకులకు, కుర్చీలు, బారికేడ్లు ఏర్పాట్లు చేశారు.స్వాతంత్ర్య సమరయోధుల చిత్రప్రదర్శన, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తెలుగు సమరయోధుల చిత్రప్రదర్శనను ఆగస్టు 14,15వ తేదీలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట విప్లవకారుల చిత్రప్రదర్శన ఏర్పాటు చేస్తే బాగుండేదని పలువురు పేర్కొన్నారు.



మోదుగుంపల్లి చెక్‌డ్యామ్ వద్ద అక్రమగండిని పూడ్చాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

బునాదిగాని కాలువ పరిధిలోని మోదుగుంపల్లి దగ్గర ఉన్న చెక్ డ్యామ్‌కు అక్రమంగా పెట్టిన గండిని పూడ్చి, కాలువలో ఉన్న గుర్రపు డెక్కపు ఆకును తొలగించి, కాలువ సాపు చేసి నమాత్ పల్లి, నందనం, ఎర్రంబపల్లి చెరువులను నింపి రైతాంగానికి సాగునీరు అందించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు డిమాండ్ చేశారు.బుధవారం ఆ పార్టీ నమాత్ పల్లి, అనాజిపురం గ్రామ శాఖల ఆధ్వర్యంలో బునాదిగానికాలువను మోదుగుంపల్లి కత్వ దగ్గర నాయకత్వం కలిసి పరిశీలన చేసిన అనంతరం మాట్లాడారు.ఆనాడు కాలువను సాధించడానికి అనేకమంది రైతులు పార్టీ నాయకత్వంలో పోరాడి బునాదిగాని కాలువను సాధించుకున్నారని, నేడు పాలకులు కాలువ మరమ్మతులు సరిగా చేయకపోవడంతో చెత్తాచెదారంతో కాలువ నిండిందన్నారు.గుర్రపు డెక్క ఆకు నీటికీ అడ్డంగా ఉన్నదని అన్నారు. మరో పక్క మోదుగుంపల్లి దగ్గర అక్రమంగా చెక్‌డ్యాముకు గండి పెట్టడంతో నీరంతా వృథాగా చిన్నేరు వాగులోకి పోతుందన్నారు.దీంతో అనాజీపురం చెరువు నుండి కింది గ్రామాలైన నందనం, నమాత్‌పల్లి, ఎర్రంబల్లి, పైల్వాన్‌పురం చెరువులోకి నీళ్ల కాలువ వెంట పోయే పరిస్థితి లేదన్నారు.తద్వారా రైతులు నాటుపెట్టిన వరి చేల్లన్ని ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు , స్థానిక శాసనసభ్యులు పట్టించుకోని కాల్వను సాపు చేయాలని, అక్రమగండిని పూడ్చాలని, కింది ప్రాంత గ్రామాలకు సంబంధించిన చెరువులు నింపి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, నమాత్‌పల్లి శాఖ కార్యదర్శి జిట్టాఅంజిరెడ్డి, నాయకులు సురుపంగ ప్రకాష్, తోటకూరి మల్లేశం, అయితరాజు కిష్టయ్య, భీమనబోయిన ముత్యం ప్రకాష్ పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ హనుమంత్ కే.జెండగే

నవతెలంగాణ-ఆలేరుటౌన్

సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ హనుమంత్ కే.జెండగే అన్నారు.నియోజకవర్గ కేంద్రంలో బుధవారం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.హాజరు పట్టిక, వైద్య పరికరాలు, మందుల వివరాలు, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను తనిఖీ చేసి పరిశీలించారు.వర్షం కాలం కారణముగా, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున, వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. అవసరమైన ఔషధాలు,ల్యాబ్ పరికరాలు ప్రత్యేకంగా డెంగ్యూ, మలేరియా కిట్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సిబ్బంది కచ్చితంగా సమయ పాలన పాటించాలని ఆదేశించారు.ఆస్పత్రికి రోజులో ఓపీ విభాగంలో 270 నుండి 340, ఇన్పేషెంట్ విభాగంలో 25 నుండి 35 రోగులకు వైద్యసేవలందుతున్న విషయాన్ని వైద్యులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.గత నెలలో (జూలై -2024) 6500 మంది రోగులు ఓపీ విభాగంలో వైద్య సేవలు పొందారన్నారు. ఇన్పేషెంట్ విభాగంలో 1100 మంది రోగులు వైద్య సేవలు పొందారని తెలియజేశారు. గర్భిణులకు అన్ని రకాల వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు.గతంలో కంటే ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య సేవలు మెరుగయ్యాయన్నారు. ప్రసవాలు పెరిగాయని,వైద్య సేవలందించడానికి తగిన సిబ్బంది అందుబాటులో ఉన్నారని, సామాజిక ఆరోగ్య కేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ జె.స్వప్నరాథోడ్ కలెక్టర్‌కు వివరించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు,ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుర్తుతెలియని లింకులు ఓపెన్ చేయొద్దు

- భువనగిరి రూరల్ ఎస్సై వి.సంతోష్‌కుమార్

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి మండలంలోని బండసోమవారం గ్రామానికి చెందిన కొల్తురి బాలరాజు ఆన్లైన్లో పార్ట్ టైం జాబ్ ద్వారా టాస్కులు చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని గుర్తుతెలియని వ్యక్తులు లింకు వంపించగా అ లింక్‌ను ఓపెన్ చేసి రూ.40వేలు పోగొట్టుకున్నాడు.రాయగిరి గ్రామానికి చెందిన శనిగల నర్సింగరావు గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా లోన్ యాప్ మెసేజ్ పెట్టగా, ఆ లింక్ ఓపెన్ చేయగా అతని ఖాతా నుంచి 36 వేల రూపాయలు పోగొట్టుకున్నాడు. ఇద్దరు వ్యక్తులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఐటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్సై వి.సంతోష్‌కుమార్ తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని లింకులు ఓపెన్ చేసి ఆన్లైన్లో టాస్కులు చేస్తే డబ్బులు వస్తాయని గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మి డబ్బులు పోగొట్టుకున్నాడన్నారు.మీ ఫోన్‌లోకి వచ్చిన ఆన్లైన్ ద్వారా వచ్చిన లింకులను తెలియని వాటిని ఓపెన్ చేసి డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు.ఒకవేళ డబ్బులు పోయినచో 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.



వికలాంగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్

వికలాంగులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.బుధవారం చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని జయశ్రీ ఫంక్షన్‌హాల్‌లో సీనియర్ డిజిబులిటీ వెల్ఫేర్ సొసైటీ యాదాద్రి జిల్లా ఆధ్వర్యంలో కర్నాటి స్వప్న-అనిల్ దంపతుల కుమారుడు ఐశాన్ రాజా సహకారంతో ఏర్పాటుచేసిన నిత్యావసర వస్తువులను ఏసీపీ వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 50 మంది కండర క్షీణత, వెన్నెముక తీవ్ర వైకల్యం కలిగిన బాధితులకు ఒక్కొక్కరికి రూ.2వేల విలువైన నిత్యావసరాలు ఏర్పాటు చేసిన సొసైటీ అధ్యక్షులు కత్తుల బాలకృష్ణను అభినందించారు.వికలాంగులకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. తన వంతు సహకారం వచ్చే నెలలో అందజేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిలివేరు శ్రీను, వికలాంగులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వికలాంగుల ర్యాలీ

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం నుండి జాతీయ రహదారిపై బుధవారం వికలాంగులు 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వీల్ చైర్లలో కూర్చొని జాతీయ జెండాలు, బెలూన్లు చేతబూని తంగడపల్లి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, ఎర్ర వీరయ్య, బద్రి శంకర్, స్వామి, మహేశ్, వికలాంగులు పాల్గొన్నారు.

12వ వార్డులో విద్యుత్ సమస్య పరిష్కారం

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట మున్సిపాలిటీ 12వ వార్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను కౌన్సిలర్ బబ్బూరి మౌనిక శ్రీధర్‌గౌడ్, యాదగిరిగుట్ట విద్యుత్ శాఖ ఏఈ సురేంద్రనాయుడు దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరి ంచారు. ప్రమాద కరంగా ఉన్న విద్యుత్ లైన్లను ఏఈ సురేంద్ర నాయుడు త్వరితగతిన స్పందించి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరి ంచారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు, కౌన్సిలర్ బబ్బూరి మౌనిక శ్రీధర్‌గౌడ్, యాదగిరిగుట్ట విద్యుత్‌శాఖ ఏఈ సురేంద్ర నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.



బీర్ల శంకర్ ప్రత్యేక శ్రద్ధతో కాంగ్రెస్‌కు బలం చేకూరేన?

నవతెలంగాణ-రాజపేట

తన మార్కు రాజకీయాలతో మండలంలో ప్రత్యేకపట్టు సాధిస్తున్న బీర్ల ఫౌండేషన్ కో ఫౌండర్ శంకర్,మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామ తాజా మాజీ సర్పంచ్, బీర్ల ఫౌండేషన్ కో ఫౌండర్ బీర్ల శంకర్ అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచి రాజపేట మండలంలో తన మార్కు రాజకీయాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని అన్ని పార్టీల లో మెప్పు పొందే నాయకునిగా కొనసాగేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు. రాజపేట మండలంలో అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి తన సోదరుడైన బీర్ల ఐలయ్యకు భారీ మెజార్టీ వచ్చేందుకు ఎనలేని కృషిచేసి సక్సెస్ అయ్యారు.రాజకీయంగా రాజపేట మండలంపై పట్టును మరింత సాధించేందుకు అనేక సేవా కార్యక్రమాలను మొదలుపెట్టారు. ఎన్నికల ముందు సమయంలో ప్రచారంలో ఇచ్చిన హామీల విషయంలో కలిసిన నాయకులకు ప్రజలకు ఇచ్చిన కమిట్మెంట్ కోసం తన వంతు బాధ్యతను బీర్ల శంకర్ నెరవేరుస్తూ వస్తున్నారు. రాజపేట మండలం నరసాపురం గ్రామం తన భార్య సొంత గ్రామం కావడంతోపాటు, పాఠశాల స్థాయిలో విద్యాభ్యాసం రఘునాథపురం గ్రామంలో కొనసాగించడం, ఇలా మరికొన్ని అంశాలలో రాజపేట మండలంలోని అనేక గ్రామాలతో ప్రజలతో నాయకులతో వర్తక వ్యాపారులతో బంధం పెనవేసుకో పోవడంతో బీర్ల శంకర్ ప్రజలకు ఓటర్లకు అతి సులువుగా దగ్గర కానున్నాడు. ఈ సందర్భంగా రఘునాథపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అవేర్నెస్ కార్యక్రమంలో బీర్ల ఫౌండేషన్ కోఫౌండర్ బీర్ల శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి మంచి వాతావరణంలో విద్యను అభ్యసించాలని ఉన్నత స్థాయి చేరుకోవాలని అదేవిధంగా క్రీడల పట్ల ఎంతో శ్రద్ధగా ఉండాలని యాంటీ సైబర్ క్రైమ్ విషయంలో జాగ్రత్త వహించాలని పిల్లలకు దిశా నిర్దేశం ఇచ్చారు. తాను చదువుకునే రోజుల్లో రఘునాథపురం గ్రామంలో ట్యూషన్ కోసం సైకిల్‌పై వచ్చి సంధిల జనార్దన్, గుత్తికొండ అమరలింగం గురువుల వద్దకు వచ్చినట్లు గుర్తుచేస్తూ రఘునాథపురం గ్రామానికి అన్ని విధాలుగా సహాయసహకారాలు వుంటాయని హామీ ఇచ్చారు. గ్రామాల్లోని సీసీకెమెరాలు పనిచేయకుండా నిరుపయోగంగా ఉన్నవాటిని వైర్‌లెస్ విధానం తో పునప్రారంభం చేయుటకు తను సహకరిస్తున్నానని తెలిపారు.పాఠశాలలో విద్యార్థులకు 15 ఆగస్టు సందర్భంగా క్రీడల బహుమతులు తనవంతుగా ఇవ్వనున్నట్టు తెలిపారు.వీటన్నింటితో పాటు ప్రతి సంవత్సరం ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ ర్యాంకు పొందిన విద్యార్థులకు, పేద విద్యార్థులకు మల్లికార్జున ఇన్ ఫ్రా డెవలపర్స్ నుండి ఎండి బీర్ల శంకర్, డైరెక్టర్లు గజ్వేల్ ప్రవీణ్‌కుమార్, చింతపండు శ్రీనివాస్, నాగుశ్రీధర్ రావులు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని బీర్ల శంకర్ హామీ ఇచ్చారు. వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు బల్లయదేశ్, గ్రామ తాజా మాజీ ఎంపీటీసీ బుడిగే రేణుక పెంటయ్యగౌడ్‌ఇతర గ్రామ పెద్దలు బీర్ల శంకర్‌ను చేనేత శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.



భద్రావతి అమ్మవారి బోనాల పండుగకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామంలో ఈనెల 19న రాఖీ పౌర్ణమి సందర్భంగా గ్రామంలో నిర్వహించే శ్రీ భద్రావతి అమ్మవారి బోనాల మహోత్సవానికి ఎమ్మెల్యే వేముల వీరేశంకు ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించినట్లు బావనారుషి పద్మశాలి సంఘం అధ్యక్షులు కొంగరి జానయ్య, రాష్ట్ర సీనియర్ నాయకులు పున్న రమేష్ బుధవారం తెలిపారు. బోనాల మహోత్సవానికి తప్పకుండా హాజరవుతున్నట్లు ఆయన హామీ ఇచ్చారని, ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మలనాగేశ్వరరావు కూడా హాజరవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు ఐటిపాముల పెద్దులు, తాటిభిక్షపతి, గంజినర్సింహ, మిర్యాల శంకరయ్య, కార్యదర్శి అంకంమురళి, ఉపాధ్యక్షులు పున్నదామోదర్, రవ్వ సత్యనారాయణ, డైరెక్టర్ గంజి లక్ష్మయ్య, మిర్యాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



బొల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్యమేళా

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి మండలం బొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెల్త్‌మేళా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శిల్పిని మాట్లా డారు. స్పెషలిస్ట్ సేవల లభ్యత గైనకాలజిస్ట్, పీడియాట్రిషియన్, సర్జన్, అనస్థటిస్ట్, ఐ స్పెషలిస్ట్, ఈఎన్‌టీ, స్క్రీనింగ్ చికిత్స, జనాభా గణన, కమ్యూనిటీ బేస్డ్ అసెస్‌మెంట్ చెక్‌లిస్ట్ , ఆశాల ఎన్సీడిల స్క్రీనింగ్, చికిత్స, సికిల్ సెల్ స్క్రీనింగ్ చికిత్సలు అందించారు. యోగా, వ్యక్తిగత పరిశుభ్రత (ఋతు పరిశుభ్రతతో సహా), ఆహార వైవిధ్యం, పోషకాహారం (రక్తహీనతతో సహా), పదార్థ దుర్వినియోగం: పొగాకు, ఆల్కహాల్ , డ్రగ్స్, మానసికఆరోగ్యం సేవలపై ఆరోగ్యవిద్య అందించారు.అర్హులైన లబ్దిదారులకు సేవలు అందుతాయని తెలిపారు. ఆయుష్మాన్ కార్డులు, హెల్త్ గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ యామిని,సీహెచ్ఓ రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ విజయ,స్థానిక హెల్త్ అసిస్టెంట్లు వినోద,భాగ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



రేణికుంటలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం

నవతెలంగాణ-రాజపేట

భారత ప్రధాని నరేంద్రమోది పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం బుధవారం రేణికుంట గ్రామంలో మహనీయులను స్మరించుకుంటూ స్వాతంత్ర్య సమరయోధుడు చింతలపురి రాంరెడ్డి విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు.రేణికుంట బీజేవైఎం గ్రామశాఖ అధ్యక్షులు రేగొండమధు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.గ్రామ మాజీ ఉపసర్పంచ్ బూర్గు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఇంటిపైన జాతీయజెండాను ఆవిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భువనగిరికలెక్టరేట్ : మండలంలోని తుక్కాపురం గ్రామంలో హర్‌ఘర్ తిరంగ యాత్రను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద మహేందర్ గుప్తా, హర్ ఘర్ తిరంగా జిల్లా కోకన్వీనర్ పాదరాజు ఉమాశంకర్, బీజేపీ భువనగిరి మండల శాఖ అధ్యక్షులు చీర్క సురేష్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి నాగు వినోద్‌కుమార్, సీనియర్ నాయకులు వడ్డెబోయిన వెంకటేశం, మండల ఉపాధ్యక్షులు బబ్బురి సురేష్‌గౌడ్,కంటంకిషోర్, కార్యదర్శులు చిలువేరు మహేష్, తోటకూరి వెంకటేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు పడమటి మాణిక్యంరెడ్డి, ఓబీసీ మోర్చ మండల అధ్యక్షుడు గునుగుంట్ల నగేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు సాధినేనిఉపేందర్, బూత్ అధ్యక్షులు ఎలకొండ రాజశేఖర్‌రెడ్డి, రత్నపురం శ్రీకాంత్, నాయకులు వల్లపు సతీష్, ఎలకొండ సుధాకర్‌రెడ్డి, ఏషబోయిన శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.



భువనగిరిలో...

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సన్మానం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆలియాస్ చింతపండు నవీన్‌కుమార్‌ను ఆలేరు మండలం శర్బనాపురం గ్రామానికి చెందిన, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు బుగ్గ నవీన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు.



16న గొంగిడి సునీత పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-రాజపేట

ఈనెల 16వ తేదీన ఆలేరు మాజీ శాసన సభ్యురాలు గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ మండలఅధ్యక్షులు సట్టు తిరుమలేష్, సెక్రటరీ జనరల్ సంధిల భాస్కర్‌గౌడ్ తెలిపారు.బుధవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిపి మీడియా సమావేశం రాజపేటలో నిర్వహించారు.రాజాపేటమండలంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు అందరూ రాజాపేట గాంధీ చౌరస్తాలో జరిగే పుట్టినరోజు వేడుకల్లో పెద్దఎత్తున తరలిరావాలి పిలుపునిచారు.



అంతిమయాత్రలో పాల్గొన్న బండ్రు శోభారాణి

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన బల్ల దేవదాస్ మృతి చెందగా బుధవారం సాయంత్రం మృతదేహానికి తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

సీసీఎల్ఏ కార్యాలయానికి లేఖ రాసిన బీసీనేత జూకంటి ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-రాజపేట

తెలంగాణ రాష్ట్రంలో ధరణి సమస్యల పరిష్కారం కోసం భూ చట్టాల న్యాయ నిపుణులతో కమిటీ ఏర్పాటుచేసి దేశంలోని 18 రాష్ట్రాల్లో అమలవుతున్న ఆర్‌ఓఆర్ చట్టాలను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్‌ఓఆర్ 2024 ముసాయిదా చట్టం తీసుకువచ్చి ఆగస్టు 2 నుండి 23వ తేదీ వరకు ప్రజాభిప్రాయ సేకరణకు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ పలు సూచనలు చేస్తూ బుధవారం సీసీఎల్ఏ కమిషనర్ కార్యాలయానికి మెయిల్ ద్వారా లేక పంపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో జమాబందీ నిర్వహణ లేకపోవడం మూలంగా భూ రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు.జమాబందీనిర్వహణకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ధరణికి ఎక్కన్నటువంటి భూములను నూతన ఆర్‌ఓ ఆర్ చట్టంలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన ఆర్ ఆర్ ముసాయిదాచట్టంపై జిల్లాల వారీగా అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు.



యాదాద్రి యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-భువనగిరి అర్బన్

పట్టణకేంద్రంలో బుధవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం వస్తువుల అభిలాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా ప్రాముఖ్యత పొందిన యాదాద్రి పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ యూనివర్సిటీ మాదిరిగానే పేద మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి దేవస్థానం నిధులతో అన్ని వసతులు, కోర్సులతో కూడిన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగేల వెంకటేష్, జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్, జిల్లా సమితి సభ్యులు మారపాక లోకేశ్వర్, ఆర్.చందు, రామ్‌చరణ్, సాయిచరణ్, పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ బాలలింగయ్యకు నివాళు లర్పించిన ప్రభుత్వ విప్

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలం సింగారం గ్రామ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంపుబాలలింగయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు.కాగా ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బాల లింగయ్య మృతదేహానికి పూల మాలలేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
గురువారం | ఆగస్టు 15, 2024 | www.navatelangana.com

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

నవతెలంగాణ-వేములపల్లి



కేరళ రాష్ట్రంలోని వయనాడు వరద బాధితుల కోసం మండల కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బుధవారం విరాళాల సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రొండి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధన, రైతు సంఘం జిల్లా నాయకులు పాల్వాయి రామ్ రెడ్డి, సిపిఎం పార్టీ మండల నాయకులు వడ్డే గాని సైదులు, విష్ణుమూర్తి, కోడి రెక్క వెంకన్న, సైదులు, సతీష్ ,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ

నవతెలంగాణ-తిరుమలగిరి



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం తిరుమలగిరి హైస్కూల్‌లో మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించినట్టు ప్రధానోపాధ్యాయులు దామెర శ్రీనివాస్ తెలిపారు. నేటి యువత మాదకద్రవ్యాలు బారిన పడకుండా సరైన మార్గంలో ఉండాలని వారికి సూచించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ కందుకూరి మంగమ్మ మాట్లాడుతూ.. విద్యార్థులందరు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ టీచర్లు సూపర్ వైజర్లు కే. మంగమ్మ, కైరునిషా పాల్గొన్నారు. అనంతరం తొండ గ్రామ అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మంజుల, అశ్విని పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రామచంద్రం మృతికి సంతాపం

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, వట్టిమర్తి మాజీ సర్పంచ్ రాచమల్ల రామచంద్రం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని హాస్పిటల్లో మరణించారని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య, డి మల్లేశం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాశం, కందాల ప్రమీల, బండ శ్రీశైలం, సిహెచ్ లక్ష్మీనారాయణ, కె నాగిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన మృతికి సంతాపం, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. వట్టిమర్తి గ్రామ సర్పంచ్‌గా సుమారు రెండు దశాబ్దాల పాటు పనిచేశారని, 1994-97 మధ్యకాలంలో చిట్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ పనిచేశారని గుర్తు చేశారు. పార్టీలో వట్టిమర్తి గ్రామ పార్టీ సభ్యునిగా జీవితం ప్రారంభమై జిల్లా కమిటీ సభ్యులుగా పని చేశారు. నార్కెట్‌పల్లి మండల బాధ్యుడిగా, మండల కార్యదర్శిగా, నల్లగొండ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులుగా, చౌటుప్పల్‌లో జరిగిన జిల్లా మహాసభలు జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికైనారని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ డివిజన్ అధ్యక్షులుగా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా సుదీర్ఘకాలం పని చేశారని పేర్కొన్నారు. నాటి నకిరేకల్ శాసనసభ్యులు నర్రా రాఘవరెడ్డి, నల్లగొండ శాసనసభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. అలాగే అనేక గ్రామాల్లో అసైన్ భూములకు పట్టాలు ఇప్పించిన ఘనత కూడా వీరికి దక్కిందన్నారు. కాంగ్రెస్ ఎమర్జెన్సీ కాలంలో కూడా జైలుకు వెళ్లారని చెప్పారు. ఆయన జీవితమంతా ప్రజల కోసమే, ఆయన తుదిశ్వాస శ్వాస విడిచే వరకు ఎర్రజెండా వెనకాలే ఉన్నారని అన్నారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన అంత్యక్రియలు వట్టిమర్తి గ్రామంలో నేడు జరుగుతాయని తెలిపారు.

రామచంద్రం మృతి పార్టీకి తీరని లోటు

చిట్యాల : సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, వట్టిమర్తి మాజీ సర్పంచ్ రాచమల్ల రామచంద్రం బుధవారం మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామ్రేడ్ నర్రా రాఘవరెడ్డి వట్టిమర్తి గ్రామానికి మొదటి సర్పంచ్ కాగా, అనంతరం రామచంద్రం సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. 28ఏండ్లు సుధీర్ఘ కాలం సర్పంచ్‌గా సేవలందించారని పేర్కొన్నారు. జీతగాళ్ళ సంఘం లో కీలక పాత్ర పోషించిన రామచంద్రం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా, ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులుగా పని చేశారని తెలిపారు. రామచంద్రం అంత్యక్రియలు గురువారం వట్టిమర్తి గ్రామంలో జరుగుతాయని, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు హాజరవుతారని తెలిపారు. వారి మరణం పట్ల ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు

కేరళ వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం

నవతెలంగాణ-చండూరు



కేరళ రాష్ట్రంలో సంభవించిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, స్పెషల్ ప్యాకేజీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండశ్రీశైలం డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రంలోని వయనాడ్ లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా కొండ చరియలు విరిగిపడ్డ ఘటనలో వందలాది మంది ప్రజలు మృత్యువాత పడ్డారని, వేలాదిమంది నిరాశ్రయులు అయినా బాధితులకు అండగా నిలవాలని సీపీఐ(ఎం) గట్టుప్పల మండల కమిటీ ఆధ్వర్యంలో బాధితులకు నిధి సేకరణ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులుకర్నాటి మల్లేశం, చాపల మారయ్య, సీపీఐ(ఎం) చండూరుమండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయగౌడ్, గట్టుపల మండల నాయకులుపెద్దగాని నరసింహ, కర్నాటి తుకారం,కర్నాటి యాదగిరి, బుచ్చిరెడ్డి, పసుపుల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన జాబ్ మేళా

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మినీ జాబ్ మేళా విజయవంతంగా పూర్తయింది. ఈ జాబ్ మేళలో ఐదు ప్రముఖ కంపెనీలు హాజరు కాగా మొత్తం 117 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో 56 మంది ప్రాథమిక ఎంపిక కాగా కేవల్ గ్రూప్-9, అనపూర్ణ ఫైనాన్స్ లిమిటెడ్ -2, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంక్-3, వెస్టీజ్ 8 సంస్థలలో మొత్తం 22 మంది ఉద్యోగం సాదించారు. ఉద్యోగం పొందిన వారికి ఉపాధి కల్పన కార్యాలయం జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సామ మాధవరెడ్డి నియామక పత్రాలను అందజేసారు.

పర్యావరణంపై అవగాహన అభినందనీయం

- మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్

నవతెలంగాణ-సూర్యాపేట



పిల్లలకు విద్యతో పాటు పర్యావరణం, మొక్కల గురించి పరిచయం చేయడం పిల్లల్లో అవగాహన కల్పించడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్‌పెరుమాళ్ళ అన్నపూర్ణ అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలో స్కూల్ ఎర్త్ క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివాల్యూవేషన్ స్టేట్ కోఆర్డినేటర్ యానాల వెంకటరెడ్డి మాట్లాడుతూ మనం మట్టి, గాలి, నీరుకు నిత్యం సంబంధం కలిగి ఉన్నామని తెలిపారు. ఇవి లేకపోతే మానవుని మనుగడ లేదన్నారు. ఈ సందర్భంగా ఔషద మొక్కలను పాఠశాల ప్రధానోపాధ్యారాలు గోలీ పద్మలకు అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో యంగ్ ఎర్త్ లీడర్ సభ్యులు మెడిసినల్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఓ దేవరాజ్, ఎస్ ఓ ఎర్రంశెట్టి రాంబాబు, సిజిఆర్ జిల్లా బాధ్యులు మామిడి శంకర్, జన్య ఫౌండేషన్ మేనేజర్ శివకుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శివకుమార్, చైతన్య మహిళా సాధికారత జిల్లా ఇంచార్జ్, పాఠశాల మెంటార్ ఉపాధ్యాయులు విశ్వజ్ఞ చారి, లీడ్ ఎర్త్ లీడర్స్ పాల్గొన్నారు.

త్యాగాల ఫలితంగానే స్వాతంత్రం

- సర్వేజనా ఫౌండేషన్ చైర్ పర్సన్ బండారు కవిత అమరేందర్ రెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్



ఎంతోమంది మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని సర్వేజనా ఫౌండేషన్ చైర్ పర్సన్ బండారు కవితా అమరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో కళాశాల విద్యార్థులతో కలిసి సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రి, బస్టాండ్ సెంటర్ రంగా థియేటర్ వరకు భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ దేశం నాది అనే భావన ప్రతి ఒక్కరిలో కలగాలనే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ రావు, జనార్దన్, ఎంఎల్ఎన్ రెడ్డి, రాధిక, అచ్యుత్ రావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- పెద్దవూర పీహెచ్‌సీ వైద్యులు నగేశ్

నవతెలంగాణ-పెద్దవూర



వానకాలం ప్రారంభం కావడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడే ప్రమాదం పొంచివుంది.ఈ నేపథ్యంలో వ్యాధుల నివారణ కోసం తీసుకుంటున్న చర్యలగురించి పెద్దవూర పీహెచ్‌సీ దాక్టర్ నగేష్ వివరించారు.

ప్రస్తుతం ప్రజల ఆరోగ్యం పట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వానకాలం ప్రారంభం కావడంతో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ ఇప్పటికే ఇంటింటి ప్రచారంతో అవగాహన కల్పించాం.తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించడంతో పాటు సీజనల్‌గా వచ్చే మలేరియా, డెంగ్యూ, డైయేరియా వ్యాధుల పట్ల అవగాహన కల్పించాం.గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మురుగు నీటి గుంతలు, కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నాం.

దవాఖానలో ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

ఇద్దరు స్టాఫ్‌నర్సులతోపాటు పూర్తి స్థాయి సిబ్బందితో నిరంతర సేవలందిస్తున్నాం.వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాం.

పాము కాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉందా?

ప్రత్యేకించి ప్రభుత్వం పాముకాటుకు గురైన వారికి ఏఎస్‌వీ, కుక్కకాటుకు ఏఆర్‌వీ వ్యాక్సిన్‌ను పంపిణీ చేసింది.ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదు.నాటువైద్యం జోలికి పోకుండా పాముకాటుకు గురైన వారిని నేరుగా దవాఖానకు తరలించాలి.

కాన్పుల కోసం వచ్చేవారికి సౌకర్యాలు ఎలా ఉన్నాయి?

ప్రభుత్వ దవాఖానాలో కాన్పులు చేయించుకునే తల్లీ బిడ్డల సంక్షేమంకోసం ఆడ బిడ్డ పుడితే రూ. 13 వేలు, మగ బిడ్డ పుడితే రూ. 12 వేలు లబ్దిదారుల ఖాతాలో నేరుగా జమ చేస్తుంది.

సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను రక్షించేందుకు తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యలేంటి?

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలడానికి ఆస్కారం ఉంటుంది.అయితే ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులను కట్టడి చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా ముందస్తుగానే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం, వ్యాధి నిర్ధారణ చేయడం, ఏమైనా వ్యాధి లక్షణాలు కన్పిస్తే త్వరితగతిన చికిత్స అందించడం వంటివి చేస్తున్నాం.వైద్యసిబ్బందిని సైతం అందుబాటులో ఉన్నాము.

వ్యాధుల నియంత్రణ కార్యాచరణ ఎలా ఉంది?

ఈ సీజన్‌లో ముఖ్యంగా కలుషితాహారం, కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా(అతిసార) ప్రబలే అవకాశం ఉండడంతో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నారు. స్థానిక వైద్య కేంద్రం లో అవసరమైనన్ని ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం.

వ్యాధుల తీవ్రతపై పల్లెల్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల మాటేమిటి?

ఒకప్పుడు వానాకాలం వచ్చిందంటే గిరిజన ప్రాంతాలు, మారుమూల ఆవాసాల్లోని ప్రజానీకం సీజనల్ వ్యాధులతో అల్లాడిపోయేవారు. రోజులకు రోజులు మంచం పట్టే పరిస్థితులుండేవి. పెద్దసంఖ్యలో క్యాంపులు ఏర్పాటుచేసి వైద్యం అందించాల్సి వచ్చేది. ప్రస్తుతం పరిస్థితులు గతంలో మాదిరిగా లేవు. ప్రభుత్వ వైద్యం పల్లె ప్రజలకు చేరువైంది. ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి మందులను అందజేస్తున్నారు.

వ్యాధుల పట్ల ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి

ఇంటిపరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ముఖ్యంగా పరిశుభ్రతను పాటించాలి.పరిశుభ్రమైన ఆహారంతోపాటు కాచి వడబోసిన నీటినే తాగాలి.ఏవైనా టెస్టులు అవసరమైతే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగానే చేయించుకునే అవకాశం ఉంది. సబ్ సెంటర్లలో సంబంధిత నమూనాలను ఇస్తే పరీక్షల నిమిత్తం వాటిని జిల్లాకేంద్రంలోని ఏరియాదవాఖానకు పంపించి వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత అవసరమైన మందులను అందజేస్తారు.

ఈ సీజన్‌లో ఏయే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. నివారణ చర్యలేమిటి?

మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది.గతంతో పోలిస్తే ఈ తరహా వ్యాధులు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు,ఈగలు వృద్ధి చెంది అంటువ్యాధులకు కారణమవుతున్నాయి.దీన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



ఇటీవల వరుసగా వర్షాలతో గ్రామాలు అన్నీ చిత్తడిగా మారాయని దీంతో దోమలు విజృంభించి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఆర్.వెంకటేశ్వర్లు , మండల కార్యదర్శి చెరుకు పెద్దులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. వరుస వర్షాలతో గ్రామాలలో వీధులు, మురుగు కాలువలు చిత్తడిగా మారి విష జ్వరాలు ప్రబలుతున్నాయి అని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రతి ఇంటిలో ఒక్కరు ఇద్దరు చొప్పున జ్వర పీడితులై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా వహించాలని ప్రజలను చైతన్యం చేస్తూ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు కల్లూరి యాదగిరి, చింతపల్లి బయన్న, దండు రవి అర్థం శ్రీను, దండు నాగరాజు, పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత

- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, క్లబ్ కార్యదర్శి వేనారెడ్డి
- కాంగ్రెస్ పార్టీలో చేరిన హైకోర్టు న్యాయవాది సగరపు ప్రసాద్

నవతెలంగాణ-సూర్యాపేట



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి వేనారెడ్డిలు అన్నారు. బుధవారం చివ్వెంల మండల పరిధిలోని మోదిన్ పురం గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది సగరపు ప్రసాద్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా స్థానిక వైట్ హౌజ్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దామోదర్‌రెడ్డి నియోజకవర్గంలో ఎంతో మంది యువతను రాజకీయాల్లోకి తీసుకువచ్చి ప్రోత్సాహించారని గుర్తు చేశారు. పార్టీలో చేరిన సగర ప్రసాద్‌కు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. ఉన్నత చదువులు చదివిన వారికి కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, చత్రు నాయక్, నాయకులు కొడితల వెంకన్న, బోళ్ల రమణమ్మ, మస్తాన్, కన్నం జానయ్య, ఎల్లా చారి, చెరుకు సుధాకర్, చీము వీరయ్య, చీమ సుధాకర్, భూక్య సైదా, పరిసయ్య, చిన్న వెంకన్న, శాంతి, నాగరాణి పాల్గొన్నారు.

రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మెన్‌కు ఫిర్యాదు

నవతెలంగాన-చిట్యాల

చిట్యాల మండలంలోని పిట్టంపల్లి, వెలిమినేడు గ్రామాల పరిధిలో కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గతంలో జిల్లా అధికారులకి ఫిర్యాదు ఇచ్చినప్పటికీ వారు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో, మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన పర్యావరణ పరిరక్షణ సంస్థ సభ్యులు బుధవారం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిచైర్మెన్ ను కలిసి కంపెనీ లకి చెందిన పలు కాలుష్య కారక ఫొటోలు వీడియోలని సమర్పించి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగస్వామిగౌడ్, సహాయ కార్యదర్శి లక్ష్మణ్ , అంజి తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణను కలిసిన బోడ సునీల్

నవతెలంగాణ-నకిరేకల్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను బుధవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ సునీల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

తుంగతుర్తి ఎమ్మెల్యే సతీమణిని పరామర్శించిన వీరేశం

నవతెలంగాణ-నకిరేకల్

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు సతీమణి మందుల యాదమ్మ అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం యాదమ్మ ను పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-డిండి

మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన నిరంజనమ్మ, బుషిపాక అంజయ్య కుటుంబ సభ్యులకు బుధవారం చేయూత ఫౌండేషన్ వారు 10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ సభ్యులు పున్న దినేష్, బొల్లే శైలెష్, బాదమోని శ్రీనివాస్ గౌడ్, ఎ.టి. కృష్ణ, నూకం వెంకటేష్, అబ్దుల్ ఖయ్యుమ్, కొంపల్లి వేణుగోపాల్, కొత్త మధు, చింతపల్లి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు 17న స్పాట్ కౌన్సిలింగ్

నవతెలంగాణ-మిర్యాలగూడ

పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన గిరిజన బాలుర విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ కోసం ఈ నెల 17వ తేదీ ఉదయం 11 గంటలకు మిర్యాలగూడ మండలం అవంతిపురం గిరిజన గురుకుల బాలుర కళాశాల యందు అన్ని రకాల ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీగ్రూప్‌లో 5, బైపీసీ గ్రూప్‌లో 20, సీఈసీ గ్రూప్‌లో 13 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

నవతెలంగాణ-చండూరు

చండూరు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రారంభించిన మనబడి మన చేయూత అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం హై స్కూల్ పూర్వ విద్యార్థులు చేయూతను అందించారు. చండూరు పట్టణానికి చెందిన తేలుకుంట్ల చంద్రశేఖర్ 50 వేలు విలువచేసే సౌండ్ సిస్టంను, పూర్వ ఉపాధ్యాయుడైన పాల్వాయి నరసింహారెడ్డి పదివేలు ప్రకటించగా, ఆయన కుమార్తె పద్మజా రెడ్డి విద్యార్థులకు 400 బాసర సరస్వతి పెన్నులు బహూకరించారు.మహమ్మద్ అహ్మద్ పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉండేలా జెసిబితో పనులు ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు ఎడ్ల బిక్షం ఉపాధ్యాయుల బృందం దాతలను ఈ సందర్భంగా సత్కరించారు.

100 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు అభినందనీయం

- మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల

నవతెలంగాణ-కోదాడరూరల్



ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ సభ్యులు 100 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల అన్నారు. పట్టణంలో నిర్మించిన 100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణకు సిద్ధమైన సందర్భంగా పట్టణంలో ముందస్తుగా నిర్వహించిన భారీ ర్యాలీని బాయ్స్ హై స్కూల్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఐవిఓ సభ్యులు, పాఠశాల, కళాశాల ప్రజా ప్రతినిధులతో కలిసి 200 అడుగుల భారీ జాతీయ జెండాను ప్రధాన రహదారిపై బస్టాండ్ నుండి ఖమ్మం క్రాస్ రోడ్, రాజీవ్ చౌరస్తా, వాయల సింగారం రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉజ్జిని రవీందర్ రావు,రాష్ట్ర కోఆర్డినేటర్ సూర్యపేట జిల్లా అధ్యక్షులు గుండా మధుసూదన్ రావు, ప్యాట్రన్ గుండాపూనేని నాగేశ్వరరావు, జగని ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ గోవింద నవీన్, పిఆర్వో షేకు రమేష్, కత్తి భగత్, శారద, సత్యమూర్తి, అరుణ్, పైడిమర్రి వెంకటనారాయణ, మునీర్ పాల్గొన్నారు.

ఈ స్వాతంత్ర్యం మనకేమిచ్చింది ?

- అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీ కోటేశ్వరరావు

నవతెలంగాణ-కోదాడరూరల్

ఈ స్వాతంత్రం మనకేమిచ్చింది అని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని లాల్ బంగ్లాలో నిర్వహించిన ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 78 సంవత్సరాల స్వరాజ్యంలో 80 కోట్ల మంది ప్రజలు పేదరికపు అగాధంలో కొట్టుమిట్టాడుతున్నారని మరోవైపు పిడికెడు మందిగా ఉన్న అంబానీ ఆదాయం మన జాతీయ ఉత్పత్తిలో 10 శాతంగా ఉంది మిగతా అదాని, బిర్లా, టాటా తదితరుల ఆదాయం కలిపితే 50 శాతానికి ఉంటుందన్నారు. నేడు మన దేశం అప్పు 181లక్షల 68 వేల 456 కోట్ల రూపాయలు దీన్ని మన దేశ జనాభాకు పంచితే ఒక మనిషికి 1,లక్ష18 వేల రూపాయలు పడుతుందన్నారు. ఈ అప్పులపై ప్రతి సంవత్సరం వడ్డీ 11లక్షల 62, వేల940 కోట్ల రూపాయలు చెల్లించవలసి వస్తుందన్నారు. మన దేశ బడ్జెట్ 48 లక్షల20 వేల 512 కోట్ల రూపాయలన్నారు. రాబడి లేక ప్రతి 30 సెకండ్లకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. పబ్లిక్ రంగాలన్నీ నష్టాల పేరుతో ప్రైవేటీకరణ వైపు పరుగులు తీస్తున్నాయి, కార్మికుల పై 4 లేబర్ కోడ్ లను రుద్ది 12 గంటల శ్రమ చేయిస్తున్నారు. మన దేశాన్ని ఒకరకంగా తాకట్టులో భారత్ నుంచి అమ్మకానికి భారత్‌గా భావిస్తున్నారు. మన దేశాన్ని రక్షించుకోనుటకు,మన వ్యవసాయం, మన ఫ్యాక్టరీలను సామ్రాజ్యవాద కార్పొరేటర్ విషపు కౌగిలి నుండి కాపాడుకొనుటకు అందరూ ఐక్యం కావలసిన అవసరం ఉందన్నారు.

ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు వెంటనే చేపట్టాలి

నవతెలంగాణ-మర్రిగూడ



11 సంవత్సరాలుగా ట్రాన్స్ఫర్స్ కాకుండా విధులు నిర్వహిస్తున్న ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలని బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులుమధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, కారుణ్య నియామకాలు చే పట్టాలని,హెల్త్ కార్డులు ఇవ్వాలని, 2వ ఫేజ్‌లో నియామకమైన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రి మెంట్,తెలంగాణ ఇంక్రిమెంట్, మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ శివ స్వరూపరాణి, ఉపాధ్యాయులు, అభిలాష్, ఆంజ నేయులు, విజయలక్ష్మి, సతీష్ రాజ్, ప్రి యదర్శిని, వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, శ్రీను, మీనాకుమారి, విజయ్ కుమార్, నస్రీన్‌లు పాల్గొనడం జరిగింది.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షునిగా అభినయ్‌ని గెలిపించాలి

- సర్వోత్తమ రెడ్డి, వేణారెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా పోటీ చేస్తున్న 15వ వార్డు కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్‌కు ఓట్లు వేసి గెలిపించాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన యువజన కాంగ్రెస్ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రి, నియోజకవర్గం ఇంఛార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి కి యూత్ కాంగ్రెస్‌తో విడదీయరాని అనుబంధం వుందన్నారు. 18 నుండి 35 సంవత్సరాల వయసు కలిగిన వారు యూత్ కాంగ్రెస్ సభ్యులుగా చేరవచ్చని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసే సమయంలో యాక్టివ్ మెంబర్‌లకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. నియోజకవర్గం నుండి యూత్ కాంగ్రెస్‌కు ముప్పై వేల మందికి సభ్యత్వం ఇవ్వాలని సూచించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఉంటుందని చేరే వారి వివరాలతో ఆన్ లైన్‌లో నమోదు చేయాలన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడ ఎలిమినేటి అభినయ్‌కి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ బైరు శైలేందర్, అనంతుల యాదగిరి, బచ్చలకూరి శ్రీనివాస్, కొండపల్లి దిలీప్ రెడ్డి, నెల్లుట్ల లింగస్వామి, గండూరి రమేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-చండూరు

సమాజానికి హానికరమైన మాదకద్రవ్యాల వాడకాన్ని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాలని చండూరు సీఐ వెంకట్ కోరారు. బుధవారం నవ తెలంగాణతో ఆయన మాట్లాడారు. యువత మాదకద్రవ్యాల వారిని పడకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని, మరకత ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, కళాశాలలు ఇతర ప్రాంతాలలో డ్రగ్స్ సేవిస్తున్న విక్రయిస్తున్న ఆ సమాచారం తమకు అందిస్తే చర్య తీసుకుంటామన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గుప్తంగా ఉంచుతామన్నారు. కనగల్, చండూరు, మునుగోడు, గట్టుప్పల్ మండలాలలో గంజాయి డ్రగ్స్ నిర్మూలనకు కళాశాలలో, పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

9
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రిభువనగిరి
గురువారం ఆగస్టు15, 2024 www.navatelangana.com

ఇందిరా మహిళాశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కోదాడరూరల్



మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న వివిధ స్వయం సహాయక సంఘంలోని మహిళలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిర మహిళ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక విభాగం మెప్మా ఆధ్వర్యంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి అవగాహన సదస్సులో డ్వాక్రా సంఘాల మహిళలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ రమాదేవి, పీవో మెప్మా రేణుక, సి ఓ వెంకన్న, స్త్రీనిధి మేనేజర్ రామారావు, సీఆర్పీలు విజయరాణి, రాణి, అర్చన చంద్రకళ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణులు నన్ను ఆదరించండి

నవతెలంగాణ-బొమ్మలరామారం



ఈనెల 14 నుండి జరుగుతున్న తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా ఆలేరు నియోజకవర్గం బొమ్మలరామారం మండల యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా మరోసారి పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామిడి శ్రవణ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ తన సీరియల్ నెంబర్ ఒకటి కావున 18నుండి 35 ఏండ్ల లోపు ఉనన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మేధావులు, ఉద్యోగులు, యువత ,యువకులు అందరూ తనకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఓటింగ్ ప్రక్రియ ఆగస్టు 14 నుండి సెప్టెంబర్ 14 వరకు ఆన్‌లైన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సారి కూడా తనను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా గెలిపించాలని కోరారు.

ఎవరి భవిష్యత్తు వారి చేతుల్లోనే ...

- యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది
- శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



ఎవరి భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉంటుందని, మంచి మార్గం వైపు పయనిస్తే సమాజంలో ఉన్నత స్థానాన్ని అధిరోహించవచ్చని రాష్ట్ర శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని సాగర్ రోడ్ లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మిషన్ పరివర్తన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర, దేశవ్యాప్తంగా యువతను పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్య డ్రగ్స్ అని, వాటి బారి నుండి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని శాసన మండలి చైర్మెన్ తెలిపారు. ఒక్కసారి మత్తు పదార్థాలకు ఆలవాటు పడితే బయటకు రావడం కష్టమని, అందువల్ల యువత ముఖ్యంగా విద్యార్థులు చదువుకునే వయసులో ఏ రంగంలో ప్రతిభ చాటవచ్చో గుర్తించి ఆలోచించి అటువైపు ప్రయాణించాలని సూచించారు. జీవితంలో ఏది సాధించాలన్న కృషి, పట్టుదల అవసరమని, వ్యసనాలకు బానిస కావద్దని పిలుపునిచ్చారు.రెండవ బహుళ జోన్ ఐ జి సత్యనారాయణ మాట్లాడుతూ గంజాయి లాంటి మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల అన్ని దుష్పరిణామాలే అని, యువత మంచిని కోరుకునే వైపు వెళ్లాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ నల్గొండ జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. చదువుకునే సమయంలో విద్యార్థులు చదువు పైనే దృష్టి పెట్టాలని, చదువుపై కాకుండా చెడు వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్తు కోల్పోతారని అన్నారు. ఎస్పీ శరథ్ చంద్ర పవార్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో గంజాయి తో పాటు, మత్తుమందుల నివారణలో భాగంగా పోలీస్ యంత్రాంగం ద్వారా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేకించి గంజాయి రహిత నల్గొండ కోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టామని, ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల నియంత్రణ పై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనా రెడ్డి,అడిషనల్ ఎస్పి రాములు నాయక్, ఎక్సయిజ్ సూపరింటెండెంట్ సంతోష్, డిఎస్పీలు,సిఐ లు, తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రంకు నివాళులర్పించిన సీపీఐ(ఎం) జిల్లా నాయకులు

నవతెలంగాణ -చిట్యాల

చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ మాజీ సర్పంచ్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రాచమల్ల రామచంద్రం(80) అనారోగ్యంతో హైదరాబాదులో మృతి చెందారు. బుధవారం రాత్రి వట్టిమర్తిలో ఆయన భౌతిక కాయాన్ని ఆ పార్టీ జిల్లా నాయకులు సందర్శించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ , అవిశెట్టి శంకరయ్య పుచ్చకాయల నర్సిరెడ్డి, పార్టీ నాయకులు శీలా రాజయ్య , బూరుగు శ్రీను, బూరుగు విజయ్, వట్టిమర్తి మాజీ సర్పంచ్ నర్రా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నేత్రదానంతో మరొకరికి జీవితం



- డాక్టర్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మానవ శరీరంలో నైనం ప్రధానమని, నేత్రదానంతో సగర్వంగా మరొక జీవితాన్ని నిలబెట్టవచ్చని ఎల్వి ప్రసాద్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ నేత్ర వైద్యులు డాక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్-ఎస్‌సెల్, ఎం జె ఎఫ్ లైన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ ఆధ్వర్యంలో నేత్రదాన అవగాహన సదస్సును బుధవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో ఏ అవయం సరిగా లేకున్నా బతుకులు కొనసాగించవచ్చన్నారు. కానీ కండ్లు లేకపోతేమాత్రం ఒక అడుగు కూడా ముందుకు వేయలేమన్నారు. చనిపోయిన మనిషి నుండి కార్నియాను స్వీకరించి సంబంధిత బాధితులకు అమర్చితే అందరిలాగే ఈ ప్రపంచాన్ని తమ కళ్ళతో చూడగలుగుతారని వివరించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పసుపుల మద్దిలేటి మాట్లాడుతూ నేత్రదానంపై ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని, ఇలాంటి కార్యక్రమాలు విశ్వవిద్యాలయం పరిధిలో చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రమణారెడ్డి లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ హరికాంత్ సెక్రటరీ పిచ్చయ్య ట్రెజరీ శేఖర్ రెడ్డి, అశోక్, చంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శేఖర్, వీరస్వామి, శ్రీనివాస్ ఆనంద్ హరి ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నల్లగొండ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పసుపుల మద్దిలేటి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు గొప్పతనాన్ని , వారి కృషిని కొనియాడారు. అదేవిధంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల చేత హర్ గర్ తిరంగా ప్రతిజ్ఞ చేయించారు. కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర సమరయోధుల గొప్పతనాన్ని వారి జీవిత చరిత్రలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శేఖర్ వీరస్వామి ఆనంద్ శ్రీనివాస్ హరి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



మెరుగైన వైద్యం అందించాలి

- సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జాగ్రతలు తీసుకోవాలి
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

నవతెలంగాణ-సూర్యాపేట

ప్రభుత్వ హాస్పిటల్‌కి వచ్చే వారికి రోగ నిర్ధారణ పరీక్షలు చేసిన తదుపరి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌ని సందర్శించి డాక్టర్లతో సీజనల్ వ్యాధులపై, రోగ నిర్ధారణ కేంద్రాల నిర్వహణపై, ఫార్మసి స్టోర్, బ్లడ్ బ్యాంక్ కేంద్ర నిర్వహణపై, ఓపి, ఐపి సేవలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విషజ్వరాలు ఎక్కువ మొత్తంలో నమోదు అవుతున్న సమయం కాబట్టి వైద్యులు అలాగే సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని కోరారు. హాస్పిటల్‌కి వచ్చే వారికి నాణ్యమైన మెడిసిన్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఏమైనా అవసరం ఉంటే వెంటనే తనకు తెలియజేయాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరిటిడెంట్ డాక్టర్ శ్రీకాంత్, రెసిడెన్సీ మెడికల్ అధికారి డాక్టర్ జనార్ధన్,డాక్టర్ గిరిధర్, డాక్టర్ కిరణ్, డాక్టర్ తరుణి, జూనియర్ డాక్టర్లు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

ఈనెల 17 నుండి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర అన్నారు. బుధవారం ఎల్ఆర్ఎస్ పై కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్ లో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్ ఆర్ ఎస్ పై ప్రతి గ్రామపంచాయతీకి ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ బృందం లో నీటిపారుదల శాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉంటారని తెలిపారు. బుధవారం జిల్లాలోని 15 మండలాల టీములకు శిక్షణ ఇవ్వగా,ఈ నెల 16న 16 మండలాల బృందాలకు ఎల్ఆర్ఎస్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ బృందాలు 17వ తేదీన పూర్తిస్థాయిలో పరిష్కారం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మురళి, ఈడిఎం దుర్గ రావ్, డిటిసిపి లక్ష్మి నారాయణ, ఆర్డీవోలు, డిఎల్‌పిఓ లు, తహసిల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్లు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, ఎంపీఓలు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-మునగాల

మండల కేంద్రంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య సహాయం అందించాలని సామాజిక కార్యకర్త గంధం సైదులు కోరారు. బుధవారం తహశీల్దార్ వలిగొండ అంజనేయులుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామంలోని ప్రజలు సీజనల్ జ్వరాల బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. అనంతరం వైద్యాధికారికి కూడా వినతి పత్రం అందించారు. స్పందించిన అధికారులు క్యాంప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్లు దేవరం శ్రీని వాస్ రెడ్డి, (లిప్పు)లింగంపల్లి నాగ బాబు, బి.శ్రీనివాస్ రెడ్డి, ఎస్ అప్పా రావు, ఈద రావు, ఎల్ శ్రీనివాస్, ఎండి రషీద్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ బోనాల పండుగ

- ఏర్పాట్లను పరిశీలించిన దైద రవీందర్

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ పట్టణంలో ఈ నెల 15న నిర్వహించే ముత్యాలమ్మ బోనాల పండుగ కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షులు గంగాధర యోగానందం తెలిపారు. ముత్యాలమ్మ దేవాలయం ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వసతులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ పరిశీలించారు. ఆయన వెంట కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు కొండ జానయ్య గౌడ్, కౌన్సిలర్ దైద స్వప్న, నాయకులు చౌగోని సైదులు, చౌగోని శీను, యాసరపు వెంకన్న చెనగోని రాజశేఖర్, వంటపాక నక్షత్, నర్సింగ్ మహేష్, సమ్మెట అఖిల్, చౌగోని ప్రశాంత్, వంటపాక యాదగిరి, వంటపాక సతీష్, రూపని బిక్షం, అశోక్, ముత్తయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి
- పోచంపల్లికి కృష్ణావాటర్‌ను అందిస్తాం
- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి



ప్రభుత్వ పాఠశాల ద్వారా గుణాత్మక విద్యను అందించి ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేర్చే విధంగా ఉపాధ్యాయులకు కృషి.చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు.బుధవారం పోచంపల్లి పురపాలక కేంద్రంలో వెంకటరమణ కాలనీ అమృత స్కీమ్‌లో భాగంగా రూ.17.50 కోట్లతో నిర్మిస్తున్న ఓహెచ్ఆర్ 5 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్ శంకుస్థాపన చేశారు. జూలూరు గ్రామంలో పది లక్షల రూపాయలతో ప్రభుత్వ పాఠశాల అదనపుగదుల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు.అభినవ్ యువజన సంఘం ఆధ్వర్యంలో సరస్వతి దేవి విగ్రహావిష్కరణ చేశారు.మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా కృషి చేస్తున్నారన్నారు.ప్రభుత్వ పాఠశాలలు ప్రయివేట్ పాఠశాల కంటే మెరుగ్గా విద్యను విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఆ స్థాయికి ఎదిగారన్నారు. అమృత స్కీం ద్వారా ఏర్పాటు చేస్తున్న ఐదు లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్ ద్వారా పోచంపల్లి మండలానికి కృష్ణావాటర్ అందించి ప్రజల ఆరోగ్యాలకు ఎంతో మేలు చేకూర్చే విధంగా కృషి చేస్తామన్నారు.అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గంలో 60 వాటర్‌ప్లాంట్లను భూదాన్ పోచంపల్లి మండలంలో 23 వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీరందిస్తామన్నారు. భూదానఉద్యమానికి నాంది పలికి నేడు చేనేత వస్త్రాలకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భూదాన్‌పోచంపల్లిని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. యూనెస్కో ద్వారా పర్యాట గ్రామంగా ఎంపికైన పోచంపల్లిలో పర్యాటకులను మరింత ఆకర్షించే అందుకు పోచంపల్లి పెద్దచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.చెరువును పోచంపల్లి నుండి రేవనపల్లివరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి మహనీయుల. విగ్రహాలతో పాటు రామచంద్రారెడ్డి వినోబాబావే విగ్రహాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. టూరిజం పార్కు నుండి మున్సిపల్ ఆఫీస్ జూలూరు రోడ్డు వరకు ముక్తాపూర్ చింతాబావి నుండి బసవలింగేశ్వర స్వామి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నుండి రేవనపల్లి చెరువు వరకు రింగ్‌రోడ్డు పాటు బతుకమ్మ ఘాటుగార్డెన్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.తద్వారా టూరిజం కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది దీనికి హెచ్ఎండిఏ సహకారంతో పనులను చేపట్టనున్నట్లు తెలిపారు మినీ ట్యాంక్ బండి అభివృద్ధి చేసేందుకు మూడు లేదా నాలుగు కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది మున్సిపల్ కేంద్రంలోని సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తామన్నారు.గత ప్రభుత్వంలో నిలిచిపోయిన దేశ్ముకు పిల్లాయిపల్లి రోడ్లు పనులు.జూలూరు రుద్రవెల్లి బిడ్జి నిర్మాణపనులు చేపట్టి ప్రజలకు రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు.జలాల్‌పురం గ్రామంలో ఉన్న రామనందతీర్థ గ్రామీణ యూనివర్సిటీ వృత్తి నైపుణ్యయూనివర్సిటీగా మార్చడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసి వినిపించానన్నారు. రామనందతీర్థ గ్రామీణ యూనివర్సిటీలో ఉన్న చెరువును సంచారపక్షులు కేంద్రంగా అభివృద్ధి చేసినట్లయితే ఈ రెండు ప్రాంతాలతో పాటు టూరిజం ప్లేసు మినీట్యాంక్‌బండ్ రామనందతీర్థ నైపుణ్య యూనివర్సిటీగా తీర్చిదిద్దినట్లయితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. హైదరాబాదుకు కూతవేటు దూరం ఉండడం ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి,మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్‌చైర్మెన్ లింగస్వామి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాక మల్లేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశం, కడప రమేష్ ,కౌన్సిలర్ మోటి రజిత రాజు, భానుమతి, విష్ణు, సామ మధుసూదన్‌రెడ్డి, సామ మోహన్‌రెడ్డి, భారత నవకుమార్, మరి నర్సింహారెడ్డి, బండారు ప్రకాశ్‌రెడ్డి, గుణిగంటి రమేష్, ఎస్సై భాస్కర్‌రెడ్డి, అభినయ్ పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌జయంతి

నవతెలంగాణ-హాలియా

మండలంలోని చింతగూడెం గ్రామంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అనుముల మండల అధ్యక్షుడు కాట్నం యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో చింతగూడెం గ్రామంలో సొసైటీ సభ్యులతో కలిసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి వారి యొక్క జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగాని సీతారాములు మాట్లాడుతూ కాటమయ్య స్ఫూర్తితో తెలంగాణ వృత్తిలో ఉపాధికోసం ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కాసాని సత్తయ్య గౌడ్, వడ్లగోని వెంకన్న గౌడ్, కాట్నం సైదులు గౌడ్, కాట్నం నవీన్ గౌడ్, చెదురుబెల్లి రామలింగం గౌడ్, కాకునూరి సైదయ్య గౌడ్, చెదురుబెల్లి శివ గౌడ్, కాట్నం నరసింహ గౌడ్, వడ్లగోని గోవిందు గౌడ్, పల్సా సాయికుమార్ గౌడ్, కాట్నం సైదయ్య గౌడ్, కాట్నం వెంకటయ్య గౌడ్, కాట్నం రామయ్య గౌడ్, చెదురుబెల్లి వెంకయ్య గౌడ్ తదితర కల్లుగీత కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సాగర్ లో ఘనంగా తీరంగా బైక్ ర్యాలీ

నవతెలంగాణ-నాగార్జునసాగర్



సీఆర్పీఫ్ డిఎస్పీ షాహీర్ అలీ మరియు ఎస్పీఎఫ్ డిఎస్పీ ఆధ్వర్యంలో స్వతంత్ర దినోత్సవం సందర్భంగా బుధవారం నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని బాలవిహార్ నుండి పైలాన్ డ్యామ్ వరకు తిరంగా బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పలువురు డిఎస్పీలు మాట్లాడుతూ దేశం పై ప్రేమను, దేశ భక్తిని పెంచుదామని స్వాతంత్ర పోరాటాన్ని స్ఫూర్తిగా తీసు కొని మనదేశం మరింత అభివృద్ధి సాధించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ బైక్ ర్యాలీ వల్ల పట్టణ ప్రజలలో దేశం పట్ల అవగాహన,చైతన్యం,దేశభక్తి పెంపొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ర్యాలీలో సాగర్ సర్కిల్ సి.ఐ బిసన్న,ఎస్.ఐ సంపత్,సీఆర్పీఎఫ్,ఎస్పీఎఫ్,పోలీస్ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో ఎమ్మెల్యేలు, అధికారులు బస చేయాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

సంక్షేమ వసతి గృహాల్లో వారానికి ఒకసారి ఎమ్మెల్యేలు, అధికారులు బస చేయాలని బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ వసతిగృహాల్లోని విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు ప్రభుత్వం మెరుగుపరచాలన్నారు. ఎమ్మెల్యేలు, అధికారులు తరుచుగా వసతిగృహాలను సందర్శించి వారానికి ఒకసారి అక్కడ బస చేసి అక్కడి ఇబ్బందులను, అవసరమైన వసతుల గురించి తెలుసుకోని వసతి గృహాల నిర్వహణను మెరుగుపరచడంతోపాటు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. వసతి గృహాల విద్యార్థుల చదువులు మరింతగా మెరుగుపరచేందుకు అవసరమైన చోట ట్యూటర్లను ఏర్పాటు చేయాలని, చదువుల పట్ల విద్యార్థులకు శ్రద్ధ పెరిగేలా చూడాలని అన్నారు.

గుండు పాపయ్య సేవలు మరువలేనివి

నవతెలంగాణ-హుజూర్‌నగర్



ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ మామ గుండు పాపయ్య కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడిగా ఉండి సంఘానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. బుధవారం ఆయన సంతాప సభలో పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి తన్నీరు మల్లికార్జున్ జన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి కస్తాల శ్రావణ్ సైదా మేస్త్రి వల్లపు దాసు కృష్ణ షేక్ మన్సూర్ అలీ చిట్యాల అమర్నాథరెడ్డి మాజీ సర్పంచ్ గొట్టే వెంకట్రామయ్య ఐల వెంకన్న గౌడ్ కోలపూడి యోహాన్ కుకడపు మహేష్ బంటు సైదులు చిరంజీవి శ్రీను తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు షూ పంపిణీ

నవతెలంగాణ-చిట్యాల



మండలంలోని వట్టిమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 20వేల రూపాయల విలువ గల షూ , రెండు జతల సాక్స్ లను స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి బూరుగు శ్రీనివాస్, నర్ర కిషోర్ విద్యార్థులకు అందజేశారు . పాఠశాల ఉపాధ్యాయులు డి.సూర్య ప్రకాష్ ,శీలం మధుసూదన్ టై, బెల్టులు తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మెన్ నర్రా మోహన్ రెడ్డి ,రాంపల్లి రాఫెల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పందిరి రమేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ మేడి శ్రీలత ,మాజీ ఉపసర్పంచ్ సాగర్ల నరేష్ ,ఆసరా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు మేడి హరికృష్ణ ,ఉపాధ్యాయులు ఆనంద్ ,చంద్రయ్య ,అనీష్ ఫాతిమా, నీరజ, నరసింహ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వారికి జరిమానాలు

నవతెలంగాణ-హాలియా



హాలియా మున్సిపాలిటీలో వివిధ షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న షాపు యజమానులకు హాలియా మున్సిపల్ కమిషనర్ ఎండి. మున్వర్ అలీ జరిమానాలు విధించారు. స్వచ్ఛధనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్లాస్టిక్ రహిత సమాజం కొరకు హాలియా మున్సిపాలిటీ యందు వివిధ షాపులలో బేకరీ షాపులలో కిరాణ ఇతర షాపులలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న షాపుల యందు తనిఖీలు నిర్వహించి 13 వేల రూపాయలు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఓ శ్రీధర్ రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ల నిరసనలు

- దోషులను కఠినంగా శిక్షించాలి : ప్రజాసంఘాల డిమాండ్
- లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోల్‌కతా మహిళా వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా జూనియర్, సీనియర్ డాక్టర్లు నిరసన తెలిపారు. బుధవారం ఉదయం నుంచి అత్యవసర సేవలు మినహా అన్ని రకాల సేవలను బహిష్కరించిన వైద్యులు వివిధ రూపాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులతో పాటు వరంగల్, నల్లగొండ, నిజామాబాద్, ఖమ్మం తదితర జిల్లాల్లోని బోధనాస్పత్రుల ముందు ధర్నాలు నిర్వహించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

మెడికల్ కాలేజీ విద్యార్థినిపై లైంగిక దాడి దారుణం

కోల్‌కతాలోని ఆర్‌జీ.కేర్ మెడికల్ కాలేజీ విద్యార్థినిపై లైంగిక దాడి కేసును సమగ్రంగా విచారించాలనీ, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మహిళా డాక్టర్‌పై లైంగికదాడి చేసి హత్యచేసిన ఘటనను నిరసిస్తూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)సంఘాల ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఆ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ..ప్రజలను కాపాడే వృత్తిలో ఉన్న విద్యార్థులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ఆందోళన చెందారు. ఆస్పత్రిలో 30 గంటల పాటు వైద్య సేవలు అందించిన విద్యార్థిని రెస్ట్ కోసం కాన్ఫరెన్స్ హాల్లో నిద్రిస్తున్న సమయంలో లైంగికదాడి చేసి హత్యచేశారని వాపోయారు. దేశవ్యాప్తంగా మెడికల్ విద్యార్థుల రక్షణకు కనీస సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ. వెంకటేష్ మాట్లాడుతూ బెంగాల్ వైద్య విద్యార్థిని హత్యకు గురైతే హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తూ కేసును పక్కదారి పట్టించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆస్పత్రి అధికారులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తక్షణమే అధికారులపై చర్యలు తీసుకోవాలనీ, ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ..ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించే వరకు దేశవ్యాప్తంగా పోరాటాలను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ఐద్వా నాయకులు కే నాగలక్ష్మి, పి శశికళ ,ఎం లక్ష్మమ్మ ,కవిత, డీవైఎఫ్ఐ నాయకులు ఎమ్‌డీ జావేద్, హష్మీ బాబు, కే.విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎ.లెనిన్ శ్రీమన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక కళా యాత్ర

21న ప్రారంభం

- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ-కల్చరల్

ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి సెప్టెంబర్ 21 వరకు హైదరాబాద్‌లో 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. సమాజాన్ని మేల్కొలుపుదాం' పేరిట కళాయాత్ర నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను బుధవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలోని కళాభవన్‌లో పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ కళా యాత్రలో 20 మంది కళాకారులు.. హైస్కూల్, కళాశాలలు, బస్తీలు, కాలనీల్లో నృత్యాలు, నాటికలు ఇతర కళా రూపాలతో ప్రదర్శనలు ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. గోడ పత్రిక ఆవిష్కరణలో ఆహ్వాన సంఘం సలహాదారు డిజి.నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి ఎం.మారన్న, పీఎన్ఎం నాయకులు పి.మల్లేష్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

అసమ్మతి, విద్వేషాన్ని పారదోలాలి

(మొదటిపేజీ తరువాయి)

పురోగతి సాధించడమంటే సామాజిక ప్రజాస్వామ్యం స్థిరీకరణ దిశగా సాధించిన పురోగతికి సాక్ష్యంగా నిలుస్తుందని అన్నారు.

మన సామాజిక జీవితంలోని ప్రతి కోణంలోనూ అందరినీ కలుపుకుని పోయే స్ఫూర్తి అంతర్లీనంగా వుందన్నారు. మనకు గల వైవిధ్యత, బహుళతలతో ఒక సమగ్ర దేశంగా కలిసికట్టుగా మనం ముందుకు సాగుతున్నామన్నారు. అందరినీ కలుపుకుని పోయే ఒక సాధనంగా దృఢమైన కార్యాచరణ వుండాలన్నారు. ఇంతటి వైవిధ్యత నెలకొన్న విస్తారమైన మన భారతదేశంలో వివిధ సామాజిక వర్గాలపై అసమ్మతి, విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణులను మనం నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని పిలుపిచ్చారు.

సమాజంలో వెనుకబాటుకు గురైన వర్గాల అభ్యున్నతికోసం ఉద్దేశించిన పలు ప్రభుత్వ పథకాలను ఈ సందర్భంగా ముర్ము ఉదహరించారు. ప్రత్యేకంగా గిరిజన గ్రూపుల సామాజిక,ఆర్థిక పరిస్థితుల మెరుగుదలపై దృష్టి పెడుతూ తీసుకువచ్చిన ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం-జెఎఎస్ఎంఎఎస్) సహా పలు పథకాల గురించి పేర్కొన్నారు. పాకీ పనిని నిర్మూలించడానికి ఉద్దేశించిన నమస్తే పథకాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. లింగ బేధం లేకుండా న్యాయం అందరికీ అందాలని, జరగాలని ఆమె ఆకాంక్షించారు. భారతీయ సమాజంలో మహిళలు సమానంగా చూడబడుతున్నా సాంప్రదాయ పక్షపాతాలు ఇంకా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ కృషి వల్ల గత దశాబ్ద కాలంలో మహిళల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయింపులు మూడు రెట్లు పెరిగాయన్నారు. మహిళా కార్మికుల ప్రాతినిధ్యంపెరిగిందని, ఆడపిల్లల జననాల సంఖ్యకూడా మెరుగైందన్నారు. మహిళల సాధికారత దిశగా గణనీయమైన చర్యగా నారీ శక్తి వందన అభియాన్ (మహిళా రిజర్వేషన్ యాక్ట్)ను ఆమె పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని కూడా ప్రశంసించారు. దేశవ్యాప్తంగా కోటి మందికిక పైగా యువతకు నైపుణ్యాల అభివృద్ధికి, పని నేర్చుకోవడానికి ఈ పథకం ఉద్దేశించబడిందని చెప్పారు.

ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలను ప్రస్తావిస్తూ, ఇంత పెద్ద స్థాయిలో దాదాపు 97కోట్ల మంది ప్రజలు నిర్భయంగా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడమంటే సుస్థిరమైన, ఆదర్శప్రాయమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రైతులను అన్నదాతలుగా కీర్తిస్తూ, భారతదేశ వ్యవసాయ రంగం స్వావలంబనలో వారి పాత్ర ఎనలేనిదని కొనియాడారు. రోడ్లు, రైల్వేలు, ఓడరేవులతో సహా మౌలిక సౌకర్యాలన్నీ గణనీయంగా మెరుగుపడ్డాయని, మౌలిక సదుపాయాల రంగంలో పురోగతి సాధించామని చెప్పారు. వ్యూహాత్మకమైన ప్రణాళికలు, సమర్థవంతమైన పనితీరు వల్లనే సాధ్యమైందన్నారు. ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచామన్నారు.

అప్పులు సరే.. తిరిగి ఎలా తీరుస్తారు ?

ఆర్డీసీకి బ్యాంకర్ల సూటి ప్రశ్న

- సొంత ఆదాయ మార్గాలు అన్వేషించాలంటూ ఆర్‌బీఐ మెలిక
- అధికారుల కసరత్తు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేశంగానీ, రాష్ట్రం గానీ అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు కీలకం. ప్రధానంగా రోడ్లు అత్యంత ప్రధానం. రోడ్లను బాగు చేయాలంటే నిధులు కావాలి. అరకొర పనులు జరుగుతున్నా అవి సరిపోవు. భారీఎత్తున పాత రోడ్లకు మరమ్మతులు చేయడం, కొత్త వాటిని నిర్మించడం చేయాల్సిందే. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాణ్యమైన రోడ్లను వేయడం ద్వారా అత్యుత్తమ రవాణా సదుపాయాలు కల్పించాలంటే భారీ పెట్టుబడులు అవసరం. ఈ నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆర్డీసీ) చురుగ్గా అడుగులు వేసేందుకు ప్రయత్నిస్తున్నది. అయితే ఇందుకు నిధులు ప్రధాన అడ్డంకిగా మారాయి. బ్యాంకుల నుంచి అప్పులు చేసైనా సరే రోడ్లను అభివృద్ధి చేయాలని ఆర్డీసీ పాలకవర్గం భావిస్తున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా నివేదిక పంపినట్టు తెలిసింది. వాణిజ్య బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని రోడ్ల అభివృద్ధికి అనుమతించడంతోపాటు కౌంటర్ గ్యారంటీ ఇవ్వాలని కోరినట్టు సమాచారం. ఇప్పటికే పాలకవర్గం, అధికారులు బ్యాంకర్లను సంప్రదించారు. ఆర్డీసీ సంస్థకు అప్పులు ఇవ్వడానికి బ్యాంకర్లు సంసిద్ధత వ్యక్తం చేసినా తిరిగి ఎలా చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ముందడుగు పడటంలేదు. దీంతో అప్పులు ఇచ్చే విషయంలో బ్యాంకర్ల సందేహాలు, ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పాలో ఆర్డీసీకి పాలుపోవడం లేదు.

కేంద్రం సహాయ నిరాకరణ

రాష్ట్రాల అధికారాలు, నిధుల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరితో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అప్పులు తీసుకునే అంశంలో ఆర్థిక ఆంక్షలు పెట్టడం ఒకటైతే, జీఎస్టీ పన్ను నిధులు వెనక్కి పంపడంలో తీవ్ర జాప్యం మూలంగా రాష్ట్రాలకు తీవ్రంగా నష్టం జరుగుతున్నది.





ఆర్‌బీఐ అనుమతి

రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధితోపాటు నిర్మాణాల కోసం అప్పులు తీసుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అనుమతి ఇచ్చిందని ఆర్డీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆర్డీసీ ఇదివరకు తీసుకున్న రుణంతో రాష్ట్రంలోని పలు రోడ్లను అభివృద్ధి చేయడం, రుణం, దాని వడ్డీ చెల్లింపులు కూడా సక్రమంగా చెల్లించిన చరిత్ర ఉండటంతోనే ఆర్‌బీఐ అనుమతి లభించినట్టు ఆర్డీసీ అధికారులు అంటున్నారు. అయితే, గతంలో ఆర్డీసీ రుణాలను ప్రభుత్వమే చెల్లించగా, ప్రస్తుతం ఆ విధానంపై రిజర్వు బ్యాంకు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. ప్రభుత్వం చెల్లించకుండా కార్పొరేషనే నేరుగా ఆదాయ వనరులను సమకూర్చు కోవడం ద్వారానే అప్పులు తీర్చాలనే మెలిక పెట్టినట్టు తెలిసింది. అప్పు ఇచ్చేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఒక్కటే సరిపోదని, కార్పొరేషన్ నుంచి సొంత ఆదాయం ఏంటో చూపించాలని ప్రపంచ బ్యాంకు తరహా నిబంధనలను పెట్టినట్టు తెలుస్తోంది. దీంతో ఆర్డీసీకి సొంత ఆదాయ మార్గాలను అన్వేషించేందుకు అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. గత ఆర్డీసీ బోర్డు సమావేశంలో కూడా ఇదే విషయంలో చర్చ జరిగినట్టు తెలిసింది. అయితే, ఆదాయ మార్గాలను అన్వేషించడం, ఆ మేరకు ప్రభుత్వ అనుమతి తీసుకోవడం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో కాకుండా సొంత నిధులతో చెల్లింపులు చేసేలా కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు బ్యాంకుల ప్రతిపాదనలు, అభ్యంతరాలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్డీసీ తీసుకున్న లోన్ ఎంత?

ఆర్డీసీ ఇంతకుముందు రోడ్ల అభివృద్ధికి రెండు విడతలుగా రూ.2600 కోట్ల రుణం తీసుకుంది. వీటికి సంబంధించిన అసలు, వడ్డీ క్రమంగా చెల్లిస్తూ వస్తున్నది. అప్పు తీర్చడంలో ఆర్డీసీ ట్రాక్ రికార్డు బాగుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఆర్బీఐ నుంచి అనుమతి వచ్చిన నేపథ్యంలో ఆయా ప్రభుత్వ బ్యాంకుల నుంచి మరో రూ.800 కోట్లు రుణం తీసుకోవాలని ఆర్డీసీ గతంలో జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయించింది. బ్యాంకుల నుంచి రుణం ఇస్తే, గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులు ఎన్ని నిర్మించాలన్న అంశాలపై అధికారులు ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేసుకున్నారని సమాచారం.

ఆదాయ మార్గాలివే ?

ఆర్డీసీ సొంతంగా ఆదాయ మార్గాలు సృష్టించుకోవాలనీ, అందుకు కొన్ని విధానాలు మార్చుకోవాల్సి ఉంటుందని ఆ శాఖ ఉన్నతాధికారుల మధ్య చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఉదాహరణకు కర్నాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఆర్డీసీ సంస్థ పెట్రోల్, డీజిల్‌పై వేసే సెస్ నుంచి ప్రతి లీటర్‌కు ఒక రూపాయిని ఆర్డీసీ ఖాతాలో జమ చేస్తున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల ఆర్డీసీలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయనేది అధికారుల భావన. దీంతో రహదారుల నిర్మాణం, నిర్వహణ వాటికి మరింత సులభమవుతుందని మన రాష్ట్ర శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. మన రాష్ట్రంలో అలా చేయాలంటే అందుకు రాష్ట్ర ప్రభుత్వం విధానపరంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రుణాలు రావాలన్నా, ఆర్డీసీ ఆర్థికంగా పరిపుష్టిని సాధించాలన్న ఇదే కీలకమైన మార్గమని అభిప్రాయ పడుతున్నారు. అప్పులు తీసుకునే విషయమై త్వరలో సర్కారు నుంచి స్పందన వస్తుందనే ఆశాభావంతో ఆర్డీసీ అధికారులు ఉన్నారు.

మంజీరా అభయారణ్యానికి

'రాంసర్'గుర్తింపు కోసం ప్రతిపాదనలు





దీవుల్లో ఎన్నో రకాల జీవ వైరుధ్యాల జీవులు

అభయారణ్యాన్ని సందర్శించిన కేంద్ర బృందం

నవతెలంగాణ - మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా మంజీరా బ్యారేజీ సమీపంలో ఉన్న మంజీరా అభయారణ్యానికి 'రాంసర్' గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపినట్టు స్టేట్ వెట్లాండ్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రశాంతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'సౌభాగ్యత మిషన్' కార్యక్రమంలో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. అందులో భాగంగా ఐఏఎస్ అధికారుల కేంద్ర బృందం సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రశాంతి ఆధ్వర్యంలో బుధవారం మంజీరా అభయారణ్యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ.. బయోడైవర్సిటీ కార్యక్రమాల్లో భాగంగా మంజీరా అభయారణ్యాన్ని రాంసర్ గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మంజీరా నుంచి సింగూరు బ్యారేజీ వరకు మంజీరా నదిలో 20 చదరపు కిలో మీటర్ల విస్తీరణముందన్నారు. మంజీరా నదిలో తొమ్మిది దీవులున్నాయని, వీటిల్లో ఎన్నో రకాల జీవ వైరుద్యాల జీవులు నివశిస్తున్నాయని తెలిపారు. 300 రకాల పక్షులు, 160 రకాల ఇతర జీవులు ఈ దీవుల్లో ఉన్నాయని అధికారులు గుర్తించినట్టు చెప్పారు. ఎన్నో అరుదైన జాతుల పక్షులు సైతం మంజీరా అభయారణ్యం వైల్డ్ లైఫ్ శాంక్చురిలో ఉన్నట్టు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. ప్రతేడాది వర్షాకాలం, శీతాకాలం, వేసవికాలంలో ఆయా సీజన్లకు అనుగుణంగా వివిధ రకాల వలస పక్షులు మంజీరా నది మధ్యలో ఉన్న ఈ తొమ్మిది దీవులకు వలస వస్తున్నట్టు తెలిపారు. రాంసర్ గుర్తింపు వల్ల మంజీరా అభయారణ్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. ఇందుకోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా బోటుపై ఐఏఎస్ అధికారుల బృందం మంజీరా అభయారణ్యంలోని తొమ్మిది దీవుల సముదాయంలో విస్తరించి ఉన్న వైల్డ్ లైఫ్ శాంక్చురిని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను సభ్యులు తిలకించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు కీర్తి మాన వస్తీ, కల్వేరసన్, డాక్టర్ జాన్సె మాత్యు, వికాస్ చంద్రగుప్త, శ్రీకాంత్, డాక్టర్ మనోజ్, చంద్రం సింగ్, రాంబాబు, సంబంధిత బృంద సభ్యులు, సంగారెడ్డి జిల్లా ఫారెస్ట్ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల

బస్ కండక్టర్ అసభ్య పదజాలం

- షాద్‌నగర్ బస్ డిపో ఎదుట తల్లిదండ్రులతో కలిసి నిరసన
- చర్యలు తీసుకోవాలంటూ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-షాద్‌నగర్

చదువుల కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న విద్యార్థినుల పట్ల కండక్టర్ పరుషంగా ప్రవర్తిస్తున్న తీరును నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బస్ డిపో ఎదుట విద్యార్థినులు వారి తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేపట్టారు. షాద్‌నగర్ నుంచి కేశంపేట మండలంలోని సంగెం గ్రామానికి ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సు నడుస్తుంది. ఇదే బస్సులో ఆయా గ్రామాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు చదువుల కోసం షాద్‌నగర్‌కు వస్తుంటారు. ఈ బస్‌కండక్టర్ రాములు తమ పట్ల పరుషంగా మాట్లాడుతూ బూతులు తిడుతున్నాడని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ అప్ డేట్ లేకపోయినా, బ్యాగ్‌లో నుంచి ఆధార్ బయటకు తీయడంలో ఆలస్యమైనా బండబూతులు తిట్టి మధ్యలోనే బస్ ఆపి దింపేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బుధవారం సంగెం గ్రామానికి వచ్చిన బస్‌లోనే షాద్‌నగర్ బస్ డిపో వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. విద్యార్థినుల పట్ల అసభ్య పదజాలాన్ని ఉపయోగించి ఇబ్బందులకు గురిచేసిన బస్ కండక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు.

తెలంగాణకు 29, ఏపీకి 26 మెడల్స్

- దేశవ్యాప్తంగా 1,037 పతకాలు
- తెలంగాణకు చెందిన చదువు యాదయ్యకు రాష్ట్రపతి శౌర్య పతకం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు, ఫైర్ సర్వీస్, హెూంగార్డ్, సివిల్ డిఫెన్స్ అధికారులకు వివిధ పోలీసు పతకాలను కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 1,037 మందికి గ్యాలంట్రీ/సర్వీసు పతకాలను అందజేయనుంది. ఈ మేరకు అవార్డుల జాబితాను విడుదల చేసింది. 213 మందికి గ్యాలంట్రీ (శౌర్య) మెడల్స్ (జీఎం), ఒకరికి రాష్ట్రపతి శౌర్య పతకం (పిఎంజి), 94 మందికి విశిష్ట సేవ రాష్ట్రపతి మెడల్ (పిఎస్ఎం) మెడల్స్, 729 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్ (ఎంఎస్ఎం) ప్రకటించింది.

దేశవ్యాప్తంగా ఒకే రాష్ట్రపతి శౌర్య పతకం (పిఎంజీ) ప్రకటించగా అది, తెలంగాణకు చెందిన చదువు యాదయ్యకు దక్కింది. ఇక గ్యాలంట్రీ (శౌర్య) మెడల్స్ (జీఎం)లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నాలుగు మెడల్స్, తెలంగాణకు ఏడు మెడల్స్ దక్కాయి. పిఎంస్ఎంలో ఏపికి రెండు, తెలంగాణకు మూడు మెడల్స్ దక్కాయి. ఎంఎస్ఎంలో ఏపికి 20, తెలంగాణకు 18 మెడల్స్ వచ్చాయి. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని కేంద్ర హెూం శాఖ ఏటా రెండు సార్లు ఈ పోలీసు పతకాలను ప్రకటిస్తోంది.

తెలంగాణకు 29 మెడల్స్

రాష్ట్రపతి శౌర్య పతకం(పిఎంజి) తెలంగాణ పోలీసు శాఖకు చెందిన హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్యకు లభించింది.


గ్యాలంట్రీ (శౌర్య) మెడల్స్ (జీఎం) సునీల్ దత్ (ఎస్‌పి), మోరా కుమార్ (డిప్యూటీ అసాల్ట్ కమాండర్ / రిజర్వ్ ఇన్స్పెక్టర్), శనిగరపు సంతోష్ (అసిస్టెంట్ అసాల్ట్ కమాండర్ / రిజర్వ్ సబ్-ఇన్‌స్పెక్టర్), అమిలి సురేష్ (జూనియర్ కమాండో / పోలీస్ కానిస్టేబుల్), వెల్మల వంశీ (జూనియర్ కమాండో /పోలీస్ కానిస్టేబుల్), కంపాటి ఉపేందర్ (జూనియర్ కమాండో / పోలీస్ కానిస్టేబుల్), పాయం రమేష్ (జూనియర్ కమాండో / పోలీస్ కానిస్టేబుల్)కు దక్కాయి.

విశిష్ట సేవ కోసం రాష్ట్రపతి మెడల్స్ (పిఎస్ఎం) సంజయ్ కుమార్ జైన్ (ఎడిజి), కటకం మురళీధర్ (డిసిపి), ఫైర్ సర్వీస్ విభాగంలో వెంకటేశ్వర్లు కందిమల్ల (డ్రైవర్ ఆపరేటర్)కు దక్కాయి.

మెరిటోరియస్ సర్వీస్ మెడల్ (ఎంఎస్ఎం) అవినాష్ మొహంతి (పోలీస్ కమీషనర్), సయ్యద్ జమీల్ బాషా (కమాండెంట్), పి. కృష్ణమూర్తి (ఎఎస్‌పి), కొమరబత్తిని రాము (ఎస్ఐ), అబ్దుల్ రఫీక్ (ఎస్ఐ), ఇక్రమ్ అబ్ ఖాన్ (ఎస్ఐ), శ్రీనివాస మిశ్రా (ఎస్ఐ), కుంచాల బాలకాశయ్య (ఎస్ఐ), లక్ష్మయ్య (ఎఎస్ఐ), గుంటి వెంకటేశ్వర్లు (ఎఎస్ఐ), నూతలపాటి జ్ఞాన సుందరి (ఇన్‌స్పెక్టర్), ఫైర్ సర్వీస్ విభాగంలో మాధవరావు తెలుగు (లీడింగ్ ఫైర్‌మెన్), వాహెదుద్దీన్ మహ్మద్ (లీడింగ్ ఫైర్‌మెన్), హెూంగార్డ్ విభాగంలో లక్ష్మి బందోళ్ల (ఉమెన్ హెూం గార్డ్), మల్లేష్ మేడిపల్లి (హెూం గార్డ్), కవిత ఇంటూరి (ఉమెన్ హెూం గార్డ్), గాలయ్యా నమల (హెూం గార్డ్), సుమలత ఎనుముల (ఉమెన్ హెూం గార్డ్) దక్కాయి.

ముస్తాబైన ఎర్రకోట

(మొదటిపేజీ తరువాయి)



ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించినట్లు సంబంధిత మంత్రిత్వ శాఖ తెలిపింది. సుమారు 45 మంది లఖ్‌పతీ దీదీలు, 30 మంది డ్రోన్ దీదీలను కూడా ఆహ్వానించినట్టు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు.

ఈ ఘనమైన వేడుకను చూడటానికి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన దాదాపు 2,000 మంది సంప్రదాయ వేషధారణలో హాజరయ్యేందుకు ఆహ్వానించారు. మైగవ్, ఆకాశవాణి భాగస్వామ్యంతో రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించిన వివిధ ఆన్‌లైన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన 3,000 మంది కూడా వేడుకల్లో భాగమవుతారు. యువత, ఆదివాసీ సమాజం, రైతులు, మహిళలు, ఇలా రకరకాల జీవన విధానాలకు చెందిన వారు ప్రత్యేక అతిథులుగా రానున్నారు. వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల సహకారంతో వేర్వేరు రంగాల్లో ఘనత సాధించిన వారు కూడా ప్రత్యేక అతిథులుగా వేడుకలకు హాజరవుతారు.

ఎర్రకోటకు రాగానే ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అరమానే స్వాగతం పలుకుతారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జీఓసీ)లెఫ్టినెంట్ జనరల్ భవనీశ్ కుమార్‌ను ప్రధానమంత్రికి రక్షణ శాఖ కార్యదర్శి పరిచయం చేస్తారు. ఢిల్లీ ప్రాంత జీవోసీ నరేంద్ర మోడీని సెల్యూటింగ్ బేస్‌కు తీసుకువెళ్తారు. అక్కడ సంయుక్త అంతర్‌సేవలు, ఢిల్లీ పోలీసు సిబ్బంది ప్రధానమంత్రికి జనరల్ సెల్యూట్ చేస్తారు. తరువాత ప్రధాన మంత్రి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు.

ప్రధానమంత్రికి గౌరవ వందనాన్ని సమర్పించే బృందంలో సైనిక, నౌకాదళ, వాయుసేన, ఢిల్లీ పోలీసు నుంచి ఒక్కో అధికారి, 24 మంది సిబ్బంది చొప్పున ఉంటారు. గౌరవ వందనానికి కమాండర్ అరుణ్ కుమార్ మెహతా నేతృత్వం వహిస్తారు. ఆర్మీ బృందానికి మేజర్ అరుణ్ సింగ్, నౌకాదళ బృందానికి లెఫ్టినెంట్ కమాండర్ గులియా భావేశ్ ఎస్‌కె, వాయుసేన బృందానికి స్క్వాడ్రన్ లీడర్ అక్షర ఉనియల్ నేతృత్వం వహిస్తారు. ఢిల్లీ పోలీసు బృందానికి అదనపు డీసీపీ అనురాగ్ ద్వివేది నేతృత్వం వహించనున్నారు.


గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రధాన మంత్రి ఎర్రకోట ప్రాంగణంలోకి వెళ్తారు. అక్కడ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనీల్ చౌహాన్, చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, చీఫ్ ఆఫ్ ది నేవల్ స్టాఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి, చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వికె చౌదరి అభినందనలు తెలుపుతారు. జాతీయ జెండాను ఎగురవేయడానికి ఢిల్లీ ప్రాంత జీఓసీ ప్రధానమంత్రిని వేదిక వద్దకు తీసుకువెళ్తుంది.

జాతీయ జెండా ఎగురవేయడానికి ప్రధానమంత్రికి లెఫ్టినెంట్ సంజీత్ సింగ్ సహాయకులుగా ఉంటారు. 1,721 ఫీల్డ్ బ్యాటరీ(సెరిమోనియల్)కు చెందిన శౌర్యవంతులైన సైనికులు ఒకేసారి 21 గన్ సెల్యూట్ చేస్తారు. ఇందుకు దేశీ 105 ఎంఎం లైట్ ఫీల్డ్ తుపాకులను ఉపయోగిస్తారు. ఎగురవేసిన తరువాత మువ్వన్నెల జెండా 'రాష్ట్రీయ వందనం' అందుకుంటుంది. ప్రధానమంత్రి జాతీయ జెండాను ఎగురవేయగానే భారత వాయు సేనకు చెందిన రెండు ధ్రువ్ అధునాతన తేలికపాటి హెలికాప్టర్లు లైన్ ఆస్టర్న్ పద్ధతిలో వేదికపై పూలరేకులను చల్లుతాయి.

అనంతరం ప్రధానమంత్రి జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. ఆయన ప్రసంగం ముగిసిన తర్వాత నేషనల్ కాడెట్ కోర్ప్స్ (ఎన్‌సిసి)కి చెందిన కాడెట్లు జాతీయ గీతాన్ని ఆలపిస్తారు. దేశవ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన మొత్తం 2,000 మంది బాల, బాలిక క్యాడెట్లు(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఈ వేడుకల్లో పాల్గొంటారు. వీరు ప్రాకారానికి ఎదురుగా ఉన్న జ్ఞాన్‌పథ్‌లో కూర్చుంటారు. వీరు మువ్వన్నెల రంగుల్లో ఏర్పడతారు. నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్)కు చెందిన 500 మంది వాలంటీర్లు కూడా కార్యక్రమంలో భాగమవుతారు.

స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణ ముస్లిం మహిళా యోధులు

స్వరాజ్యం కోసం సాగిన సుదీర్ఘపోరాటంలో పరోక్షంగా, ప్రత్యక్షంగా పాల్గొన్న మహిళలెందరో. పాలక పక్షాలకు వ్యతిరేకంగా ప్రత్యక్ష కార్యాచరణకు దిగిన వారికి ప్రతిఫలంగా పలురకాల శిక్షలు లభించాయి. భారత జాతీయోద్యమానికి సహాయ, సహకారాలు అందించి ప్రపంచానికి తెలియకుండా ఉండిపోయిన ఆడపడుచులు ఎందరో. ఆ తల్లుల త్యాగాలు ఎంత శ్లాఘనీయమైనవైనా అధికారిక చిట్టాలకెక్కి అక్షరరూపం ధరించక పోవడంతో వారి వివరాలు తర్వాతి తరానికి అందుబాటులో లేకుండా పోయాయి. ప్రత్యక్ష పోరులో శిక్షలకు గురైన వారి వివరాలు మాత్రం ఆనాటి ప్రభుత్వ, పోలీసుల రికార్డులలో నిక్షిప్తమై ఉన్నందున కొంతలో కొంత ఆ యోధురాండ్ర సమాచారం లభ్యం అవుతుంది. ఈ విధంగా ప్రభుత్వ, పోలీసు రికార్డుల ఆధారంగా తయారైన గ్రంథాలలో స్థానం పొందిన తెంగాణ రాష్ట్రానికి చెందిన ముస్లిం మహిళా యోధులు కొందరు. ఈ రోజు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వారి పరిచయం క్లుప్తంగా నేటి మానవిలో...



సేకరణ: సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించిన 'భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణ ముస్లిం యోధులు' పుస్తకం నుండి

తొలి మహిళా మంత్రిగా...



మసుమా బేగం... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి మహిళా మంత్రి, తొలి ముస్లిం మంత్రి, మొత్తం భారత దేశంలోనే మంత్రి పదవిని చేపట్టిన తొలి ముస్లిం మహిళ అయిన ఈమె 1902 అక్టోబర్ 7న హైదరాబాద్‌లో జన్మించారు. తల్లి తయ్యిబా బేగం, తండ్రి ఖదీవ్ జంగ్. విద్యావంతురాలు, సంఘసేవకురాలైన తల్లి ద్వారా ఈమె ప్రభావితమయ్యారు. తయ్యిబా పత్రికల్లో వ్యాసాలు, నాలుగు నవలలు కూడా రాశారు. తండ్రి వైద్యశాఖలో ఉప డైరెక్టర్‌గా చేశారు. ఈమె కుటుంబం మొత్తం రాజకీయ నేపథ్యం కలిగిందే. మాసుమా 9 ఏండ్ల వయసులో లేడి హైదరి క్లబ్‌లో సభ్యురాలిగా చేరి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు విద్యావ్యాప్తికి నడుం కట్టారు. 1921లో విద్యావ్యాప్తి కోసం అంజుమన్- యే- ఖవాతీన్ సంస్థకు అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. 1927లో అఖిల భారత మహిళా సంస్థ హైదరాబాద్ నగర శాఖ ఏర్పాటు చేసి పలు బాధ్యతలను నిర్వహించారు. లండన్ ఉమెన్స్ కాన్ఫరెన్స్ అహ్వానం మీద లండన్ వెళ్లారు. జాతీయోద్యమంలో భాగంగా ఉనికిలోకి వచ్చిన పలు సంఘాలలో ఆమె సభ్యురాలయ్యారు. 1952లో షాలిబండ నియోజకవర్గం నుండి పోటీ చేసి గెలిచారు. తర్వాత మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మంచి వక్త, కార్యదక్షురాలుగా ఖ్యాతిగాంచిన మాసుమా బేగం అఖిల భారత మహిళా సంస్థ నేతగా అనేక దేశాలు కూడా పర్యటించారు.

తెలంగాణ ప్రజాపోరుకు తోడ్పడిన మోధురాలు



రజియా బేగం... 1916లో హైదరాబాద్ సంస్థానంలో జన్మించారు. ఆమె తల్లిది హైదరాబాద్ కాగా, తండ్రి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. నైజాం సంస్థానంలో ఈయన న్యాయాధికారి. తల్లిదండ్రులిచ్చిన స్వేచ్ఛతో రజియా తన అన్నదమ్ములతో పాటు చిన్ననాటనే స్వతంత్రభావనలు అలవర్చుకున్నారు. నిగార్ ఉర్దూ పత్రికను రహస్యంగా చదువుతూ చైతన్యం పొందారు. తమీర్ అనే గోడ పత్రికను ప్రారంభించారు. చిన్న చిన్న కథలు కూడా రాసేవారు. స్వయం కృషితో విద్యనభ్యసించిన రజియా తనకు నచ్చని ఆచారాలను తీవ్రంగా వ్యతిరేకించే వారు. బజ్మె ఏహ బాబ్ అనే సంస్థను స్థాపించి అనేక సామాజిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అన్నదమ్ములతో కలిసి జాతియోధ్యమంలో భాగమయ్యారు. తర్వాత కమ్యూనిస్టు పార్టీవైపుకు మొగ్గుచూపి కార్యక్రమాల్లో పాల్గొనేవారు. నిషేధంలోనూ పార్టీకి అండగా నిలబడ్డారు. అనేక కష్టాలు అనుభవించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానం విలీనం కోరుతూ జరిగిన పోరాటంలో తన వంతు పాత్ర పోషించారు. పోరాటం విరమించిన తర్వాత ఉమెన్స్ కాలేజీలో లెక్చరర్‌గా చేరారు. 1966లో యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో చేరారు. పర్షియన్ పీహెచ్‌డీ ఇరాన్‌లో చేశారు.

విలీనోద్యమంలో జైలుకెళ్లీ...



నఫీస్ ఆయేషా బేగం.. హైదరాబాద్‌కు చెందిన స్వాతంత్ర్య సమర వీరుడు జనాబ్ హమీద్ ఆలీఖాన్ కుమార్తె. తండ్రి ప్రభావంతో ఆమె హైదరాబాద్ కేంద్రంగా సాగిన జాతీయోద్యమంలో భాగస్వాములయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక ఇండియన్ యూనియన్లో చేరడానికి నిరాకరించిన నైజాం సంస్థానాధీశుల పట్ల నఫీస్ నిరసన వ్యక్తంచేశారు. నైజాం సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని, నైజాం నివాసులంతా భారతదేశ పౌరులుగా పరిగణించబడాలని ఆమె ఆకాంక్షించారు. దీని కోసం జరిగిన ఉద్యమంలో భాగం పంచుకున్నారు. హైదరాబాద్ కేంద్రంగా సాగిన ఆ ఉద్యమం జాతీయోద్యమ చరిత్రలో విలీనోద్యమంగా పరిగణించబడింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న నఫీస్‌ను 1948, సెప్టెంబర్16న అరెస్టు చేసి హైదరాబాద్ సెంట్రల్ జైలులో నిర్బంధించాయి. చివరకు నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. ఆ స్వాతంత్ర్య సమరయోధురాలు, విలీనోద్యమకారిణి పూర్తి వివరాలు తెలియలేదు. ప్రముఖ చరిత్ర పరిశోధకురాలు డాక్టర్ సరోజిని రేగాని సంపాదకత్వంలో WHO'S WHO OF FREEDOM STRUGGLE IN ANDHRA PRADESH శీర్షికతో 1978లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రచురించిన ప్రథమ సంపుటంలో ఆమె స్థానం పొందింది. ఈ విధంగా ఆ సంపుటంలో స్థానం పొందగలిగిన ఏకైక ముస్లిం మహిళ నఫీస్ అయేషా బేగం కావడం విశేషం.

ప్రజా పోరాటాలకు బాసటగా నిలిచిన యోధురాలు



జమాలున్నీసా బాజి... ఇండియన్ యూనియన్‌లో నైజాం రాష్ట్రం విలీనం కోరుతూ సాగిన ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా ఆ క్రమంలో సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో కూడా ప్రజల పక్షం వహించిన ముస్లిం మహిళా ఉద్యమకారులలో ఈమె ఒకరు. జమాలున్నీసా 1915లో హైదరాబాద్‌లో జన్మించారు. తండ్రి నైజాం సంస్థానంలో న్యాయాధికారి. కుటుంబంలోని పెద్దలు ఆచార సంప్రదాయాలు పాటించినా తల్లిదండ్రులు ఉదార స్వభావులు. తండ్రి నుంచి లభించిన స్వేచ్ఛతో భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగమయ్యారు. మతపరమైన ఛాందసాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. పెండ్లి తర్వాత ఆమె కొన్ని రోజులు ఇంటికే పరిమితం కావల్సి వచ్చింది. అప్పుడు కూడా పుస్తకాలు చదివేవారు. తర్వాత తిరిగి ఉద్యమంలో పాల్గొన్నారు. సాహిత్య సమావేశాలకు కూడా హాజరయ్యేవారు. కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులయ్యారు. 1946లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అన్ని రంగాల్లో సమానత్వం సమసమాజం ద్వారా మాత్రమే సాధ్యమని నమ్మిన ఆమె ఎంతో నిబద్ధతతో ముమ్ముందుకు సాగారు. నిర్బంధంలోనూ పార్టీ కోసం పని చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం ముగిసిన తర్వాత మహిళా సంఘం ఏర్పాటుకు కృషి చేశారు.

నిజాం గడ్డ మీద విదేశీవస్త్రాలను తగులబెట్టిన సాహసి



ఫక్రుల్ హాజియా హసన్... భారత స్వాతంత్ర్య సంగ్రామంలో స్వయంగా పాల్గొనడమే కాకుండా తన బిడ్డలను విముక్తిపోరాటం దిశగా ముందుకు సాగడానికి ప్రేరణగా నిలచిన తల్లులు అరుదుగా కన్పిస్తారు. జాతీయోద్యమంలో స్వయంగా పాల్గొనడంతో పాటు 'హైద్రాబాద్ హసన్ సోదరులు'గా విఖ్యాతిగాంచిన ముగ్గురు కుమారులను స్వాతంత్ర్య సమరయోధులుగా తీర్చిదిద్దిన ఈ తల్లి చరితార్థులయ్యారు. ఇరాన్ నుండి ఇండియా వచ్చి స్థిరపడిన కుటుంబానికి చెందిన హాజియా 1870లో జన్మించారు. ఉత్తరప్రదేశ్ నుండి హైదరాబాద్ వచ్చిన అమీర్ హసన్ను వివాహం చేసుకుని హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. భర్త అమీర్ హసన్ హైదరాబాద్ సంస్థానంలో ఉన్నతాధికారి, ఆయన ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలను పర్యటిస్తున్నందున ఆమె కూడా ఆయా ప్రాంతాలలోని ప్రజల భాషల పట్ల అమితా సక్తి చూపుతూ ఉర్దూతోపాటు ఆంగ్లం, మరాఠీ, కన్నడ, గుజరాతీ, భాషలే కాకుండా తెలుగును కూడా నేర్చు కున్నారు. ఈ సందర్భంగా మహిళల దుస్థితిని గమనించిన ఆమె ముఖ్యంగా బాలికల అభ్యున్నతికి కృషి ఆరంభించారు. బాలికల లో విద్యాభివృద్ధికై పలు పాఠశాలలు పెట్టించడానికి కృషి సల్పారు. జాతీయోద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారు. 1920లో మహాత్ముని పిలుపు మేరకు హైదరాబాద్ నగరంలోని త్రూప్ బజార్లోని తమ నివాసంలో విదేశీ వస్త్రదహనం గావించారు. ఖిలాఫత్ -సహాయనిరాకరణ ఉద్యమాల లోనూ చురుకైన పాత్ర వహించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ యోధులు అరెస్టులకు గురైనప్పుడు వారి విడుదల కోసం సరోజినీ నాయుడి సహకారంతో ఎనలేని కృషి సల్పారు. నాయకులు అందరూ ఆమెను ఆప్యాయంగా 'అమ్మా జాన్' అని సంబోధించే వారు. ఈమె 1970లో కన్నుమూశారు.

మహిళలపై దాడుల నిరోధానికి కఠిన చట్టాలు

పాఠశాల స్థాయిలోనే నైతిక విలువలు నేర్పాలి : గాంధీలో డాక్టర్ల నిరసనకు మంత్రి సీతక్క సంఘీభావం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళల భద్రతకు మరింత కఠిన చట్టాలను రూపొందించి అమలు చేస్తామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. అదే సమయంలో దాడుల నిరోధానికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని అభిప్రాయ పడ్డారు. తరగతి గదుల నుంచే పిల్లలకు నైతిక విలువలను, మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందించాలని సూచించారు. అందుకోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా పాఠ్యాంశాల్లో అవసరమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరముందని సూచించారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై లైంగిక దాడి ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు చేపట్టిన నిరసనకు ఆమె సంఘీభావం ప్రకటించారు. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోల్‌కతా ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. దేవతతో సమానమైన మహిళలు ఇప్పుడిప్పుడే బయటికి వస్తున్నారని చెప్పారు. వైద్యురాలిపై లైంగికదాడి హేయమైన ఘటన అంటూ అలాంటివి మహిళలను మళ్లీ మధ్య యుగాలకు తీసుకెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులకు తాము అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. తప్పు చేసిన వారు ఎవరైనా సరే..ఉపేక్షించకూడదని చెప్పారు. మహిళల భద్రత గురించి సమాజంలో ప్రతి ఒక్కరి ఆలోచన మారాలనీ, ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు కట్టుబడి పని చేస్తున్నట్టే మహిళల భద్రత కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. పని ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం కషి చేయాలని కోరారు. మహిళలపై దాడులు చేస్తే కఠినాతి కఠినమైన శిక్షలు పడతాయన్న భయం, భక్తి ఉండాలనీ, అలా ఉన్నప్పుడే అఘాయిత్యాలు నివారించబడతాయని ఆమె అభిప్రాయపడ్డారు.

ఐరాసలో భారత రాయబారిగా పర్వతనేని హరీశ్



న్యూఢిల్లీ: తెలుగు వ్యక్తి అరుదైన ఘనత సాధించారు. ఐఎఫ్ఎస్ అధికారి పర్వతనేని హరీశ్ న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితిలో భారత రాయబారి/ శాశ్వత ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ విషయాన్ని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది.1990 క్యాడర్ ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన హరీశ్.. ప్రస్తుతం జర్మనీలో భారత రాయబారిగా పనిచేస్తున్నారు. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. రుచిరా కాంభోజ్ జూన్‌లో పదవీ విరమణ చేసినప్పటి నుంచి ఈ పదవి ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే.2021 నవంబర్ 6న జర్మనీలో భారత రాయబారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. అప్పట్నుంచి ఆ పదవిలోనే కొనసాగుతున్నారు. అంతకముందు వివిధ పనిచేశారు. పర్వతనేని హరీశ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. గోల్డ్‌మెడల్ కూడా సాధించారు. ఆ తర్వాత ఆయన ఐఐఎం కలకత్తాలో విద్యనభ్యసించారు. ఆయనకు భార్య నందిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎమ్మెల్సీల నియామకాన్ని నియంత్రించలేం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి గవర్నర్ నామినేట్ చేయడాన్ని నియంత్రించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గవర్నర్ నిర్ణయాన్ని ఆపలేమని పేర్కొంది. అయితే, తెలంగాణలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. తుది తీర్పునకు లోబడే తదుపరి నియామకాలు ఉండాలని పేర్కొంది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ శాసనమండలికి సభ్యులను గవర్నర్ నామినేట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణలు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేలతో కూడిన ధర్మాసనం విచారించింది. కోర్టు తుది ఆదేశాలు ఇచ్చే వరకూ హైకోర్టు ఆదేశాలపై స్టేటస్ కో ఇవ్వాలని పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోరారు. అయితే, ధర్మాసనం హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తామనగా దీనికి సిబల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. "అభ్యంతరం ఎందుకు ? మీరు ఆదేశాలకు వ్యతిరేకంగా వచ్చారు కదా మేం స్టే ఇస్తాం"అని ధర్మాసనం ప్రశ్నించింది. అలా చేయడం వల్ల మళ్లీ నూతన సిఫారసులు చేసే అవకాశం ఉందని సిబల్ తెలిపారు. "శాసనమండలిలో పిటిషనర్ల నియామకాన్ని గవర్నర్ నిరాకరించినందున దావా వేయడానికి వారు అర్హులు. పిటిషనర్లను కాకుండా గవర్నర్ వేరే వారిని నియమించే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం సిఫారసు చేసిన ఇద్దరు వ్యక్తుల నియామక గెజిట్‌ను కూడా హైకోర్టు రద్దు చేసింది. ప్రస్తుతం అదే వ్యక్తుల్ని నియమించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నం చేస్తోంది" అని సిబల్ వాదనలు వినిపించారు. స్టేటస్ కో ఇవ్వడం వల్ల ఉపయోగమేమీ లేదని జస్టిస్ విక్రమ్ నాథ్ తెలిపారు. ఇవ్వకపోతే కొత్త వారిని నియమించ డమో, దీనికి కాలపరిమితి అయిపోతుందనో లేదా ఇంకేదైనా చెబుతారని సిబల్ తెలిపారు. "మరిన్ని చెప్పనిద్దాం. మీకు పోటీగా మరింత మంది సీనియర్ న్యాయవాదులు ఉన్నారు కదా, వారిని కూడా రానిద్దాం. ఏం చెబుతారో చూద్దాం" అని విక్రమ్‌నాథ్ వ్యాఖ్యానించారు. సిబల్ పట్టుబడుతున్నారని యధాతథ స్థితి కొనసాగించాలంటే, ఎవరి ద్వారా అని జస్టిస్ విక్రమ్‌నాథ్ మళ్లీ ప్రశ్నించారు. గవర్నర్ ద్వారా అని సిబల్ సమాధానమివ్వగా, అలా అయితే హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తే ఏమవుతుందని న్యాయూమర్తి పేర్కొన్నారు. తీర్పును నిలిపిస్తే మరో సమస్య వస్తుందని అప్పుడు పిటిషనర్‌ను నియమించాల్సి వచ్చే అవకాశం ఉంటుందని సిబల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశాలకు పిటిషనర్ వ్యతిరేకం కాబట్టి హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తామని న్యాయమూర్తి తెలిపారు. అనంతరం "కోర్టు తుది ఉత్తర్వులు వచ్చే వరకూ హైకోర్టు తీర్పుపై స్టే అమలులో ఉంటుంది" అని జస్టిస్ విక్రమ్ నాథ్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, గవర్నర్ మరొకరిని నియమిస్తారని సిబల్ పేర్కొనగా, దానిని ఆపలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. పిటిషనర్ నియామకం సరైనదే కాబట్టి నియంత్రిచొచ్చని సిబల్ పేర్కొనగా, దానికి న్యాయమూర్తి అంగీకరించలేదు. గవర్నర్ తాజా నామినేషన్‌ను కోర్టు ఆపలేదని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రివర్గం సిఫారసు చేస్తే ఆ నియామకంలో గవర్నర్ పాత్ర ఉండదని సుప్రీంకోర్టులో లార్జర్ బెంచ్ ముందు కేసు పెండింగ్‌లో ఉందని సిబల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లి, కేసులో విజయం సాధిస్తే న్యాయంగా పిటిషనర్ అర్హుడని తెలిపారు. సిబల్ సూచనను మంజూరు చేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం విచారణ పూర్తయ్యే లోపు చేసే ప్రతి నామినేషన్ తుది తీర్పునకు లోబడి ఉండాలని ధర్మాసనం ఆదేశాలను సవరించింది. ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని తదుపరివిచారణ వాయిదా వేసింది.

రాష్ట్రాలకే రాయల్టీ హక్కు

(మొదటిపేజీ తరువాయి)

భూములు, క్వారీలపై పన్ను విధించే రాష్ట్రాల అధికారాన్ని సమర్థించింది.

ఖనిజాలపై పన్ను విధించడంపై కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదాన్ని పరిష్కరించింది. ఫెడరలిజం పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా పన్నులు విధించే రాష్ట్రాల హక్కులను రక్షించాలని సుప్రీం కోర్టు ధర్మాసనం నొక్కి చెప్పింది. దీంతో దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైంది.

ఖనిజాలు, ఖనిజ నిక్షేపాలు గల భూములపై రాయల్టీ విధించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని 1989లో సుప్రీంకోర్టు తీర్పు తేల్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ కొన్ని రాష్ట్రాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఆ పిటిషన్లపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ బీవి నాగరత్న, జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎస్‌సి శర్మ జస్టిస్ ఎజి మసిహ్‌తో కూడిన తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గనులు, ఖనిజాలపై రాయల్టీ విధించే అధికారం రాష్ట్రాలకే ఉందని, కేంద్రానికి ఆ హక్కు లేదని జులై 25న 8-1 మెజారిటీతో తీర్పు ఇచ్చింది.

అయితే, ఈ తీర్పును 1989 నుంచి వర్తింపజేయాలని, గనులు, ఖనిజాలపై అప్పటి నుంచి కేంద్రం నుంచి విధించిన రాయల్టీ సొమ్మును వాపస్ ఇవ్వాలని కొన్ని రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. దీన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. రాయల్టీ వాపస్ ఇస్తే ఒక్క ప్రభుత్వ రంగ కంపెనీలే రూ. 70 వేల కోట్లు తిరిగి చెల్లించాల్సి వస్తుందని, అలా చేయడం ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లకు తీరని దెబ్బ అవుతుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకు తెలిపారు. అంతేగాక.. ఖజానా ఖాళీ అయి, పౌరులపై అధిక ధరల భారం పడుతుందని వివరించారు. తీర్పును గత నెల 25 నుంచి వర్తింపజేయాలని అభ్యర్థించారు.

దీనిపై ఇటీవల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. తాజాగా కేంద్రం అభ్యర్థనను తిరస్కరిస్తూ తాజా ఉత్తర్వులు వెలువరించింది. ఈ తీర్పుతో ఒడిశా, జార్ఖండ్, బెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది.

తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ నుంచి రాజ్యసభ ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ ఉప ఎన్నికలో అభిషేక్ మను సింఘ్వీని బరిలో నిలపాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయించారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం కెసి వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్‌కు ఉన్న బలం బట్టీ అభిషేక్ మను సింఘ్వీ ఎన్నిక లాంఛనమే.తెలంగాణ నుంచి తనను రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయంపై అభిషేక్ సింఘ్వీ ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతోపాటు ఆ పార్టీలోని సీనియర్లందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో హిమాచల్‌ప్రదేశ్ నుంచి అభిషేక్ మను సింఘ్వీ రాజ్యసభకు వెళ్లారు. ఆయన పదవి కాలం ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగియడంతో మళ్లీ హిమాచల్ ప్రదేశ్ నుంచే పోటీ చేశారు. అయితే అక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే హ్యాండ్ ఇచ్చారు. కాంగ్రెస్, స్వతంత్ర ఎమ్మెల్యే బీజేపీకి ఓటు వేశారు. దీంతో ఆ ఎన్నికలో స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారు. హిమాచల్‌ప్రదేశ్‌లో భంగపడిన అభిషేక్ మను సింఘ్వీ, తెలంగాణలో బయటపడనున్నారు.

ప్రపంచంతోనే పోటీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్తంగా కాగ్నిజెంట్‌కు 3.46 లక్షల మంది ఉద్యోగులు ఉంటే, దానిలో భారతదేశంలో 2.40 లక్షల మంది, వారిలో 57 వేల మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని వివరించారు. దానిలోనూ 39 శాతం మంది మహిళలే ఉన్నారని చెప్పారు. హైదరాబాద్‌తో తమది వ్యూహాత్మకమైన పెట్టుబడి అనీ, స్థానికంగా ప్రతిభావంతులైన యువతకు ఉపాధి కల్పిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఏఐ, ఎంఎల్, డేటా ఇంజినీరింగ్, ఐవోటీలో కట్టింగ్ ఎడ్జ్ సమస్యలకు ఈ కేంద్రం పరిష్కారం చూపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఎం బృందానికి ఘన స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులున్న సంగతి విదితమే. అమెరికా, దక్షిణ కొరియాల్లో పర్యటించిన వచ్చిన వీరికి పలువురు ఎంపీలు, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు.

కోల్‌కతా హత్యాచార ఘటనపై దర్యాప్తు షురూ

కోల్‌కతా : ఆర్జీ కార్ మెడికల్ కాలేజీని సందర్శించిన సీబీఐ, ఎఫ్ఎస్-ఎల్ బృందం దేశవ్యాప్తంగా కలకలం రేపిన కోల్‌కతా ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసును హైకోర్టు ఆదేశాలతో సీబీఐకి అప్పగించడంతో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ కేసు దర్యాప్తును సీబీఐ చేపట్టింది. దర్యాప్తు బాధ్యతను స్వీకరించిన వెంటే సీబీఐ ఢిల్లీ నుంచి ప్రత్యేక వైద్య, ఫోరెన్సిక్ బృందాన్ని ఘటనా ప్రాంతానికి పంపింది. ఇక కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసు దేశ వ్యాప్తంగా పెనుదుమారం రేపుతున్నది. ఈ కేసు దర్యాప్తును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఘటన జరిగి ఐదు రోజులు అయినప్పటికీ, దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నది. కేసు డైరీని సాయంత్రంలోగా, ఇతర డాక్యుమెంట్లను బుధవారం ఉదయం 10 గంటల్లోగా సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది.ఈ ఉదంతంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పందించారు. నిర్భయ ఘటన అనంతరం కఠిన చట్టాలు తీసుకురావడంతో పరిస్థితి మెరుగుపడుతుందని అనిపించినా, కథువా, ఉన్నావ్, హత్రాస్, లలిత్ పూర్ వంటి ఘటనలు దిగ్భ్రాంతి కలిగించాయని, దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు వెలుగుచూడటం విచారకరమని అన్నారు. కోల్‌కతా ఘటన దారుణ ఉదంతమని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్లు ప్రజలను ఆరోగ్యంగా ఉండేలా శ్రమిస్తుంటే మనం వారి భద్రతను కాపాడలేకపోతున్నామని వ్యాఖ్యానించారు.

మధ్యంతర బెయిల్ ఇవ్వలేం

కేజ్రీవాల్ కేసులో సుప్రీం స్పష్టం

సీబీఐకి నోటీసులు జారీ

23కు విచారణ వాయిదా



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

మద్యం కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు బుధవారం చుక్కెదురైంది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీబీఐ అరెస్టుపై కేజ్రీవాల్ పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అంగీకరించింది. ఈ మేరకు ఆయన పిటిషన్‌పై సీబీఐకి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై సీబీఐ ప్రతిస్పందన తెలపాలని కోరుతూ కేసు విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఇటువంటి "ప్రత్యేక అరెస్టును బీమా అరెస్టు అని పిలుస్తారు. 2023 ఏప్రిల్ లో కేజ్రీవాల్‌ను సీబీఐ విచారించిన తర్వాత, ఈ ఏడాది మార్చిలో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈడీ) ఆయనను అరెస్టు చేసింది. ఈడీ కేసులో బెయిల్ ఆదేశాలు కూడా పొందారు. మరికొన్ని గంటల్లో విడుదలకానున్న సమయంలో సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ అరెస్టుకు ఎలాంటి కారణం లేదని, మే 10న మనీలాండరింగ్ నిరోధక కేసు (పిఎమ్ఎల్ఎ)లో ఆయనకు మధ్యంతర బెయిల్ లభించింది. తర్వాత జూలైలో సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర బెయిల్ లభించింది. సీబీఐ కేసులో కింది కోర్టు కూడా బెయిల్ మంజూరు చేసింది. ఇలా మూడు బెయిల్ ఆదేశాలు పొందారు" అని సింఘ్వీ అన్నారు.

కేరళకు హై అలర్ట్

తిరువనంతపురం : కేరళ అంతటా రానున్న 72 గంటల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతవరణ శాఖ (ఐఎండీ) బుధవారం హెచ్చరించింది. రాష్ట్రంలో కొన్ని ఎంపిక చేసిన జిల్లాలకు ఐఎండి ఆరెంజ్, ఎల్లో అలర్ట్ ప్రకటించగా, రాష్ట్రంలోని మొత్తం 14 జిల్లాలను రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లో ఉంచుతున్నట్లు ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. వయనాడ్ విపత్తును దృష్టిలో ఉంచుకుని . కేరళ ప్రభుత్వం పలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంది. హైరేంజ్‌లు, కొండ ప్రాంతాలను నిశితంగా పర్యవేక్షించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున వాయనాడ్ జిల్లాలోని పుత్తుమలలో నివాసితులను ముందస్తు జాగ్రత్తగా సహాయక శిబిరానికి తరలించినట్టు తెలిపారు.

18న 'భారతవనం' పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-కోదాడ రూరల్

ప్రముఖ బాల సాహితీ వేత్త పుప్పాల కృష్ణమూర్తి రచించిన 'భారతవనం' పుస్తకావిష్కరణ సభ ఈనెల 18న ఉంటుందని కోదాడ రచయితల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న పెన్షనర్స్ భవన్‌లో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త, సుధా బ్యాంకు చైర్మెన్ పెద్దిరెడ్డి గణేష్ ఆవిష్కరించనున్నారు. తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య సభకు అధ్యక్షత వహించనున్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా కొత్తగూడెం బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు హాజరుకానున్నారు. ప్రముఖ విమర్శకులు, కథా, నవలా రచయిత శిరంశెట్టి కాంతారావు పుస్తకాన్ని సమీక్షించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త తండు కృష్ణ కౌండిన్య, రచయిత అనంతోజు మోహనకృష్ణ, ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్, ప్రశాంతి, కవి తుల శ్రీనివాస్, శేకు శ్రీనివాస్ తదితరులు పాల్గొననున్నారు.

జెండా పండుగలో ఉత్సాహంగా పాల్గొనాలి

- **బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు**

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి, జెండా పండుగలో ఉత్సాహంగా పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సూర్యాపేటలోని తమ నివాసంలో జాతీయ జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేటలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

ముత్యాలమ్మ గుడికి బాట ఏర్పాటు

నవతెలంగాణ-అర్వపల్లి

బోనాల పండుగన సందర్భంగా మండల కేంద్రంలోని ముత్యాలమ్మ దేవాలయానికి ఎమ్మెల్యే మందుల సామెల్ బాటను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాట కోసం పంచాయతీ రాజ్ ఏఇ బాబురావు గుడికి బాట కోసం ప్రజలకు ఇబ్బంది కలగకుండా మట్టిని పోయించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు భైరబోయిన, మహారాజ్ అర్వపల్లి గ్రామశాఖ అధ్యక్షులు మేకల రాంబాబు ఉన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

నవతెలంగాణ-నూతనకల్

పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేయడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎడవెల్లి లోని ప్రాథమికోన్నత పాఠశాలకి అదే గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తూముల సురేందర్ రావు ఆర్థిక సహాయంతో పూర్తి మైక్‌సెట్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కారింగుల రాజు, బయ్య గంగయ్య, పాఠశాల ఉపాధ్యాయులు సైదులు, ఏక స్వామి, బయ్య. దేవేందర్, కళమ్మ..అబ్రహం, ఉమ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-నకిరేకల్

మహాలక్ష్మి కంటి ఆసుపత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 15న తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు పసల మరియదాసు, కార్యదర్శి కందుల సోమయ్య తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాళికామాత అమ్మవారికి బోనాలు

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ పట్టణంలోని శ్రీస్వయంభు కాళికామాత దేవాలయంలో అమ్మవారికి స్థానిక కృష్ణవేణి పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మదేవర రవిశంకర్, కమిటీ సభ్యులు ప్రకాష్ , శ్రీనివాస్, పరమేష్, నాగరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య, ఉపాధ్యాయులు సైదులు, నరసింహ పాల్గొన్నారు.

బూట్లు పంపిణీ

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

పట్టణంలోని 11వ వార్డు కతాలగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వార్డు నివాసి కంచరకుంట్ల వెంకటరెడ్డి బూట్లు పంపిణీ చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి అన్నారు. బుధవారం కతాల్ గూడ ప్రాథమిక పాఠశాలలో బూట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాత కంచరకుంట్ల వెంకటరెడ్డి రాణి దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దండెంపల్లి సరోజ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, వార్డు పెద్దలు, మాజీ సర్పంచ్ గుజ్జుల జనార్దన్ రెడ్డి, కంకణాల నాగిరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, కంచర కుంట్ల వెంకట్ రెడ్డి, పజ్జురి పరమేష్, పజ్జురి సైదులు, దండెంపల్లి పరుశరామ్ బొడిగ జానయ్య, దాసరి ప్రశాంత్, దాసరి విజయ్, ఉపాధ్యాయులు చాంద్ బీ, ఆరోగ్యమ్మ, రాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుకలు

నవతెలంగాణ-తిరుమలగిరి

మండల కేంద్రంలోని ఫాతిమా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో బుధవారం ఇన్వెస్టిట్యూర్ సెర్మని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్ఐ సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఫాతిమా పాఠశాలలోని విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అద్భుతంగా చదువులో, సాంస్కృతిక రంగాలలో తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. పాఠశాల చైర్మెన్ బాలరాజు మాట్లాడుతు విద్యార్థులలో లీడర్షిప్ లక్షణాలను చిన్నతనం నుండే అలవర్చుకోవాలన్నారు. అనంతరం పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్, కాబినేట్ మెంబర్‌ను ప్రమాణ శ్రీకారం చేయించి వారికి, బ్యాడ్జీలు జెండాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామాంజనేయులు ఉపాద్యాయుని ఉపాధ్యాయులు, పాఠశాల ఏవో ఆంటోని, జోత్స్న పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు

- **సిఎస్ కు వివరించిన కలెక్టర్ నారాయణ రెడ్డి**
- **నేటికి జిల్లాలో 214 డెంగ్యూ కేసుల నమోదు**



నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్

సీజనల్ వ్యాధుల కారణంగా వచ్చే జ్వరం, డెంగ్యూ తదితర వ్యాధుల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకెలుతున్నామని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతి కుమారి కి వివరించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతకుమారి బుధవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు,సంబంధిత అధికారులతో సీజనల్ వ్యాధులు, స్వచ్ఛదనం- పచ్చధనం పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

సీజనల్ వ్యాధులకు సంబంధించిన సమీక్ష సందర్భంగా జిల్లా వివరాలను జిల్లా కలెక్టర్ సిఎస్ కు తెలియజేస్తూ జిల్లాలో గత నెల ఫీవర్ సర్వే నిర్వహించడం జరిగిందని, తిరిగి ఈనెల 16 నుండి మరోసారి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నల్గొండ తో పాటు, దేవరకొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాల నుండి జ్వరం కేసులు వస్తున్నాయని, జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుండి శాంపుల్స్ కలెక్షన్ తో పాటు, టెస్టులు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లాలో 214 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, బుధవారం తాను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధానాస్పత్రిని సందర్శించడం జరిగిందని, బుధవారం ఆసుపత్రిలో మొత్తం 604 ఓపి కేసులకు గాను, 90 ఫీవర్ కేసులు వచ్చినట్లు గుర్తించడం జరిగిందని వెల్లడించారు. నల్గొండ మున్సిపాలిటీ తో పాటు, తిప్పర్తి, కనగల్ దామరచర్ల నుండి కేసులు వస్తున్నాయని, ముఖ్యంగా దామరచర్ల ప్రాంతంలో జ్వర కేసుల నియంత్రణకు గతంలో ఒకసారి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, ఇప్పుడు సైతం మరోసారి ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అన్ని శాఖలను కలుపుకొని జ్వర నియంత్రణకు కృషి చేస్తామని ఆయన వివరించారు.

అప్రమత్తత అవసరం...

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ. శాంతి కుమారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో ఈ వ్యాధులపై అవగాహన తీసుకురావాలని, వ్యాధులకు గురైన వారికి తక్షణ చికిత్స అందించాలని, దోమల నివారణ చర్యలను చేపట్టాలని, ముఖ్యంగా వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకునే అంశంపై ఎక్కువ దృష్టి సారించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలను జిల్లా సీనియర్ అధికారులు సందర్శించాలని, జ్వరాలపై విద్యార్థులను, యాజమాన్యాలను అప్రమత్తం చేయాలని, ఎక్కడైనా అనుమానిత కేసులు ఉన్నట్లయితే తక్షణమే పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలని ఆదేశించారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరు దోమతెరలు , దోమల నివారణ చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన అంశంపై జిల్లా కలెక్టర్లు కూలంకషంగా సమీక్షించాలని, అదేవిధంగా రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్లలోని విద్యార్థులకు ఇచ్చే భోజనం, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా ఆదేశించారు.

సీజనల్ వ్యాధులు, జ్వర కేసులకు సంబంధించి ప్రైవేటు ,ప్రభుత్వ ఆసుపత్రులపై తో సమీక్షలు నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన సేవలందించే విషయంపై దృష్టి సారించాల్సిందిగా ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, ప్రైవేటు ఆసుపత్రులను కోరాలని అన్నారు. రానున్న వారం రోజుల పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులను జిల్లా కలెక్టర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. అంతేకాక ఎప్పటికప్పుడు ఈ రెండు అంశాలపై నివేదికను పంపించాలని, ప్రజల్లో ప్రభుత్వాసుపత్రుల పట్ల నమ్మకం కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు తక్షణ వైద్య సహాయం అందించినప్పుడే ఇది సాధ్యమవుతుందని ఆమె అన్నారు.

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం కింద మిగిలిపోయిన మొక్కలు నాటే లక్ష్యాన్ని తక్షణమే పూర్తి చేయాలని, వీధి కుక్కలు, కోతుల బెడద నుండి ప్రజలను కాపాడేందుకు స్టెరిలైజేషన్ పై దృష్టి సారించాలని , స్వచ్ఛదనం- పచ్చ చదనం కార్యక్రమం నిరంతరం కొనసాగే ప్రక్రియ అని అన్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టీ. పూర్ణచంద్ర, డి ఎఫ్ ఓ రాజశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిపిఓ మురళి, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల జిల్లా అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

సెప్టెంబర్ చివరి నాటికి సీఎంఆర్ 100 శాతం పూర్తి చేయాలి

- **ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నిత్యం రైస్ మిల్లులను తనిఖీ చేయాలి**
- **అదనపు కలెక్టర్ శ్రీనివాస్**

నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సెప్టెంబర్ చివరినాటికి కష్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాన్ని నూటికి నూరు శాతం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్ రైస్ మిల్లర్లను ఆదేశించారు.బుధవారం ఆయన తన చాంబర్లో సీఎంఆర్ పై రైస్ మిల్లర్లు,ఎన్ఫోర్స్మెంట్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ఈ సంవత్సరం సెప్టెంబర్ చివరి వరకు గడువు విధించిందని, అందువల్ల రైస్ మిల్లర్లు ప్రతిరోజు వారిగా కేటాయించిన లక్ష్యం ప్రకారం నిబంధనలను పాటించి సీఎం ఆర్ ను పూర్తి చేయాలని అన్నారు. ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది ప్రతిరోజూ రైస్ మిల్లులను తనఖి చేయాలని ఆదేశించారు.2022-23 ఆక్షన్ ను ధాన్యానికి సంబంధించి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం త్వరితగతిన బియ్యాన్ని లిఫ్ట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నాగేశ్వరరావు, పౌరసరఫరాల అధికారి జిల్లా వెంకటేశ్వర్లు, టీఎస్ డబ్ల్యూ సి రీజనల్ మేనేజర్ పద్మావతి, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు నారాయణ, కార్యదర్శి భద్రయ్య, ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది ఈ సమావేశానికి హాజరయ్యారు.

మున్సిపల్ కార్యాలయమా.? కల్యాణ మండపమా...?

నవతెలంగాణ-నాగార్జునసాగర్



నాగార్జునసాగర్ నందికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో స్థానిక కౌన్సిలర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఈ వేడుకలలో మున్సిపాలిటీ కమిస్నర్, చైర్మన్,వైస్ చైర్మన్,కౌన్సిలర్ లు పాల్గొన్నారని మున్సిపల్ కార్యాలయాన్ని ఫంక్షన్ హాల్ గా మార్చారని,ఇలాంటి పుట్టిన రోజు వేడుకలకు ఫంక్షన్ హాల్స్ బుక్ చేసుకొని వేడుకలు నిర్వహించుకోవాలని స్థానికులనుండి విమర్శలు వినివిపిస్తున్నాయి.గౌరవప్రదమైన కౌన్సిలర్ ఛాంబర్ లో మీడియాను గాని ఇతరులను ఎవరిని అనుమతించరు అలాంటి ఛాంబర్ లో ఈలాంటి వేడుకలు నిర్వహించడం బాధకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు మున్సిపల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నేడు ఉదయం 8:15 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి జాతీయ పథకాన్ని ఆవిష్కరిస్తారని మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. కార్యక్రమానికి వైస్ చైర్మెన్, కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది, సకాలంలో హాజరుకావాలని కోరారు.

మాదక ద్రవ్యాల తో జీవితాలు నాశనం చేసుకోవద్దు

నవతెలంగాణ - శాలిగౌరారం

మాదక ద్రవ్యాల తో మత్తుకు బానిసై బంగారం లాంటి జీవితాలను నాశనం చేసుకోవద్దని శాలిగౌరారం ఎస్ ఐ డి. సైదులు అన్నారు. మిషన్ పరివర్తన్ లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాలిగౌరారం లోని గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు.ఎస్ ఐ సైదులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో గీతాంజలి హై స్కూల్ కరస్పాండెంట్ దొంతూరి పరమేష్, ప్రిన్సిపాల్ చిత్తరంజన్, ఎఎస్ఐ వెంకటయ్య, కానిస్టేబుళ్ల ఊర నాగయ్య,హెూంగార్డ్ శ్రీనివాస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

ప్రయివేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ సదుపాయం కల్పించి, విద్యుత్ ప్రమాదంలో మరణించిన కార్మికులకు పది లక్షల ఆర్థిక సహాయం చేయాలని తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జానిపాషా అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు సామ కొండల్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు తోట శ్రవణ్ కుమార్ ఆదేశాల మేరకు తిరుమలగిరి మండల ఇన్చార్జి తహశీల్దార్ జాన్ మహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంధసిరి యాదగిరి ఉపాధ్యక్షులు అజ్గర్, ప్రధాన కార్యదర్శి తులసి ప్రవీణ్, కోశాధికారి షేక్ ఇమామ్, సహాయ కార్యదర్శి మహేష్, ప్రచార కార్యదర్శి మహేందర్ శోభన్, రమేష్ పాల్గొన్నారు.



నవచిత్రం

సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే తంగలాన్


విక్రమ్

విక్రమ్ విలక్షణ నటనకు చిరునామా. ఆయన నటించిన శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ వంటి తదితన చిత్రాలెన్నో నటుడిగా ఆయన ప్రత్యేకతను చూపించాయి. ఎప్పటికప్పుడు సరికొత్తగా ప్రేక్షకుల్ని అలరించే ఆయన 'తంగలాన్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందించారు. నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఈ సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటించారు.
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు (గురువారం) వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో హీరో విక్రమ్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

నేను నటించిన శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ వంటి మూవీస్ లాగే తంగలాన్ ఒక డిఫరెంట్ మూవీ. ఇదొక ఎమోషనల్ మూవీ. రా కంటెంట్‌తో ఉంటుంది. ఈ స్క్రిప్ట్ చేసిన తర్వాత రంజిత్ ఒక ట్రాన్స్‌లోకి వెళ్లిపోయాడు. సినిమా గ్రామర్ పాటించని సినిమా ఇది. పాటలు, ఫైట్స్, ఇంటర్వెల్ బ్లాక్, క్లైమాక్స్ ఇలా పా.రంజిత్ డిజైన్ చేయలేదు. ఈ సినిమా నాకొక బ్యూటిఫుల్ ఎక్స్‌పీరియన్స్.
నేను ఇప్పటిదాకా ఇలాంటి మూవీ చేయలేదు. ఇంత కష్టపడి చేయలేదు. దానికి కారణం..మా డైరెక్టర్ పా.రంజిత్. ఆయన నా దగ్గరకు ఒక కమర్షియల్ కథ తీసుకురాలేదు. పా.రంజిత్ కెరీర్‌లో కమర్షియల్ మూవీస్‌తో పాటు ఆర్టిస్టిక్ మూవీస్ చేస్తూ బ్యాలెన్స్‌గా కెరీర్ సాగిస్తున్నారు. తన సినిమాలతోనే దర్శకుడిగా ఆయన ఐడియాలజీ, స్పెషాలిటీ చూపించారు. పా.రంజిత్ చేసిన గొప్ప సినిమాల్లో తంగలాన్ ఒకటి అవుతుంది.

ప్రేక్షకుల్ని తంగలాన్ తన ప్రపంచంలోకి తీసుకెళు_ంది. జ్ఞానవేల్ నాకు ఇలాంటి మంచి సినిమా ఇచ్చినందుకు థ్యాంక్స్. ఇది మా కాంబినేషన్‌లో ఫస్ట్ మూవీ. ఇందులో రెండు క్యారెక్టర్స్ చేశాను. క్యారెక్టర్స్‌లో సహజంగా కనిపించేందుకు శారీరకంగా చాలా శ్రద్ధ తీసుకున్నాను.

ఇదొక బ్యూటిఫుల్ అడ్వెంచరస్ మూవీ. డైరెక్టర్ రంజిత్ తన ఆర్ట్ ఫామ్‌లో అందంగా రూపొందించాడు. మీకు సర్‌ప్రైజ్‌గా ఉండాలని సినిమా గురించి ఏమీ రివీల్ చేయడం లేదు. ఈ సినిమాలో అడ్వెంచర్, మెసేజ్, మ్యాజిక్, ఎమోషన్స్ ఉన్నాయి. ఇది పాన్ ఇండియా కాదు వరల్డ్ స్టేజీ మీదకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు జ్ఞానవేల్ రాజా.మీరు థియేటర్స్‌కు వచ్చినప్పుడు తప్పకుండా ఈ కంటెంట్‌తో కనెక్ట్ అవుతారు.



ఇజ్రాయిల్‌కు మరో విడత అమెరికా ఆయుధాలు !

- 2వేల కోట్ల డాలర్ల విలువైన ఆయుధ సరఫరాకు పచ్చజెండా
- గాజాలో 40వేలు దాటిన మృతులు

గాజా, వాషింగ్టన్ : ప్రపంచ దేశాలు, అంతర్జాతీయ సంస్థలు ఎంత మొత్తుకుంటున్నా పెడచెవిన పెట్టి మూర్ఖంగా, నిరంకుశంగా గాజాపై ఇజ్రాయిల్ దాడులు కొనసాగిస్తుంటే, దానికి మద్దతుగా అమెరికా తన వంతు సాయాన్ని అందిస్తూ దాడులకు ఆజ్యం పోస్తోంది. తాజాగా ఇజ్రాయిల్‌కు 2వేల కోట్ల డాలర్ల విలువ చేసే ఆయుధాల అమ్మకాలకు అమెరికా పచ్చజెండా ఊపింది. హమాస్ చీఫ్ హనియె హత్యకు ప్రతీకారంగా తాము ఇజ్రాయిల్ దాడులు చేసి తీరుతామని ఇప్పటికే ఇరాన్, మరోవైపు హిజ్బుల్లా ప్రకటించిన నేపథ్యంలో ఆ దాడులకు సమాయత్తమయ్యేలా ఆయుధాలను అమెరికా అందచేస్తోంది. గాజాలో, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయిల్ బలగాలు పదే పదే ఉల్లంఘిస్తున్నాయని సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నా అమెరికాకు చీమ కుట్టినట్లు కూడా అనిపించడం లేదు. ఇజ్రాయిల్‌కు వత్తాసు పలుకుతునే వుంది. తాజాగా ఆమోదించి ఆయుధాల అమ్మకాల్లో యుద్ధ విమానాలు, క్షిపణులు వున్నాయని అమెరికా విదేశాంగ శాఖ మంగళవారం ప్రకటించింది.ఇజ్రాయిల్ ఆత్మరక్షణ సామర్ధ్యాన్ని సముపార్జించుకోవడం అమెరికా జాతీయ ప్రయోజనాలకు కీలకమని అందువల్లే ఇజ్రాయిల్‌కు భద్రతకు అమెరికా కట్టుబడి వుందని విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ప్రకటించారు. బోయింగ్ ఎఫ్-15 యుద్ధ విమానాలు, గాల్లో నుండి గాల్లోకి ప్రయోగించగల అడ్వాన్స్‌డ్ మీడియం రేంజ్ క్షిపణులు, 120ఎంఎం ట్యాంక్ మందుగుండు, శక్తివంతమైన మోర్టార్లు, వ్యూహాత్మకమైన వాహనాలు ఇలా పలు రకాలు ఇజ్రాయిల్‌కు అందించే వాటిలో వున్నాయి. 50కి పైగా యుద్ధ విమానాలతో సహా కొన్ని ఆయుధాలను అందచేయడానికి సంవత్సరాలు కూడా పట్టవచ్చని భావిస్తున్నారు. 50వేల మోర్టార్ కాట్రిడ్జ్‌లు, 33వేల ట్యాంక్ షెల్స్‌తో సహా పలు పరికరాలు త్వరలో ఇజ్రాయిల్ చేరనున్నాయి. ప్రస్తుత, భవిష్యత్ శత్రు భయాలను ఎదుర్కొనడానికి ఈ ట్యాంక్ షెల్స్ బాగా ఉపయోగపడతాయని అమెరికా వ్యాఖ్యానించింది.

గాజాలో 56మంది మృతి

గత 24గంటల్లో గాజాలో 36మంది మరణించగా, బుధవారం ఉదయం సెంట్రల్, దక్షిణ గాజాల్లో జరిగిన దాడుల్లో మరో 20మంది మరణించారు. తాజా దాడులతో గాజాలో మృతుల సంఖ్య 40వేలు దాటింది. ఆక్రమిత్ వెస్ట్ బ్యాంక్‌లోని తమున్ పట్టణంపై ఇజ్రాయిల్ భద్రతా బలగాలు బుధవారం ఉదయం జరిపిన డ్రోన్ దాడిలో ఐదుగురు చనిపోయారు. గాజాలో ఇటీవల స్కూలుపై జరిగిన దాడి ఇజ్రాయిల్ ఉద్దేశ్యపూర్వకంగా చేసిందేనని ఐక్యరాజ్య సమితి మానవతా వ్యవహారాల సంస్థ భద్రతా మండలికి తెలియచేసింది. ఇటీవల పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని దాడులు



చేయడాన్ని ఇజ్రాయిల్ ముమ్మరం చేసిందని పేర్కొంది. ఖాన్ యూనిస్‌పై ముమ్మరంగా దాడులు జరుపుతామని తక్షణమే ప్రజలు వెళ్లిపోవాలని ఇజ్రాయిల్ ఆర్మీ మళ్ళీ ఆదేశాలు జారీ చేసింది. ఖాన్‌యూనిస్ పట్టణంపై జరిపిన తాజా దాడిలో ముగ్గురు పిల్లలతో సహా ఐదుగురు మరణించారు.






























Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886